గురువారం
31 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 312

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



అభిమాని చివరి కోరిక 10



పంచాయతీ ఎన్నికలు..
పరిసమాప్తం

- ప్రశాంతంగా ముగిసిన మూడో విడత పోలింగ్
- తుది దశలోనూ టీఆర్ఎస్‌దే హవా

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో తుది దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడో తుది విడత ఎన్నికల్లో భాగంగా 29 జిల్లాల్లోని 3,529 పంచాయతీల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 32,055 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,667 మంది సర్పంచి అభ్యర్థులతో పాటు వార్డుల్లో 67,316 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 88.8 శాతం పోలింగు నమోదైయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. లెక్కింపు పూర్తయిన తర్వాత ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించారు.

తుది విడతలోనూ టీఆర్ఎస్ జోరు

కాగా మూడో విడతలోనూ టీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు ఎక్కువ స్థానాలను కైవసం చేసుకున్నట్లు ఇప్పటి వరకూ అందిన సమాచారాన్ని బట్టి తెలిసింది. తుది విడత పంచాయతీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ మద్ధతుదారులు జోరు కొనసాగించారు. పార్టీ రహిత ఎన్నికలైనప్పటికీ ఆయా పార్టీల మద్ధతుదారులు పోటీ చేసిన విషయం తెలిసిందే. తొలి, మలి విడతలోనూ టీఆర్ఎస్ మద్ధతుదారులు భారీగా విజయం సాధించారు. ఈ విడతలోనూ సాయంత్రం వరకు అందిన ఫలితాల ప్రకారం టీఆర్ఎస్ మద్ధతుదారులు – 2086, కాంగ్రెస్ – 764 టీడీపీ– 11, బీజేపీ–43, సీపీఎం–16, సీపీఐ–14 గ్రామ పంచాయతీలను (తరువాయి 4లో)

చందా... దోషి



- బ్యాంక్ అంతర్గత నిబంధనలు ఉల్లంఘించారు
- వీడియోకాన్ కుంభకోణంపై జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదిక
- క్విడ్ ప్రో కో ఆరోపణలతోనే కొచ్చర్‌ను బోర్డ్ నుంచి తొలగించినట్లు ఐసీఐసీఐ స్పష్టం
- 2009 నుంచి బోనస్, ఇంక్రిమెంట్లు, మెడికల్ ఇన్సూరెన్స్ సహా ఇతర చెల్లింపులు వెనక్కు ఇవ్వాలని ఆదేశం

విజయక్రాంతి, ముంబై: వీడియోకాన్ – ఐసీఐసీఐ కుంభకోణానికి సంబంధించి ఆ బ్యాంకు మాజీ సీఎండీ, ఈ స్కాంలో ప్రధాన నిందితురాలు చందా కొచ్చర్‌కు (56) మరో షాక్ తగిలింది. ఈ స్కాంపై విచారణకు నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ స్వతంత్ర కమిటీ తన రిపోర్టును సంస్థకు అందించింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని స్వతంత్ర విచారణలో తేలింది. బ్యాంకుకు సంబంధించిన అంతర్గత నిబంధనలను ఆమె ఉల్లఘించారని కమిటీ తేల్చింది. ఈ మేరకు ఆమెను దోషిగా నిర్థారిస్తూ బ్యాంకు బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. అలాగే ఈ ఆరోపణలతోనే బ్యాంకు నుంచి ఆమెను తొలగించినట్టు బోర్డు ప్రకటించడం విశేషం. ఆమెకు సంబంధించిన చెల్లింపులను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. అంతే కాదు 2009 ఏప్రిల్ నుంచి 2018 మార్చి వరకు ఆమెకు చెల్లించిన బోనస్, ఇంక్రిమెంట్లు, మెడికల్ ఇన్సూరెన్స్ సహా ఇతర చెల్లింపులను బ్యాంకునకు తిరిగి చెల్లించాలని పేర్కొంది. 2008 నుంచి 2013 మధ్య వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ కంపెనీలు, చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ కంపెనీల మధ్య పలు ఆర్థిక లావాదేవీలు, యాజమాన్య బదలాయింపులు జరిగినట్టు 2018 మార్చిలో వెలుగు చూశాయి. దీంతో ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈవోగా ఉన్న చందా కొచ్చర్ పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కొచ్చర్ గత ఏడాది అక్టోబర్ లో తన పదవికి రాజీనామా చేశారు. వీడియోకాన్‌కు ఎస్‌బీఐ నేతృత్వంలోని 20 బ్యాంకుల కన్సార్టియం రూ.40,000 కోట్ల రుణం మంజూరు చేయగా అందులో రూ.3,250 కోట్లు ఐసిఐసిఐ బ్యాంక్ ఇచ్చింది. మార్చి 2012 వరకు రూ.1,730 కోట్ల మేర మోసం చేశారని ఆరోపిస్తూ చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్, న్యూ పవర్ రెన్యువబుల్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ సంస్థలపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.ఎన్. శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ వీడియోకాన్ రుణ కేసులో క్విడ్ ప్రోకో ఆరోపణలపై విచారణ జరిపింది. వీడియోకాన్ సంస్థకు రుణాల కేటాయింపు సందర్భంగా చందా కొచ్చర్ బ్యాంకు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు పేర్కొంది. ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈఓ చందా కొచ్చర్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఐసీఐసీఐ బ్యాంక్ దర్యాప్తు బృందం నిర్ధారించింది. స్వతంత్ర దర్యాప్తులో ఆమె చేసిన తప్పు వెల్లడైందని ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకటించింది. విశ్వసనీయ కర్తవ్యాలకు సంబంధించిన నియమావళిని చందా కొచ్చర్ ఉల్లంఘించినట్లు నిర్థారణ అయిందని బ్యాంకు పేర్కొంది. ఆమె రాజీనామాను 'టెర్మినేషన్ ఫర్ కాజ్'గా పరిగణిస్తామని, బోనస్ సహా ఇతర చెల్లింపులను నిలిపివేస్తామని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది.

గతమెంతో ఘనం..

1984 లో ఐసీఐసీఐ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన చందా కొచ్చర్, తొలి రోజుల్లో ఆ సంస్థ జౌళి, పేపర్, సిమెంటు విభాగాలలో పనిచేశారు. 1993 లో కొత్త బ్యాంకు ప్రారంభించాలనుకున్నపుడు సంస్థ యాజమాన్యం ఈమెను సంస్థ బ్యాంకింగ్ కోర్ కమిటీకి బదిలీ చేసింది. 1994 లో అసిస్టెంట్ మేనేజర్ గానూ, 1996 లో డిప్యూటీ మేనేజర్ గానూ పదోన్నతి సాధించారు. 1996 లో శక్తి (Power), టెలికాం మరియు రవాణా విభాగాలలో సంస్థను బలోపేతం చేయడానికి ఏర్పాటైన బృందానికి నాయకత్వం వహించారు.1998 లో సంస్థ జనరల్ మేనేజర్ గా పదోన్నతి సాధించారు. 1999 లో సంస్థ యొక్క ఈ–కామర్స్ విభాగాన్ని కూడా నిర్వహించారు. ఈమె నాయకత్వంలోనే సంస్థ రిటైల్ బ్యాంకింగ్ లో ప్రవేశించి, దేశంలోని ప్రైవేటు బ్యాంకులలో అగ్రగామిగా నిలిచింది. 2001 లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు చందా కొచ్చర్. అంతే కాకుండా చందా కొచ్చర్ ఇండియా– రష్యా బిజినెస్ లీడర్స్ ఫోరంలో మెంబర్‌గా కూడా ఉన్నారు. అంతర్జాతీయ మానిటరీ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలుగా కూడా వ్యవహరించారు. అలాగే భారత బ్యాంక్స్ అసోసియేషన్‌కు డిప్యూటీ ఛైర్మెన్‌గా పని చేశారు. తర్వాత 2014లో కెనడాలోని కార్లెటన్ యూనివర్శిటీ నుండి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఈమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2010 లో ఆమెను పద్మభూషణ్ తో సత్కరించింది. ఇక 2005 నుండి ఫోర్బ్స్ పత్రిక అత్యంత శక్తివంతమైన మహిళా వ్యాపారవేత్తల జాబితాలో స్థానం సంపాదించుకున్నారు. 2009 లో ఫోర్బ్స్ పత్రిక ప్రపంచ అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో 20 వ స్థానం నుంచి 2010 లో 10వ స్థానానికి ఎగబాకారు. బ్యాంకింగ్ రంగంలో అనేక ఉన్నత స్థానాలను అధిరోహించి ఎందరో మహిళా వ్యాపారవేత్తలకు ఆదర్శంగా నిలిచిన చందా కొచ్చర్ ఇప్పుడు అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ తన ప్రతిష్టను కోల్పోయారు.

జీవిత నేపథ్యం..

రాజస్థాన్ లోని జోద్‌పూర్‌లో 1961 లో జన్మించిన చందా కొచ్చర్... తన ప్రాథమిక విద్యాభ్యాసాన్నంతా సెయింట్ ఏంజెల్ సోఫియా పాఠశాలలో పూర్తిచేశారు. తర్వాత ముంబై జైహింద్ కళాశాల నుండి బి.ఎ . పట్టా సాధించారు. 1982 లో కాస్ట్ అకౌంటెంసీని పూర్తి చేశారు. తర్వాత జమునాలాల్ బజాజ్ ఇన్సిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో స్టడీస్ నుండి మేనేజ్‌మెంట్ విద్యను ఆమె పూర్తి చేశారు. వ్యాపారవేత్త అయిన దీపక్ కొచ్చర్ ను వివాహం చేసుకుని ముంబైలో స్థిర పడ్డారు. వారికి ఇద్దరు సంతానం.

సంక్రాంతికి పెరిగిన
రైల్వే ఆదాయం

- గతేడాది కన్నా 29 శాతం వృద్ధి
- 203 ప్రత్యేక, 60 జనసాధారణ్ రైళ్లు నడిపిన దక్షిణ మధ్య రైల్వే



విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి సీజన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం బాగా పెరిగింది. గతేడాది కన్నా 29 శాతం అధికంగా ఆదాయం వచ్చింది. గత సంవత్సరం సంక్రాంతికి జనవరి 11, 12, 13 తేదీల్లో జంట నగరాల్లోని స్టేషన్‌లలో సాధారణ టికెట్ల ద్వారా రూ.3.08 కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది అదే కాలానికి రూ.3.99 కోట్లు సమకూరింది. అన్‌రిజర్వ్‌డ్ ప్రయాణికుల సంఖ్య గత ఏడాది 3.79 లక్షలు ఉండగా ఈ సారి 18 శాతం అధికంగా 4.49 లక్షలుగా నమోదైంది. జనవరి 25 నాటికి దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ నుండి వివిధ ముఖ్య పట్టణాలకు 203 ప్రత్యేక రైళ్లను నడిపించింది. చివరి నిమిషంలో ప్రయాణం చేయాలనుకునే వారిని దృష్టిలో ఉంచుకొని 60 జనసాధారణ్ రైళ్లను నడిపింది. గత సంవత్సరం టికెట్ లేని ప్రయాణికులు 4,800 మందిని పట్టుకొని జరిమానా విధించగా ఈ సారి ఆ సంఖ్య తగ్గడంతో 3,300 మందికి జరిమానా విధించారు.

పార్లమెంటు ఎన్నికల్లో ..
ప్రాంతీయ పార్టీలదే హవా

- దేశ రాజకీయాల్లో ఫెడరల్ ఫ్రంట్ కీలకం
- ప్రధాని మోడీకి ఆదరణ తగ్గింది
- ప్రియాంక వచ్చినా ఒరిగేదేమీ లేదు
- 16 ఎంపీ సీట్లలో టీఆర్ఎస్ గెలుపు ఖాయం
- పసుపు బోర్డు కోసం పోరాడతాం
- బైసన్‌పోలో అప్పగింతపై కేంద్రాన్ని నిలదీస్తాం
- చంద్రబాబు స్వార్థంతో కాంగ్రెస్‌తో చేతులు కలిపారు
- చౌపాల్ ఆన్ ట్విట్టర్ కార్యక్రమంలో ఎంపీ కవిత



విజయక్రాంతి, హైదరాబాద్: దేశంలో త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు సత్తా చాటుతాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బుధవారం చౌపాల్ ఆన్ ట్విట్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఎంపీ కవిత సమాధానాలిచ్చారు. అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకే పార్లమెంటు సీట్లు ఎక్కువగా వస్తాయన్నారు. దేశ రాజకీయాల్లో ఫెడరల్ ఫ్రంట్ కీలకపాత్ర పోషిస్తుందని కవిత తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్‌లో కలిసేందుకు పలు (తరువాయి 4లో)

కూటమి గెలిస్తే..
రోజుకో 'ప్రధాని'

- బలమైన పీఎంతోనే దేశం అభివృద్ధి
- మళ్లీ మాదే అధికారం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా

విజయక్రాంతి, ఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కూటమి గెలిస్తే.. రోజుకొక్కరు ప్రధానిగా ఉంటారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీ కార్యకర్తలతో బుధవారం ఆయన మాట్లాడారు. అదే విధంగా ఉత్తర ప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ కూటమిగా ఏర్పడడంతో పాటు ఇటీవల కోల్‌కతాలో ప్రతిపక్షాల సభ జరిగిన సంగతి తెలిసిందే. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకున్న షా.. ఈ సందర్భంగా కూటమిపై పదునైన విమర్శలు గుప్పించారు. కూటమి తరుపున ప్రధానమంత్రి ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. 'బీజేపీ తరుపున ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ అని స్పష్టం. అయితే మీ సంగతి ఏమిట' అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే.. బలమైన నాయకుడైన నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అని (తరువాయి 4లో)



దిమాక్ ఖరాబ్



ఫిబ్రవరి 21న
రామమందిర నిర్మాణం ప్రారంభం


కుంభమేళాలో ప్రకటించిన ధర్మ సంసద్

ప్రయాగ్‌రాజ్ : అయోధ్యలో వివాదరహిత భూమిని రామమందిర న్యాస్‌కు అప్పగించేటట్లు సుప్రీం ధర్మాసనం చూడాలని కేంద్రం ఉన్నత న్యాయస్థానాన్ని కోరిన తరువాత మందిర నిర్మాణంపై కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అయోధ్య రామాలయం నిర్మాణాన్ని ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభించబోతున్నట్లు ధర్మ సంసద్ ప్రకటించింది. కుంభమేళా సందర్భంగా సమావేశమైన సాధు, సంతులు ఈ నిర్ణయం తీసుకున్నారు.ఉత్తరప్రదేశ్ లో కుంభమేళా సందర్భంగా అయోధ్య రామాలయం నిర్మాణాన్ని ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభించబోతున్నట్లు ధర్మ సంసద్ ప్రకటించింది. ప్రయాగ్ రాజ్‌లో లక్షలాదిగా వచ్చిన సాధు, సంతులు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. న్యాయస్థానం వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు అయోధ్యకు



సంబంధించి జడ్జీల కమిటీ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. అయోధ్యలో బాబ్రీ మసీదురామమందిరం కేసులో వివాదంలో లేని (తరువాయి 4లో)

కాంగ్రెస్‌కు..
కుమారస్వామి డెడ్‌లైన్



- వారం రోజుల్లోగా ఎమ్మెల్యేలను నియంత్రించాలి
- లేని పక్షంలో సీఎం పదవికి రాజీనామా చేస్తా
- ఎన్నికలకు సిద్ధమేనంటూ కాంగ్రెస్ సంకేతాలు
- అసంతృప్తులతో అధికారం కోసం బీజేపీ యత్నాలు

4

రైతులు, వ్యవసాయ కూలీలకు..
ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలి

తెలంగాణ రైతు రాజ్యం పార్టీ అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి డిమాండ్

విజయక్రాంతి, హైదరాబాద్: రైతు లేనిదే రాజ్యం లేదు.. అన్న నానుడిని సార్థకం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాములు హర్షనీయమని తెలంగాణ రైతు రాజ్యం పార్టీ అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి అన్నారు బుధవారం తార్నాకలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని కోరుతూ ఇక ముందు మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. పేద రైతులు, వ్యవసాయ కూలీలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్నివేళల నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలోఅందించాలని, అన్నివేళల ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేద రైతులు,వ్యవసాయ కూలీల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, 50 సంవత్సరాలు పైబడిన రైతుకు నెలకు రూ. 5,000 పింఛన్ ఇవ్వాలని కోరారు. నేడు పట్టణాలతో పాటు గ్రామాలలో మద్యం ఏరులైపారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. మద్యం మూలంగా పేద రైతులు ,కూలీల కుటుంబాలు ఛిద్రమై పోతున్నాయని, వెంటనే బెల్ట్ షాప్‌లను ఎత్తివేయాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేసారు. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటి, ఎంబీసీ వర్గాలకు ఏటువంటి పుచికత్తు లేకుండా బ్యాంకు ల ద్వారా రుణాలు ఇప్పించాలని ఆయన కోరారు. గ్రామ, మండల స్థాయి ప్రజా ప్రతినిధిలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో వసతుల కల్పనకు అతిథి గృహాలు కేటా యించాలని రవీందర్ రెడ్డి కోరారు.



శుభోదయం


ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికారి నామ సంవత్సరం	సూర్యోదయం : ఉ. 06:48	కరణం	: భాలవ 17:01 కౌలవ 29:57
ఉత్తరాయణం	సూర్యాస్తమయం : సా. 06:10	రాహుకాలం	: మ. 01:53, 03:18
హేమంత ఋతువు	పక్షము : కృష్ణ పక్షం	యమగండం	: ఉ. 06:52, 08:16
పుష్య మాసం	తిథి : ఏకాదశి 17:01	వర్జ్యం	: తె. 03:30, 05:15, సా.04:56, 6:40
	నక్షత్రం : జ్యేష్ఠ 18:40	అమృతకాలం	: ఉ. 9:08, 10:52
	యోగం : వ్యాఘాతా 29:48		





సూక్తి సుధ



ముందు నిన్ను నువ్వు సంస్కరించుకో! తరువాత సమాజాన్ని సంస్కరించు...

–గౌతమ బుద్ధుడు

అమ్మతనానికి నమస్కరిస్తున్నా...

మన భారతీయ సంస్కృతిలోనే కాదు మానవ మనుగడలోనే అమ్మతనానికి ఎంతో విలువ ఉంది. అందుకే అత్యున్నత ప్రేమను అందించే దేన్నైనా తల్లి హృదయంతో పోల్చుతారు. అలాంటి తల్లి హృదయం పురుషుడికి కూడా ఉంటుంది.

" ...యాదేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా..
నమస్తస్యై, నమస్తస్యై నమస్తస్యై నమోనమః"

ఏ అమ్మవారైతే సర్వ భూత(జీవుల) హృదయాలలో మాతృరూపంలో ఉందో ఆ దేవికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను..అని అర్థం. పురుషరూపంలో ఉన్న ఒక తల్లి లక్షల మంది క్షుద్బాధను తీరుస్తూ, లాలిస్తూ విద్యాభ్యాసం చేయిస్తూ వారి భవిష్యత్తుకు దారిదీపంలా సాక్షాత్కరించింది.

కర్ణాటకలో తుమకూరు జిల్లా సిద్ధగంగ మఠానికి పీఠాధిపత్యం వహించి నడయాడే దేవుడిగా కీర్తిగడించారు శివకుమార స్వామిజీ. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం, చేసిన ప్రతి బోధ... మానవాళికి శిరోధార్యాలే...

విద్యార్థులలో ముందు ఏదైనా తెలుసుకోవాలి, అనంతరం ఆచరించాలి అన్న జిజ్ఞాసను ప్రేరేపించారు. ముందుగా ఆత్మశుద్ధి అవసరమనే శివకుమారస్వామి సాధారణ విద్యతోపాటు ఆధ్యాత్మిక విద్యలోకూడా బోధనలు ఎంతో ప్రేరకాలుగా ఉండేవి....సమసమాజ నిర్మాణానికి ఒక క్రాంతినే (విప్లవాన్నే) తెచ్చి క్రాంతియోగిగా ప్రసిద్ధి చెందిన బసవన్న సిద్ధాంతాలను తు.చ. తప్పక పాటించారు. విద్యకు, ఆత్మజ్ఞానానికి అందరూ అర్హులే. దీనికి జాతిమతకుల భేదం లేదనే ఈ ఆత్మజ్ఞాని సమాజానికి ఈ విషయంపై చేసిన బోధలు అనేకం. బసవన్నే ఈ జన్మ మళ్లీ ఎత్తారని భక్తులు భావించేవారు. ఇతరులకు నీతులు చెప్పే ముందు తాను ఆచరించి తీరాలన్న నియమానికి స్వామీజీ ఎప్పుడూ కట్టుబడి ఉండేవారు. ఆత్మానుభూతిలోని ఆనందాన్ని ఆస్వాదించాలన్నా, సొంతం చేసుకోవాలన్నా ఆచరించవలసిన నియమాలు తాను ఎంత కఠినంగా పాటించేవారో బోధించేటప్పుడు ఎంతో అలవోకగా వివరించేవారు. బ్రహ్మచర్యం, అహింస, అస్థేయ, సత్య, అపరిగ్రహ, శౌచ, తపస్సు, స్వాధ్యాయ, ఈశ్వర, ప్రణిదాన తదితర అష్టాంగయోగాల్లో యమ నియమాలను ఎంతో క్రమశిక్షతో పాటించేవారు. పాటించలేనివారికి మరోమార్గంలో సూచనలు చేసేవారు. ఈ విరాగి తన జీవితకాలంలో అనేకానేక జ్ఞానజ్యోతులను వెలింగిచడంతో పాటు ప్రేమానురాగాల గంగాప్రవాహంతో సమాజాన్ని సశ్యశ్యామలం చేసిన త్యాగధనుడు.

'భక్తిమార్గంలో మనసుపెట్టి నడిచేవారిని నేను నిష్కామ కర్మ మార్గం వైపు మళ్లిస్తాను. ఈ మార్గంలో సంపూర్ణత్వం సిద్ధించిన వాడిని జ్ఞానమార్గోన్ముఖుణ్ని చేస్తాను. అనంతరం మోక్షగామిగా మలుస్తాను" అన్నాడు గీతాచార్యుడు. ఆ ఉత్తుంగ స్థితికి చేరాక ఆ వ్యక్తి సాక్షాత్తు పరబ్రహ్మే అవుతాడు. భగవానుడు చెప్పిన ఈ లక్షణాలన్నిటిలో పూర్తి అర్హత సంపాదించినవారు ఈ శివకుమారస్వామి. జితేంద్రియుడిగా, త్రిగుణాతీతుడిగా, నిష్కామ కర్మిష్టిగా జీవితాన్ని సంపూర్ణంగా సార్థకం చేసుకుని ఉత్తుంగానికి చేరిన మానవ దేహంలోని భగవంతుడి గురించి ఎంతచెప్పినా అల్పమే.

ఆయన జీవితంలోని చివరి అంకం కూడా అనంతమైన త్యాగభావనకు నిదర్శనంగా నిలుస్తోంది. శివకుమారస్వామి తన చివరి క్షణాల్లో తన ఉత్తరాధికారితో చెప్పిన మాటలు వింటే ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది. 'నాయనా నేను ఏ క్షణంలోనైనా దేహ త్యాగం చేయవచ్చు. నేను ఏ సమయంలో మృతిచెందినా... మఠం పిల్లలు, విద్యార్థులు కడుపునిండా భోజనం చేసే వరకు నా మృతి విషయాన్ని ప్రకటించవద్దు..' అని. మఠం అధికారులు సరిగ్గా అలాగే చేశారు. సోమవారం ఉదయం 11:44 గంటలకు స్వామీజీ శివైక్యం చెందారు. అయితే మఠంలో వాతావరణం ఏమాత్రం మారలేదు. అందరి భోజనాలు అయిన తర్వాత ఆయన పరమపదించిన విషయాన్ని ప్రకటించారు. ఇది ఒక మనిషి సంపూర్ణ సార్థక జీవితానికి పరాకాష్ట. మఠం నిర్వాహకులు స్వామి పార్థివశరీరాన్ని సందర్శించటానికి వచ్చే లక్షలాది మందికి అన్నదాసోహ వ్యవస్థ చేశారు. నా ఆశ్రమానికి వచ్చిన ఏ ఒక్కరూ ఖాళీకడుపుతో వెళ్లకూడదన్నది ఈ కర్మిష్టి నిశ్చిత సంకల్పం.



పనిలో ప్రతిసారీ ఫలితాన్ని ఆశించొద్దు.. ముందు పని మాత్రమే చేయి... అంటారు శివకుమారస్వామి. సన్యాసం స్వీకరించకముందు శివణ్ణ బెంగుళూరులో డిగ్రీ చదువుతుండగా మఠం ఉత్తరాధికారి మృతిచెందారు. తర్వాతి ఉత్తరాధికారి ఎవరని తర్జనభర్జన జరుగుతున్న సమయంలో మఠాధిపతి ఉద్ధానస్వామి శివణ్ణను ఆ బాధ్యతలకు ఎంచుకున్నారు. విషయం తెలుసుకున్న తండ్రి పరుగు పరుగున వచ్చి ఇంటిబాధ్యతలు తీసుకోమని శివణ్ణను బతిమాలారు. అప్పుడు తండ్రితో శివణ్ణ చెప్పిన మాటలు సిసలైన నిష్కర్మ ఫల భావానికి నిదర్శనంగా నిలుస్తుంది. 'మీరు నన్ను ఈ లోకానికి తెచ్చారు. ఈ ప్రపంచపు సేవకై నన్ను విడవండి. నా జీవితాన్ని దైవ సేవతో పాటు సామాజిక సేవకు కూడా... పెద్ద మనసు చేసుకుని నన్ను వది లేయండి" అని ఆ కుర్రాడు తండ్రితో తన భావి లక్ష్యాలను వివరిస్తూ వినయంగా చెప్పిన మాటలివి. అప్పటి నుంచి స్వామి సేవామార్గంలో అడుగడుగునా అవే కాంతులు.

నేను ఆయన ఉపయోగించే పరికరాన్ని మాత్రమే. ఆయన చెప్పినదారిలో నడుస్తున్నానంతే. చేసేదంతా పరమాత్మే... ఇదే కర్మకర్తృత్వ భావన. దీన్ని అనుక్షణం ఆచరించి చూపారు శివకుమారస్వామి. మనం చేసే పనిలో చిత్తశుద్ధి ఉంటే దైవాను గ్రహం నిండుగా ఉంటుందని ఆయన అనుక్షణం చెప్పేవారు.

పెద్దస్వామి అయిన ఉద్ధాన స్వామి గురువైన అటవీ స్వామివారి కాలంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అప్పట్లో మఠంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. ఉద్ధాన స్వామివారి కాలంలో పేద విద్యార్థులకు విద్యాదానం కూడా ప్రారంభమైంది. అయితే అప్పట్లో అన్ని విషయాల్లోనూ తగిన నిధులు లేక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బాలలకు సందర్శకులకు భోజన వ్యవస్థ కష్టంగా ఉండేది. అంతేకాదు పరిస్థితి ఇది అని గురువుగారికి వివరించబోతే "నన్నేం చేయమంటావు... బాధ్యత తీసుకు న్నావు శ్రమించు, సంపాదించు, పోషించు" అని నిక్కచ్చిగా చేప్పేశారు. ఈ మాటకు అందరూ అవాక్కయ్యారు. కానీ కర్మిష్టి అయి న శివస్వామి గురువుగారి మాటలోని పరమార్థాన్ని గ్రహించారు. జోలెపట్టారు. ఇంటింటికీ తిరిగారు. భిక్ష అడిగారు... ఎందు కు.. అంటే ప్రతి బాలుడిని మంచి కర్మిష్టిగా, ఆత్మజ్ఞానంగల ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలి. కానీ పేదరికం తాండవిస్తున్న వేల కుటుంబాల బాలలకు ఇది గగన కుసుమం కాకూడదు. జ్ఞానబోధనకు ముందు వారి ఆకలి తీరాలి, జ్ఞానాన్ని జీర్ణం చేసుకోవాలం టే విద్య అవసరం అన్న సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మారు స్వామిజీ.

శివ సూత్రాలు...

- సర్వ అశాంతులకు, అసంతృప్తికి నిలయం మనసు. మనసు పరిశుద్ధమైతే మాటకు గాంభీర్యం, రచనకు నిండుదనం వస్తాయి.
- ఒక విషయాన్ని మనం ఇప్పుడు తీవ్రంగా ఆలోచించాల్సి ఉంది. అదేం దురదృష్టమోగానీ మన సంస్కృతిపై మన ప్రజలే ఉదాసీనంగా ఉంటున్నారు. ఇది చాలా ప్రమాదకరం.ఈ పరిస్థితికి మన దేశనాయకులే బాధ్యులు. వారు అధికారదాహం, స్వార్థచింతన, భోగలాలసలతో దేశ హితాన్ని విస్మరించారు. వారు ఇప్పటికైనా మేల్కొని మన భాషలను, సంస్కృతులను సంరక్షించాలి.
- మన దృష్టిననుసరించే జగత్తు ఉంటుంది. అది మంచిదైతే లోకం కూడా మంచిగా కనిపిస్తుంది. చెడుదైతే చెడ్డగా కనిపిస్తుంది. కాబట్టి దృష్టిని బట్టే సృష్టి, భావాలనుబట్టే భవిష్యత్తు అన్నది సదా గుర్తుంచుకోవాలి.
- మన హైందవ సంస్కృతిలో గురువుకు ఎంతో మహత్తరమైన స్థానం ఉంది. మన ప్రాచీన పరంపర గురువుని ఆచార్య అనే సంబోధనతో గౌరవించి సర్వోన్నత స్థానాన్నిచ్చింది. అసలు ఆచార్యుడంటేనే ఘనీభూతమైన పాండిత్యం ఉన్నవాడని, నిరాడంబరుడని, త్యాగశీలుడని, సమాజ సంక్షేమాన్ని కోరేవాడని అర్థాలున్నాయి. మన పూర్వకాలపు ఉపాధ్యాయులు కేవలం చదువు చెప్పటం వరకే పరిమితం కాలేదు. సమాజాన్ని దిద్దే బాధ్యతకూడా చేపట్టేవారు. కానీ ఇప్పుడు గురువుపై నిర్లక్ష్యం, నిరాసక్తత పెరిగింది. ఇది దేశానికి మానవ సమాజానికికూడా మంచిదికాదు.
- క్రమం తప్పని సాధన ఒక శక్తిగా అభివృద్ధి చెందుతుంది. దీన్నే ఇచ్ఛాశక్తి అంటారు. ఇలాంటి ఇచ్ఛాశక్తి కలిగినవాడే లోక పూజ్యుడు అవుతాడు.

–జి.జగదీశ్వరి, బెంగళూరు

'జ్యోతిర్గణిత' సంస్కృత గ్రంథం సంకలనం

వేద విజ్ఞానం

భాగం-88

శక.1812లో "జ్యోతిర్గణిత" మనే పేరుతో, సంస్కృతంలో, బాగా ఉపయోగపడే గ్రంథాన్ని సంవత్సరంగా తీసుకున్నారు. నాటికల్ ఆల్మనాక్‌ల సంకలనానికి ఉపయోగపడే ఫ్రెంచి గ్రంథముల సాయంతో దీనిని సంకలన పరిచారు. ఈ గ్రంథం సాయంతో సాధించిన గ్రహస్థితులు, గతులు చాలా ఖచ్చితంగా ఉన్నాయి. వాస్తవానికి, ఆ విలువలను నాటికల్ ఆల్మనాక్‌తో పోలిస్తే, 1 కంటే తక్కువ భేదం ఉంటోంది. ఇటువంటి గ్రంథం ఈ ప్రాంతంలోనే కాదు, ఈ దేశములోనే ముద్రించబడలేదంటే అతిశయోక్తి కాదు. ఇందు సంవత్సర ప్రమాణానికి నక్షత్ర సంవత్సర ప్రమాణాన్ని గ్రహించారు. అది 365రో–15ఘ–22ప–53 విపరులుగా పేర్కొంటూ అయనాంశ వార్షిక గతి 50".2(స్పష్టగతి)ని సూచించారు. జీటా పిషియమ్‌ను సంధి నక్షత్రమైన రేవతిగా తీసుకొని, దాని సాయన రేఖాంశను గుర్తించారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే శక.1800కు 18డిగ్రీల–10'–25" అయనాంశను సూచించారు. ఈ రచయిత (దీక్షిత్), అయనాంశకు, సుమారుగా గ్రహలాఘవ అయనాంశను గ్రహించవలసిందిగా సూచించడం జరిగింది. దీని విలువతో సమానమైన రేఖాంశ గల నక్షత్రాన్ని ప్రారంభ స్థానంగా తీసుకొని ఉండవలసినది. గ్రహలాఘవ పద్ధతిలోని అయనాంశలతో సరిపోయే అయనాంశను తీసుకొనవచ్చని కేత్కార్ అంగీకరించాడు. దాని కొరకు చిత్రా నక్షత్రము రేఖాంశమును 180డిగ్రీలుగా తీసుకోవాలి. శక.1800 నాటికి 22డిగ్రీల అయనాంశను గ్రహించి ఉంటే, కేత్కార్ గ్రంథం బహుళ ప్రాచుర్యం పొందునని భావించడం జరిగింది. ఈ గ్రంథంలో 4 భాగములు ఉన్నాయి. 1వ భాగమంతా పంచాంగ గణితాన్ని వివరిస్తుంది. గ్రహగణితమంతా స్పష్టమేష సంక్రమణ సమయానికి చెప్పబడింది. 2వ భాగంలో గ్రహస్థితుల గణన, మధ్య స్పష్టగ్రహసాధన, చరఖండాలు, నక్షత్ర రేఖాంశాలు, ఉదయాస్తమయములు, మిగిలిన విషయాలు చర్చించబడ్డాయి. 3వ భాగంలో గ్రహణములు, గ్రహసంయోగాలు, చంద్రశృంగోన్నతి సాధన మొదలగునవి ఉండగా, 4వ భాగమందు లగ్నసాధన, త్రిప్రశ్నాధికారం చూపబడ్డాయి. ఈ గ్రంథములోని విషయమంతా ఒక క్రమంలో వివరించబడినది. అందులో పద్ధతి, ఉదాహరణ, పట్టికలు, సిద్ధాంత వివరణ ఈ వరుసలో సాగుతుంది. గణతమునకు సంబంధించిన పట్టికలు, ఈ గ్రంథములో ఉన్నాయి. త్రికోణమితి, లాగరిథమ్స్ తెలియనివారు సైతం సులభంగా గణితం చేయగలిగే విధంగా ఈ గ్రంథం సంకలనం చేయబడింది. కేరోపంత్ పంచాంగాన్ని దీని సాయంతో సులభంగా సంకలనం చేయవచ్చును. అయితే ఈ గ్రంథం ఇంత వరకు ముద్రణకు నోచుకోలేదు.

–డా|| రేమెళ్ల అవధానులు

ఏది భుజించినా సత్ క్రియలు చేయాలి

శ్లో|| ఇక్షురాపః పయో మూలం తామ్బూలం ఫలమౌషధమ్|
భక్షయిత్వాஉపి కర్తవ్యాః స్నానదానాஉஉదికాః క్రియాః||

చాణక్యం

చెరకు, నీరు, పాలు, దుంపలు, తాంబూలం, పండ్లు, ఔషధము మొదలైనవి భక్షించినను స్నానము, దానము, పూజ మొదలగు సత్క్రియలు చేయాలని పైన పేర్కొన్న శ్లోకంలో చాణక్యుల వారు తెలియచేస్తున్నారు. ఇంకా ఇలా వివరిస్తున్నారు. శక్తిలేనివాడు, రోగి, యాత్రలో ఉన్న వాడు, వ్యసనాల్లో చిక్కుకున్నవాడు జలాది పానము చేసి ఔషధులు సేవించినను, సంధ్యా వందనం, యజ్ఞము, పూజాపాఠం, స్నానం, దానం మొదలగు క్రియలు చేయవలెను. శుభకర్మలు విడిచిపెట్టరాదు. సాధారణంగా దైవ కార్యాలు చేయడానికి కొన్ని నియమాలు, శుచి, శుభ్రత వంటివి ఉంటాయి. బ్రహ్మీ కాలంలో నిత్య కార్యక్రమాలు ముగించుకుని శుచిగా స్నానానంతరం దైవకార్యాలు అయిన సంధ్యా కార్యక్రమాలు, ఇతర పూజాధికాలు, యజ్ఞం మొదలైనవి చేయాల్సి ఉంటుంది. వీటికి కొన్ని మినహాయింపులు పేర్కొంటున్నారు. భక్తితో రోజూ ఈ పూజాధికాలు చేసేవారు వారు కొన్ని సందర్భాల్లో బలహీనంగా ఉన్నను, లేదా స్వల్పకాలంగా, అంత తీవ్రత లేని రోగాలు సోకినప్పుడు, యాత్రలు చేస్తున్నవారు వారికి సందర్భాలు దొరకవు కాబట్టి, శుచిగా లేకపోయినను అందుబాటులో ఉన్నవాటితో పైన చెప్పిన వన్నీ చేయవచ్చునని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రములో పేర్కొంటున్నారు. అంతేగాకుండా కొన్ని పదార్థాలను భక్షించనను పూజాధికాలు నిర్వర్తించవచ్చునంటున్నారు. అవి చెరకు రసం, మంచి నీళ్లు, పాలు, దుంపలు, తాంబూలం, పండ్లు, ఔషధ సేవనం వంటివి సేవించినా పైన పేర్కొన్న పూజాధికాలు, ఇతర భక్తి కార్యక్రమాలు నిర్వహించవచ్చునని తెలియచేస్తున్నారు. మొత్తం మీద పూజాధికాలు, ఇతర రోజువారి కార్యక్రమాలు జరుపుతూనే ఉండాలంటున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. దంబోద్భవ మహారాజును జయించిన వారు?
2. శక్తి ఎవరి కుమారుడు?
3. కురుక్షేత్రం ఏ నదికి సమీపంలో ఉంది?
4. భ్యాతి, భృగువుల సంతానం?
5. వాలఖిల్యుల తల్లిదండ్రులు?
6. సతీ సావిత్రి భర్త పేరు?
7. బ్రహ్మ దేవుని బొటన వ్రేలు నుండి పుట్టిన వాడు?
8. సంధ్యాకాలమున సంచరించు దేవుడు?
9. దక్ష ప్రజాపతి కుమార్తె?
10. రజోగుణం ప్రధానంగా గల దైవం?

జవాబులు

1. నరనారాయణులు 2. వశిష్ఠుడు 3. [illegible] 4. ధాత, విధాత 5. క్రతువు, సన్నతి 6. సత్యవంతుడు 7. దక్షుడు 8. శివుడు 9. సతి 10. బ్రహ్మ

త్రికోణాంతర దీపికా



'త్రికోణాంతర దీపికా' : 'త్రిభుజం' అనే మూడు రేఖల ఖండిత స్థలం. త్రికోణం మధ్యలో దీపం వలె, వెలుగుతున్న దేవత. మూలాధార పద్మకర్ణిక లోని త్రికోణంలో సూర్యునికంటే అధికమైన వెలుగుతో ప్రకాశించునది. దీపికత్వ ధర్మం కలది. 'తంత్ర రాజం' లోని ఉదయిస్తున్న మూలాధారంలో అగ్నిమండలం, వికసిస్తున్న హృదయంలో (సూర్యునిలో) సూర్య మండలం, శిరస్సునందు వికసిస్తున్న బ్రహ్మరంధ్రానికి కిందివైపు చంద్రమండలం ఉన్నది. ఇవి మూడూ ఖండాలుగా ఉన్నవి. ఒక్కొక్క ఖండంలో శ్రీవిద్యా స్వరూపమైన నిత్యదేవత మూడు స్వరూపాలుగా ఉన్నది. అగ్ని, సూర్య, చంద్ర. ఈ ముగ్గురి సమాన ధర్మమే మేలు కలయికగా త్రిపురసుందరి స్వరూపం వెలసింది. వెలుగునిచ్చే శక్తి అనే సామాన్య ధర్మం కల దేవతగా చంద్రసూర్యాజ్ఞులను ప్రతిపాదించారు. మూడు ధర్మాలతో, మూడు రూపాలతో, వెలుగొందుతూ ఏక సాధారణ ధర్మంగా దీపికత్వం సాధ్యమైంది. ఉదా : సూర్యుడు మేరువు నకు ప్రదక్షిణ చేస్తుండగా మూడు కోణములను మాత్రమే ప్రకాశింప చేయగలుగుతున్నాడు.

సూర్యుడు ప్రధాన దిక్కులకు మధ్యనుండటం వల్ల ఆగ్నేయ, ఈశాన్య మూలలను (విదిక్కులను) ప్రకాశింపచేయుచున్నాడు. ఈ రెండూ ప్రధాన త్రికోణ రేఖల మధ్యలో ఉన్నవి. అప్పుడు దక్షిణ దిక్కులో ఉదయం, ఆగ్నేయ కోణంలో ప్రథమ యామం తూర్పున, మధ్యాహ్నం ద్వితీయయామం. ఉత్తర దిక్కున అస్తమయం చతుర్థాయామం. ఈ విధంగా జరుగుతున్నది. సూర్యసంచారాన్ని బట్టి త్రికోణ = మూడు దిక్కులను, అస్తం = రెండు విదిక్కులను (ంచీచీ శిరీరిశిలి, దీపికా = ప్రకాశింపచేయుచున్నాడని అర్థం. ఈ త్రికోణం మధ్యలో త్రిపురసుందరి ప్రకాశిస్తున్నది.


శబ్దపరంగా: మం ద్ర, మధ్యమ, తారాస్థాయి
స్వరపరంగా: ఉదాత్త, అనుదాత్త, స్వరితాలు
మాతృపరంగా: ప్రమాతృ, ప్రమేయ, ప్రమాణాలు
లోకపరంగా: భూర్, భువ, సువర్లోకాలు
జ్ఞానపరంగా: జ్ఞాన, జ్ఞేయ, జ్ఞాత

ఈ మూడేసి చొప్పున త్రిపుటితో కూడుకొన్న త్రికోణం. ఆ త్రికోణానికి మూడువైపులా మూడు శీర్షాలలో అధిష్టాన స్వరూపాలైన కామేశ్వరి, వజ్రేశ్వరి, భగమాలిని దేవతలు కొలువై ఉంటారు. ఈ ముగ్గురు తేజస్వరూపిణుల ఐక్యస్వరూపమే త్రిపుర సుందరి. ఆమె ప్రాణ, వాయు, జ్యోతి స్వరూపంతో స్థిరమై ఉంటుంది. సకల జీవరాశులలో ప్రస్ఫుటంగా నెలకొని ఉన్న ఈ దేవత త్రికోణాంతర దీపికా. ఈ చక్ర కేంద్ర బింధువు ఆవరణలో పదహారుగురు నిత్య దేవతలు ఉంటారు. వీరు లలితాదేవితో సమానంగా తేజస్సు, పరాక్రమం, మహిమలను కలిగి ఉంటారు. అంతేకాక, వీళ్ళు కాలస్వరూపులు. కనుక సర్వకాల సర్వావస్థలలో విశ్వమంతా వ్యాపించి ఉంటారు.

త్రిగుణాత్మక స్వరూపిణి

సర్వమంగళాలను చేకూర్చి, సర్వార్థాలను సాధించి పెట్టే మూడు ధర్మాలు, మూడు రూపాలు కల త్రిపురసుందరియే సర్వాంతర్యామి.

'శ్రీ' బీజమున 'శవర్ణరేఫతురియ' స్వరములు సత్వ, రజ, స్తమోగుణ వాచకములు. ఈ మూడింటి ఐక్య స్వరూపంగా 'శ్రీ' బీజం. ఇది అవ్యక్త స్వరూపం. శ్రీమాత అయిన బిందురూప పరాశక్తి త్రికోణ మధ్య బిందువుగా బాలాత్రిపుర సుందరియై దర్శనమిస్తున్నది. అమృతాన్ని ప్రసాదించి, జన్మరాహిత్యంతో మోక్షప్రదాతయై అనంత ఐశ్వర్యాది సంపన్నతలను తన భక్తులకు ఇవ్వగలదని నా నమ్మకం (విశ్వాసం).



– సి. విజయలక్ష్మీ రాజం

ధర్మ సందేహాలకు సమాధానాలు

స్వాధ్యాయమంటే ఏమిటి?

"ఋతంచ స్వాధ్యాయ ప్రవచనేచ
సత్యంచ స్వాధ్యాయప్రవచనేచ
తపశ్చస్వాధ్యాయప్రవచనేచ,
దమశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
శమశ్చ స్వాధ్యాయప్రవచనేచ,
అగ్నయాశ్చస్వాధ్యాయ ప్రవచనేచ
అగ్నిహోత్రంచ స్వాధ్యాయప్రవచనేచ,
అతిథయాశ్చ స్వాధ్యాప్రవచనేచ,
ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనేచ,
ప్రజాపతిశ్చ స్వాధ్యాయప్రవచనేచ"



యథార్థమైన ఆచరణతో చదువుతూ, చదివిస్తుండాలి! సత్తాచారంతో సత్తమైన విద్యలను చదువుతూ, చదివిస్తూండాలి! తపస్సుచేస్తూ, వేదాదిశాస్త్రాలను చదువుతూ, చదివిస్తుండాలి! బాహ్యేంద్రియాలను దుష్టాచారాలనుండి దూరం చేసి చదువుతూ, చదివిస్తుండాలి! మనోవృత్తిని అన్నిదోషాల నుండి తొలగించి చదువుతూ, చదివిస్తుండాలి! ఆహవనీయాది అగ్నులను తెలుసుకొని చదువుతూ, చదివిస్తుండాలి! అగ్నిహోత్రం చేస్తూ చదువుతూ. చదివిస్తుండాలి! అతిథుల సేవచేస్తూ చదువుతూ చదివిస్తుండాలి. మనష్య వ్యవహారాలను నిర్వహిస్తూ చదువుతూ, చదివిస్తుండాలి! ప్రజా సంబంధవ్యవహారాలు యథావిధిగా చేస్తూ చదువుతూ చదివిస్తుండాలి! సంతానాన్ని, రాజ్యాన్ని పాలిస్తూ చదువుతూ, చదివిస్తుండాలి! వీర్యాన్ని రక్షిస్తూ, వృద్ధి పరుస్తూ చదువుతూ, చదివిస్తుండాలి! తమసంతానాన్ని, శిష్యులను పాలిస్తూ చదువుతూ, చదివిస్తుండాలి. –(శ్రుతిప్రమాణం) స్వాధ్యాయాన్ని ఒక యజ్ఞంగా పేర్కొన్నాడు కృష్ణుడు, సద్గ్రంథాలను చదవడమే స్వాధ్యాయం. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఋషులు. పురాణపురుషుల జీవితాల అధ్యయనం వంటివన్నీ స్వాధ్యాయం క్రిందకే వస్తాయి. ఒంటరిగా కూర్చొని అధ్యయనం చేయడమే స్వాధ్యాయం. పారాయణ. పఠనం అనేవి స్వాధ్యాయంలో మొదటిదశ. రెండోదశలో చదివిన విషయాన్ని క్షుణ్ణంగా ఆలోచించి, అర్థం చేసుకోవాలి. తర్వాత క్రమంగా ఆ విషయాన్ని ఆచరణలో పెట్టాలి.

–డా|| పి.భాస్కరయోగి

మహాత్ముడికి వాడవాడలా శ్రద్ధాంజలి

విజయక్రాంతి, ఆదిలాబాద్: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని దేశంకోసం ప్రాణాలను అర్పించిన మహనీయులకు బుధవారం ప్రభుత్వశాఖల ఉద్యోగులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఉదయం 11గంటలకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మహాత్ముడితో పాటు దేశం కోసం పాటుపడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుని కొనియాడారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ సంధ్యారాణి, డీఆర్వో నటరాజన్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి మౌనం పాటించారు.

స్వయం ఆలోచనలతో ఉపాధి అవకాశాలు



విజయక్రాంతి, కరీంనగర్ : యువత స్వయంగా ఆలోచనలు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని, స్వయం ఉపాధి దిశగా యువత ముందడుగు వేయాలని సమాచార శాఖ ఉపసంచాలకులు ఎన్. వెంకటేశ్వర్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల యువ పారిశ్రామిక వేత్తల అవగాహన శిక్షణా శిబిరం బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభా సామర్థ్యాలకు కొదువలేదని, యువతకు పుష్కలమైన ఉద్యోగవకాశాలు ఉన్నాయని అందుకోసం లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో చదివి విజయాన్ని అందుకోవాలని సూచించారు. అపజయాల నుండే విజయం లభిస్తుందని, విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను మోరుగుపరచుకోవాలని అన్నారు. యువతకు వ్యాపారాత్మకమైన నైపుణ్యాలకు తగిన శిక్షణను ఇవ్వడానికి ప్రభుత్వ కళాశాలల్లో స్వయం ఉపాధి కోసం పారిశ్రామిక సదస్సులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే పరిశ్రమలు స్థాపించి మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సీఏ లు రఘువీర్‌రెడ్డి, ఆంజనేయులు, హిమబిందు, సతీష్, సత్యనారాయణ, గిరిబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మూడవ విడత పంచాయితీ ఎన్నికలు



విజయక్రాంతి, నల్లగొండ: మూడవ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. మూడవ గ్రామ పంచాయతి ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ప్రజలకు, ఎలాంటి అవాంతరాలు, అసౌకర్యాలు కలుగకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ఎన్నికలు జరగడం అభినందనీయం అని నల్లగొండ డివిజన్‌లో 11 మండలాల్లో 257 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ఏకగ్రీవంకాగా 241 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరిగాయని ఈ ఎన్నికల్లో 6217 మంది సిబ్బంది పాల్గొని ఎన్నికలు సజావుగా జరుగుటకు కృషి చేశారని ఆయన అన్నారు. మొత్తం పోలింగ్ 60శాతం నమోదు జరిగిందని ఆయన అన్నారు. గ్రామాల్లో ఉదయం 7 గంటల నుండే ప్రజలు భారీ ఎత్తున పోలింగ్ సెంటర్ల వద్ద క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రతి ఓటరు ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లి తమ ఓటు హక్కును వినయోగించుకున్నారని, సాయంత్రం ఓట్ల లెక్కింపు వరకు ఎలాంటి అవాంచనీయ జరగకుండా జిల్ల అధికారులు, పోలీస్‌శాఖ సమన్వయంతో వ్యవహరించి ప్రశాంతంగా గ్రామల్లో ప్రశాంగా ఎన్నికలు ముగిసేటట్లు కృషి చేశారని వారందనికి అభినందనలతో పాటు ధన్యవాదాలు తెలిపారు.



మహాత్మాగాంధీ వర్ధంతిని మిర్యాలగూడాలోని (కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడలు శాఖ) నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ స్థానిక అధ్యక్షుడు పృధ్విరాజ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. నెహ్రూ యువకేంద్రం స్థానిక కోఆర్డినేటర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలి

విజయక్రాంతి, వరంగల్: జాతిపిత మహాత్మాగాంధీ 71వ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ఘననివాళులర్పించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మహాత్ముని చిత్రపటానికి బల్దియా కమిషనర్ ఎన్.రవికిరణ్ తో పాటు అధికారులు , సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగేశ్వర్, ఆర్ఎఫ్ఓ జివి నారాయణరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి ఎం.నాగయ్య, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవి శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, జనరిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.హన్మకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ అధ్యక్షులు కట్ల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గాంధీజీ చిత్రపటానికి మరియు పబ్లిక్‌గార్డెన్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ నమిండ్ల శ్రీను, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఉపేందర్ , వైస్ ప్రెసిడెంట్ ఎండీ సమద్, గిరబోయిన శ్యాంసుందర్, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

కలప స్మగ్లింగ్ నిరోధానికి ప్రత్యేకచర్యలు

- కొత్తగా ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు...
- ఇద్దరు పోలీస్ అధికారులపై వేటు



విజయక్రాంతి, ఆదిలాబాద్: అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌లో కలప స్మగ్లింగ్‌ను పూర్తిగా కట్టడి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. అంతరించిపోతున్న అడవులను సంరక్షించడంతో పాటు ఇష్టారాజ్యాంగ జరుగుతున్న కలప తరలింపును అరికట్టేలా తగు చర్యలకు శ్రీకారం చుట్టింది. కలప స్మగ్లింగ్ వ్యవహారంలో విఫలమయ్యారనే విమర్శలు ఎదుర్కొంటున్న అటవీ, పోలీస్‌శాఖలు ఆలస్యంగానైనా సంయుక్త చర్యలకు ఉపక్రమించాయి. కలప అక్రమంగా తరలిపోకుండా నియంత్రించేందుకుగాను ప్రస్తుతమున్న చెక్‌పోస్టులకు అదనంగా మరో ఆరు చెక్‌పోస్ట్‌లను కొత్తగా ఏర్పాటు చేసాయి. దీంతో పాటు కలప స్మగ్లింగ్‌కు పాల్పడే ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి స్మగ్లర్లలో వణుకు పుట్టించేలా చేసారు. ఇద్దరు పోలీస్ అధికారులపైన వేటు వేసారు. కలప తరలింపు వ్యవహారంలో ఇంటిదొంగల పాత్రనే ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో కొత్తగా చేపట్టిన చర్యలు సత్ఫాలితాలనిస్తాయా, కలప తరలింపు ఆగి ప్రభుత్వ లక్ష్యం ఎంతవరకు నేరవేరుతుందానేది ప్రస్తుతం ప్రాధాన్యతను సంతరించుకుంది.

అటవీచెక్‌పోస్టుల బలోపేతం

జిల్లాలోని అడవుల నుంచి భారీగా కలప తరలుతున్నట్లు గుర్తించిన అధికారులు అటవీశాఖ చెక్‌పోస్టులను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతమున్న చెక్‌పోస్టుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు కలప తరలిపోయే అవకాశాలున్నట్లుగా గుర్తించిన మరో 6 ప్రాంతాల్లో కొత్తగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసారు. జిల్లాలో ఇదివరకు నేరడిగొండ మండలం ఆరేపల్లి, ఇస్‌పూర్, సిరిచెల్మ, గుడిహత్నూర్ మండలకేంద్రం, మావల మండలం దేవాపూర్, ఉట్నూర్ మండలం కొత్తగూడ గ్రామాల వద్ద చెక్‌పోస్టులు కొనసాగుతుండగా తాజాగా మరో ఆరు చెక్‌పోస్టులను అటవీ, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసారు. తలమడుగు మండలం సుంకిడి, ఉట్నూర్ మండలం గంగాపూర్, సిరికొండ మండలం పోన్నా ఎక్స్‌రోడ్, బోథ్ మండలం ఘన్‌పూర్, ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి, ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ ప్రాంతాల్లో కొత్తగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన అధికారులు అక్కడ శాశ్వతంగా రౌండ్ ద క్లాక్ విధులు నిర్వహించేలా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు.చెక్‌పోస్టులను పర్యవేక్షించడంతో పాటు జాతీయ రహదారిపై కలప తరలిపోకుండా పోలీస్, అటవీశాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నారు. అయితే నిర్మల్ జిల్లా పోలీసులు పట్టుకున్న కలప ప్రస్తుతమున్న కొన్ని చెక్‌పోస్ట్‌ల గుండానే దాటి వెళ్లింది. అయితే ఆ చెక్‌పోస్టుల సిబ్బంది ఏం చేసారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పీడీ యాక్ట్ నమోదు

అటవీ సంపదను కొల్లగొట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలనే ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా జిల్లా పోలీసులు సిరికొండ మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన కలప స్మగ్లర్ షేక్ శబ్బీర్ పై తొలిసారిగా పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే ఉపేక్షించబోమనే హెచ్చరికను పంపించేలా ఇప్పటికే 21కేసులు నమోదై ఉన్న షబ్బీర్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్‌చేసి హైదరాబాద్ చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే జిల్లాలోని ఇచ్చోడ, సిరికొండ, నేరడిగొండ మండలాల్లో అనేక మంది అక్రమార్కులు కలప స్మగ్లింగ్‌నే వృత్తిగా ఎంచుకుని అడవులను నాశనం చేస్తున్నారు. పోలీసుల తాజా చర్యలతో ఇలాంటివారిలో గుబులు రేకెత్తిస్తుండగా వారికి అండగా నిలిచిన అధికారుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతుంది.

పోలీస్ అధికారుల సస్పెన్షన్

కలప అక్రమ రవాణ వ్యవహారంలో అక్రమార్కులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇచ్చోడ సీఐ సతీష్‌కుమార్, నేరడిగొండ ఎస్సై హరిశేఖర్‌లను విధుల నుంచి సస్పెండ్ చేసిన పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు వారిపై పోలీస్ కేసులను సైతం నమోదు చేసారు. అక్రమాలకు పాల్పడేవారు ఎంతటివారైన తప్పించుకోలేరనే ఉద్దేశాన్ని చాటేలా సదరు పోలీస్ అధికారులపై చర్యలు చేపట్టడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే కలప స్మగ్లింగ్ వ్యవహారంలో సదరు పోలీస్ అధికారులతో పాటు అటవీశాఖ అధికారుల ప్రమేయం కూడా ఉందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పోలీసు అధికారులపై చర్యలు చేపట్టిన విధంగానే కలప స్మగ్లింగ్ వ్యవహారంపై పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాద్యులైనవారిపై చర్యలు తీసుకుని అటవీసంపదను పరిరక్షించాలనే భావన సర్వాత్ర వ్యక్తమవుతోంది. కలప స్మగ్లర్లకు కొంతమంది రాజకీయ నాయకులు సైతం అండగా నిలుస్తున్నారని అందుకే వారు అధికారుల చర్యలను సైతం లెక్కచేయకుండా బరితెగించి మరీ కలపను విచ్చలవిడిగా నరికివేస్తున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. ఆదిశగా కూడా విచారణ జరిపి బాద్యులైన వారిపై చర్యలు చేపట్టడం ద్వారా అడవులను పూర్తిస్థాయిలో సంరక్షించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

తుది విడత ప్రశాంతంగా పంచాయితీ పోలింగ్

విజయక్రాంతి, పెద్దపల్లి: తుది విడతగా జరిగిన పంచాయితీ పోరు ప్రశాంతంగా ముగిసింది. పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాలతో పాటు ధర్మారం మండలంలోని గ్రామాల్లో తుది విడత ఎన్నికల పోలింగ్ జరిగింది. సుల్తానాబాద్ మండలంలో 33.660 ఓటర్లకు గాను 30.239 ఓట్లు పోలయ్యాయి. జూలపల్లి మండలంలో 22.209 గాను 18.832, ఎలిగేడు మండలంలో 16.270 గాను 14.656 ఓట్లు పోలయ్యాయి. ధర్మారం మండలంలో 38.592 ఓటర్ల గాను 33.702 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా మండలాల్లో 75 సర్పంచ్ పదవులకు, 609 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరిగాయి. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామం, ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి, జూలపల్లి మండలం తెలుకుంట, ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శ్రీదేవసేన పరిశీలించారు. 81 గ్రామాల్లో జరిగిన పోలింగ్ 88.79 శాతం నమోదు అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో 1.09.731 మంది ఓటర్లకు గాను 97.428 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.

జాతీయ కబడ్డీ టీంకు ఎంపికైన తాజుద్దీన్

విజయక్రాంతి, నల్లగొండ: జాతీయ కబడ్డీ పోటీలకు టిఎన్‌జివోఎస్ కొండమల్లేపల్లి యూనిట్ కార్యదర్శి ఎండి. తాజుద్దీన్ ఎన్నికయ్యారు. బుధవారం నల్లగొండ టిఎన్‌జివోఎస్ భవన్‌లో టిఎన్‌జివోఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జివోఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు నర్సింహ్మాచారి, దయాకర్‌రావు, మురళి, పిచ్చయ్య, రాజు, శ్రీనివాస్, అంజయ్య, భీమయ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 2వ తేదీన జిల్లాకేంద్రంలోని జడ్పీ సమావేశమందిరంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈఓ జి.జితేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ వి.శోభారాణీ అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, సభ్యులు సకాలంలో తగు నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

పేదల సొంతింటి కల నెరవేరేదెన్నాడు..?

- కాంగ్రెస్ హయాంలో మంజూరైన ఇళ్లు – లబ్ధిదారులకు ఇవ్వటంలో జాప్యం



విజయక్రాంతి, రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఏళ్లు గడుస్తున్నా పేదల సొంతింటి కల, కలగానే మిగిలింది. ఇక టీఆర్ఎస్ ప్రభుత్వం తీరు చూస్తే " అమ్మ పెట్టదూ... అడుక్కు తిన నివ్వదూ " సామెతలా తయారైంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ పేదలకు సొంతింటి కలను నేరవేర్చేందుకు రాజీవ్‌గృహకల్ప, జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకాల పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నపుడు అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో పేదలకు ఇళ్లను కట్టించి ఇచ్చారు. కాగా ఆయన మరణాంతరం పేదలందరికి పూర్తిస్థాయిలో ఇళ్లను ఇవ్వలేకపోయారు.

అంతేకాకుండా కొన్ని చోట్ల ఆయా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అయితే పేదలు ఇళ్లకోసం వాటాధనం కింద గత ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. అధికారులు చాలాచోట్ల పెండింగ్‌లో ఉన్న ఇళ్లను మంజూరు చేసినప్పటికి ఇంకా చాలాచోట్ల ఇళ్లు పేదలకు అందలేదు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కూడా వేలాది మంది పేదలు ఇళ్లను ఎప్పుడు అప్పగిస్తారోనని వేయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు.

పేదలకు ఇళ్లు అప్పగించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం..

తెలంగాణ రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు ఇళ్లను మంజూరు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలున్నాయి. ఇళ్లులేని ప్రతి పేద కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఇస్తానని హామీలు ఇవ్వడం తప్ప ఏ ఒక్కరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లివ్వలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్, పల్మాకుల, కవ్వకూడ, లక్ష్మీగూడ, గంధం గూడ, పూప్పాల్‌గూడ, కోకపేట్, మంచిరేవుల, పీరం చెరువు తదితర గ్రామాల్లో నిర్మించిన వేల ఇళ్లు పేదలకు అప్పగించకపోవడంతో పూర్తైన ఇళ్లు శిధిలావస్థకు చేరుకొంటున్నాయి. పేదలు ఇళ్లు ఎప్పుడు అప్పగిస్తారోనని ప్రభుత్వ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా హైదరాబాద్ జిల్లాలోని పాతబస్తీలోని జంగంమెట్, ఫలక్‌నుమా ప్రాంతాల్లోని ప్రభుత్వ భూమిలో ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి గత ఎనిమిదేళ్ల క్రితం మైలార్‌దేవ్‌పల్లిలోని బండ్లగూడ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 166లో ఇళ్లను కట్టిస్తామని గత ప్రభుత్వం వారికి నచ్చచెప్పి ఈ స్థలంలో ఉంచారు. అక్కడే ఇళ్లను కట్టిస్తామని చెప్పడంతో ఏడాది తర్వాత ఆయా స్థలంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్, క్రిష్ణా నీటి రిజర్వాయర్లను ఏర్పాటు చేయటంతో ఆయా పేదలకు కాటేదాన్‌లోని సర్వే నెంబర్ 156/1లో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం ద్వారా ఇళ్లను కట్టిం చారు.

అయితే ఈ ఇళ్లు కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికాకపోవడంతో పేదలు ఏళ్ల తరబడి ఎదురు చూసి అర్థాంతరంగా ఉన్న ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకోసం రాజీవ్‌గృహకల్ప, జేఎన్ఎన్ఎంయూఆర్ఎం పథకాల్లో మంజూరైన ఇళ్లను టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం పేదలపై చిన్న చూపు గానే అనుకోవచ్చునని పలువురు పేర్కొంటున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్లో డబుల్‌బెడ్‌రూంలకు స్థల సేకరణ జరుగలేదు మరీ డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఎక్కడిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన గతంలో నిర్మించిన ఇళ్లను వెంటనే పేదలకు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బాపూజికి ఘన నివాళి



విజయక్రాంతి, కామారెడ్డి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కామారెడ్డి ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే కలెక్టర్ కార్యాలయంలోని జనహిత సమావేశ మందిరంలో లిప్రస్ ఆధ్వర్యంలో అలాగే మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..సమాజానికి శాంతి బాట చూపిన గొప్ప వ్యక్తి బాపూజి అని అన్నారు. దేశాన్ని సన్మార్గంలో నడిపించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. నేడు భారతదేశం సుసంపన్న దేశంగా ఉండటానికి ఆయన చూపిన మార్గమే కారణమన్నారు. హింసామార్గాన్ని విడనాడి అహింసా మార్గంలో వెళ్తేనే ఏదైనా సాధించగలమని చెప్పి చేసి చూపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనించి దేశ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తృప్తి అనిల్, ముప్పారపు ఆనంద్, బుస్సా సంతోశ్, విశ్వం, అరుణ్, నారాయణ, శ్రీను, భైరవ, క్రిష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు సాధించాలి

విజయక్రాంతి, మిర్యాలగూడ : జాతిపిత గాంధీ ఆశయాలను సాధించాలని నవజీవన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీరామకవచం నాగరాజు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర వీరులు చేసిన త్యాగాలను నేటి యువతరం మర్చిపోవద్దన్నారు. వారి ఆదర్శాలను ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, నాగమణి, ఉపాధ్యాయులు వాజీద్, హరికోటి, విజయ్‌కుమార్, నాగార్జున, పద్మ, సరస్వతి, నాగమణి, హైమావతి, నాగలక్ష్మి, మణి, అర్పిత పాల్గొన్నారు. వాసవీక్లబ్ గ్రేటర్, కపుల్స్, సీనియర్ సిటిజన్స్, యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కూర్చున్న గాంధీ బొమ్మ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లకుమారపు పాండురంగయ్య, రేపాల శ్రీనివాస్, గుండా నాగరాజు, మిర్యాల శత్రయ్య, మంచుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్

విజయక్రాంతి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బుధవారం సి.సి.ఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని నుంచి సుమారు రూ.2లక్షల 15వేల విలువైన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుడు గందెశ్రీ శివకుమార్‌కు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో మోటారు మెకానిక్ పనిచేసే గందెశ్రీ శివకుమార్ జల్సాలకు అలవాటుపడ్డాడు. మోటారు మెకానిక్‌తో వచ్చే ఆదాయం సరిపోక సులభంగా డబ్బును సంపాదించాలన్న దుర్భిద్ధితో ద్విచక్రవాహనాల చోరీకి ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. దీంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 2013 లో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తన మిత్రులతో కలిసి ఒక ట్రాక్టర్ చోరీకి పాల్పడ్డాడు.పైగా ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఊచలు లెక్కపెట్టాడు.ఇదే తంతు కొనసాగిస్తూ 2014లో కూకట్‌పల్లి, జీడిమెట్ల, చిన్నకోడూరు, రాజ్‌గోపాల్‌పేట, సిద్ధిపేట ప్రాంతాల్లో సుమారు 13 ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడి సిద్ధిపేట జైలుపాలయ్యాడు. అక్కడి నుంచి నిందితున్ని పి.టి వారెంట్‌పై చర్లపల్లి జైలు తరలించారు. రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష అనంతరం 2017లో విడుదలైన నిందితుని వక్రబుద్ధి మారలేదు. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాలుగు, హైదరాబాద్ పరిధిలో ఒక చోరీకి పాల్పడ్డాడు. జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్రవాహలు, బచ్చన్నపేట, వరంగల్ మట్వాడ, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడిన నిందితుడు శివకుమార్ ఎవరికంటా పడకుండా జనసంచారం లేని నిర్మానుష్యప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను భద్రపరిచాడు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుసగా ద్విచక్రవాహనాల దొంగతనాల ఫిర్యాదులపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ అలర్టైంది. క్రైమ్స్ అదనపు డిసిపి బి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సిసిఎస్ ఇన్స్‌స్పెక్టర్ కె.డేవిడ్‌రాజు, జనగాం ఇన్స్‌స్పెక్టర యం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనగామ నుంచి సూర్యాపేటకు వెళ్లేమార్గంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు శివకుమార్ దొరికిపోయాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంతో పాటు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబర్చిన క్రైం పోలీసులను సి.పి.డా.వి.రవిందర్ అభినందించారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ చెకప్



పంజాబ్ నేషనల్ బ్యాంక్ 125వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఎంపిక చేసిన బ్రాంచ్‌ల వద్ద ఉచిత మెడికల్ చెకప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని సర్కిల్ హెడ్ రాధికా భటవాడేకర్ ప్రారంభించారు. CSR యాక్టివిటీ క్రింద వరంగల్ జిల్లాలోని మేడిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను బ్యాంకు చేపట్టింది ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్కిల్ హెడ్ D.N. అంబేద్కర్, సైఫాబాద్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టి. శిరీష పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



విజయక్రాంతి, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో చివరి దశ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లాలోని కోనరావుపేట,తంగళ్లపల్లి,ఇల్లంతకుంట మండలాల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున గ్రామీణ ఓటర్లు ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఆ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుదవారం పోలింగ్ సరళిని జిల్లా సంయుక్త కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి పరిశీలించారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ మండెపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఇంచార్జీ కలెక్టర్ యాస్మిన్ భాషా సందర్శించి పోలింగ్ సిబ్బందికి తగు సూచనలు ,సలహాలు జారీ చేశారు.పోలింగ్ శాతంను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎలాంటి అవాచంనీయ సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.కోనరావుపేట,తంగళ్లపల్లి,ఇల్లంతకుంట మండలాల్లో ప్రశాంతంగా నిర్వమించడం జరిగింది.మొత్తం 95,135 మంది ఓటర్లకు గాను 81,148 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు.మొత్తం 85.30శాతం పోలింగ్ నమోదు ఐనట్లు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ యాస్మిన్ భాసా తెలిపారు.జిల్లా రెవెన్యూ అధికారులు ఎన్.ఖీమ్యా నాయక్ ,రాహుల్ శర్మతో కలిసి కోనరావుపేట మండలంలోని కొలనూర్,మర్తనపేట,నాగారం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి టి.శ్రీనివాస రావు ఇల్లంతకుంట మండలంలోని ఇల్లంతకుంట,గొల్లపల్లి పోలింగ్ కేంద్రంను సందర్శించి పోలింగ్ సరళిని సందర్శించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం రిటర్నింగ్ అధికారి ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియను చేపట్టారు. ముందుగా వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు చేపట్టి అనంతరం సర్పంచ్ ఓట్లు లెక్కింపు అధికారులు చేపట్టారు.సర్పంచ్ ఓట్ల లెక్కింపు అనంతరం ఉప సర్పంచ్ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల పరిశీలన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మూడో విడత ఎన్నికల ప్రక్రియను అధికారులు పరిశీలించారు.

ఎస్సీ యువతకు ఉపాధికై శిక్షణా కార్యక్రమాలు

విజయక్రాంతి, రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ యూసీడీ ప్రాజెక్టు అధికారిణి టి.రోజారాణి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 18 నుంచి 35 ఏళ్లలోపు ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు పలు స్వయం ఉపాధి రంగాల్లో అర్హతలను బట్టి శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 4వ తేదీలోపు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలోని యూసీడీ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికేట్స్, విద్యార్హతలు, నైపుణ్య సర్టిఫికేట్లు జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేయాలన్నారు. ఇతర వివరాలకు సర్కిల్ కార్యాలయంలోని యూసీడీ విభాగంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలన్నారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ అగ్ని ప్రమాదం

- తృటిలో తప్పిన పెను ముప్పు
- ముగింపు దశలో భారీ ప్రమాదం చోటుచేసుకోవటంతో పలువురి విస్మయం

విజయక్రాంతి, హైదరాబాద్: భారీ స్థాయిలో జరుగుతున్న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఫైర్ ఆక్సిడెంట్ చోటుచేసుకుంది. ఆంధ్రాబ్యాంక్ ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో షాక్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లు అధికారులు భావిస్తున్నారు. సాయంత్రం నుంచి ప్రారంభమైన జన ప్రవాహం భారీ రూపు దాల్చిన సమయంలో.. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడం ప్రజలను ఇబ్బందుల పాలు చేసింది. ప్రదర్శనలో లీనమైన ప్రజలు ఒక్కసారి ఉలిక్కి పడి భయంతో సురక్షిత ప్రదేశానికి ఉరుకులు పరుగులు పెట్టడంతో స్వల్ప తొక్కసలాట జరిగింది. మంటల అదుపునకు అగ్నిమాపక దళాలతో పాటు జీహెచ్ఎంసీ డిజాస్టర్ రిలీఫ్ దళాలు రంగంలోకి దిగాయి. సమాచారం తెలిసిన వెంటనే జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు, కమిషనర్ దానకిషోర్ సంఘటనాస్థలానికి చేరుకొన్నారు. అగ్నిమాపక దళానికి తోడుగా జీహెచ్ఎంసీ డిజాస్టర్ రిలీఫ్ దళాలను రంగంలోకి దింపి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అదనపు వాటర్ ట్యాంకులను పంపి, మంటల అదుపునకు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను దానకిషోర్ అదేశించారు. నుమాయిష్ నిర్వహణలో తీసుకున్న ముందస్తు జాగ్రత్తలతో పెను ప్రమాదం తప్పింది. ప్రాణ నష్టం జరగక పోవటంతో అధికారులు, నిర్వాహకులు ఊరిపి పీల్చుకున్నారు. జనవరి ఒకటి నుంచి ప్రారంభమైన నుమాయిష్ ఫిబ్రవరి 15కు ముగియనుంది. మరికొన్ని రోజుల్లో నిర్వహణ ముగియనున్న తరుణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.


ఫిబ్రవరి 21న రామమందిర నిర్మాణం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి) భూమిని రామజన్మభూమి న్యాస్కు కాని, రామమందిర నిర్మాణానికి సంబంధించిన వ్యవహారాలు చూస్తున్న ట్రస్టుకుకానీ అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 16వ శతాబ్దపు బాబ్రీ మసీదు ఉన్న మొత్తం భూమిని యధాతథంగా ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. దీనిలో వివాదాస్పదం కాని భూమిపై యధాతథ స్థితి తొలగించాలని కేంద్రం కోరింది. మొత్తం 67 ఎకరాలను 25 ఏళ్ల కింద ప్రభుత్వం సేకరించింది. దీనిలో 2.5 ఎకరాల స్థలంపై వివాదం నెలకొంది. అయితే 0.313 ఎకరాల భూమిపై మాత్రమే వివాదం నెలకొని ఉందని కేంద్రం పేర్కొంది. అయితే కేంద్రం సమర్పించిన దానిపై సుప్రీం ధర్మాసనం తన నిర్ణయం ప్రకటించకముందే ప్రయాగ్ రాజ్‌లో ధర్మ సంసద్ రామాలయ నిర్మాణంపై తమ నిర్ణయం ప్రకటించింది.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం

విజయక్రాంతి, రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన శాఖల పునర్ వ్యవస్థీకరణలో ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలకం కానుందని అందుకోసం ఉద్యోగులందరూ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేసే మధుపాల్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.సత్యనారాయణలు నేడు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారిని శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన వీరు విశ్వవిద్యాలయం ప్రతిష్టను పెంచేలా బాధ్యతాయుతంగా పనిచేశారని, వీరి మాదిరిగానే మిగిలిన ఉద్యోగులందరూ తమ ప్రతిభను చూపాలన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధికారులు, నాన్‌టీచింగ్, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, తోటి ఉద్యోగులు వీరిని ఘనంగా సన్మానించారు.

మాజీ మంత్రి కె.వి.కేశవులు మృతి



విజయక్రాంతి, హైదరాబాద్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ మంత్రి కె.వి. కేశవులు (97) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ధరంకరం రోడ్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. వారి మృతికి బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్. రాములు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్ర సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌కు.. కుమారస్వామి డెడ్‌లైన్

విజయక్రాంతి, బెంగళూరు: కర్ణాటక రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఊగిసలాటలో పడింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై సీఎం కుమారస్వామి తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ నియంత్రించాలంటూ మరోసారి హెచ్చరించారు. లేనిపక్షంలో సీఎం పదవికి తాను రాజీనామా చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. దీని కోసం కుమారస్వామి కాంగ్రెస్‌కు ఒక వారం రోజులు గడువు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తమ హద్దు దాటుతున్నారంటూ గత సోమవారం సీఎం కుమారస్వామి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ఎమ్మెల్యే పుత్తరంగా షెట్టి గత ఆదివారం సీఎం కుమారస్వామిపై ఆరోపణలు చేశారు. సీఎంగా ఆయన పదవిలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. అలాగే మాజీ సీఎం సిద్ధరామయ్యే తమ నాయకుడని, ఆయన మంచి ముఖ్యమంత్రి అంటూ షెట్టి చేసిన వ్యాఖ్యలను కర్నాటక డిప్యూటీ సీఎం సమర్థించారు. దీనిపై సీఎం కుమారస్వామి మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల తీరు ఇలాగే ఉంటే తాను సీఎం పదవి నుంచి తప్పుకుంటానని ఆ పార్టీకి అల్టిమేటమ్ జారీ చేశారు. కాగా ఎన్నికలకు తాము సిద్ధమని మాజీ సీఎం సిద్ధరామయ్యకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు.

అధికారం కోసం బీజేపీ యత్నాలు

మరోవైపు కర్నాటకాలో ఎలాగైనా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ యత్నిస్తోంది. కాంగ్రెస్–జేడీఎస్‌కు చెందిన 11 మంది ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకుని అధికారం చేపట్టాలని చూస్తోంది. 2018 మేలో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 104 సీట్లతో సింగిల్ మెజార్టీ పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ 78, జేడీఎస్ 38 స్థానాల్లో గెలిచాయి. అయితే మొత్తం 222 సీట్లలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 112 మేజిక్ ఫిగర్‌ను ఏ పార్టీ సాధించలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ జేడీఎస్‌కు మద్దతివ్వడంతో సీఎం కుమారస్వామి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాడైంది. అయితే తగిన సంఖ్యాబలం లేకపోవడంతో కాంగ్రెస్‌తో పొసగలేక సీఎం కుమారస్వామి సతమతవుతున్నారు. కాగా కాంగ్రెస్, జేడీఎస్‌లోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్న బీజేపీ, ఇరు పార్టీలకు చెందిన వ్యతిరేకులను చేరదీసి అధికారం చేపట్టేందుకు పన్నాగం పన్నుతోంది.

జీహెచ్ఎంసీలో హాజరు కుంభకోణం

- విజిలెన్స్ దర్యాప్తులో బహిర్గతం
- కఠిన చర్యలు తీసుకుంటాం
- జీహెచ్ఎంసీ విజిలెన్స్ డైరెక్టర్ కంపాటి విశ్వజిత్



విజయక్రాంతి, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో ఇంటి దొంగల బండారం బయట పడింది. సఫాయి కార్మికుల హాజరులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట కోసం అమలు చేస్తున్న బయోమెట్రిక్‌ను బురిడీ కొట్టిస్తున్న ఘనులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. విశ్వసనీయ సమాచారంతో దర్యాప్తు చేపట్టిన విజిలెన్స్ డైరెక్టర్ కంపాటి విశ్వజిత్ విజిలెన్స్ బృందాలను రంగంలోకి దింపారు. కొన్ని రోజులుగా గోప్యంగా నిఘా పెంచటంతో అక్రమార్కులు అడ్డంగా దొరికిపోయారు. ఈ క్రమంలో అక్రమాలు జరుగుతున్న ప్రాంతాలను నిర్ధారణ చేసుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేశాయి. వీరు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో బుధవారం 6 బృందాలు ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమార్కుల ఆట కట్టించారు. 12 చోట్ల సఫాయి సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తనిఖీ చేశారు. దాంతో అక్రమార్కులు దొంగ హాజరుకు వాడుతున్న సామాగ్రితో సహా పట్టుబడ్డారు. అక్రమార్కులు సింథటిక్ ఫింగర్ ప్రింట్‌లు తయారుచేసి దొంగ అటెండెన్స్ వేస్తున్నట్లు విచారణలో బయటపడింది. కేవలం 5 రూపాయలతో సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ తయారు చేసి జీహెచ్ఎంసీ ఖజానాకు లక్షల్లో గండి కొడుతున్నట్లు తేలింది. గతంలో ఈ విధంగా మోసాలకు పాల్పడుతూ ఏటా దాదాపు నాలుగు కోట్లు స్వాహా చేసేవారు. ఇందులో కొందరు అధికారుల పాత్ర కూడా ఉండటంతో కొన్నాళ్ళు ఈ తంతు యథేచ్ఛగా సాగింది. ఈ విషయాన్ని పసిగట్టిన ఉన్నతాధికారులు బయోమెట్రిక్ విధానం అమలులోకి తెచ్చారు. కానీ మొదట్లో యంత్రాలను ధ్వంసం చేయటంతో అర్థాంతరంగా ఆగిపోయింది. దాంతో బయోమెట్రిక్ విధానాన్ని మరింత ఆధునీకరించి రెండో సారి అమలుకు తెచ్చారు. దీంతో పరిస్థితి మెరుగు పడటంతో నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడింది. దాంతో అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు జీహెచ్ఎంసీ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి కొత్త తరహాలో సింథటిక్ ఫింగర్ ప్రింట్‌లతో దోపిడీకి తెరలేపారు. గతంలో కంటే వాస్తవంగా బయోమెట్రిక్‌తో అవకతవకలు తగ్గాయని అధికారులు చెప్తున్నా ఈ కొత్త దోపిడీతో జీహెచ్ఎంసీ నిధులు భారీగానే పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా కొత్త బయోమెట్రిక్ విధానంలో ఆధార్, జీపీఎస్ అనుసంధానం చేయడం జరిగింది. అయినప్పటికీ అక్రమాలు చోటు చేసుకోవడం ఉన్నతాధికారులను విస్మయానికి గురి చేస్తోంది. చార్మినార్, మలక్‌పేట్, కూకట్‌పల్లి, మూసాపేట్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో విజిలెన్స్ బృందాలు జరిపిన మెరుపు దాడుల్లో మొత్తం 84 సింథటిక్ ఫింగర్ ప్రింట్స్, 12 బయోమెట్రిక్ మిషన్లు స్వాధీనం చేసుకున్నారు. 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో 9 మంది సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ ఉపయోగిస్తూ పట్టుబడ్డారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నివేదిక ఇస్తున్నాం. కఠిన చర్యలు తీసుకుంటాం. చార్మినార్, మలక్‌పేట్, కూకట్‌పల్లి, మూసాపేట్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేసాం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం.

– జీహెచ్ఎంసీ విజిలెన్స్ డైరెక్టర్ కంపాటి విశ్వజిత్

పార్లమెంటు ఎన్నికల్లో .. ప్రాంతీయ పార్టీలదే హవా

(మొదటిపేజీ తరువాయి) ప్రాంతీయ పార్టీలు ముందుకు వస్తున్నాయని ఆమె వెల్లడించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీతో పాటు ఇతర ప్రాంతీయ పార్టీలను కలుస్తామని స్పష్టం చేశారు.

మోదీ గ్రాఫ్ దిగజారుతోంది..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్రాఫ్ రోజు రోజుకు పడిపోతోందని ఎంపీ కవిత అన్నారు. మోడీకి ఆదరణ తగ్గిందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వనున్నారని ఆమె జోస్యం చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎంపీ నిధులను పెంచలేదన్నారు. రాష్ట్ర విభజన సమస్యల నుంచి మొదలుకొని రాష్ట్రానికి కేటాయించే నిధుల వరకు ప్రధాని మోదీ తెలంగాణపై వివక్ష కనబరిచారని కవిత తెలిపారు. ఎంపీ నిధులు ఏడాదికి కనీసం రూ. 25 కోట్లు ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వానికి పార్లమెంటులో పూర్తి మెజార్టీ ఉన్నా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల చట్టం ఆమోదించలేదన్నారు. దీనిపై మోడీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని ఆరోపించారు. రక్షణ రంగంలో భారత్ స్వావలంబన సాధించాల్సిన అవసరముందని అన్నారు.

పేదరికాన్ని కాంగ్రెస్ నిర్మూలించలేదు

కాంగ్రెస్ అధ్యక్షుడురాహుల్ గ్రాఫ్‌లో కూడా ఎలాంటి పెరుగుదల లేదని కవిత స్పష్టం చేశారు. గరీబీ హఠావో లాంటి కాంగ్రెస్ నినాదాలు స్లోగన్లకే పరిమితమైనాయన్నారు. దేశంలో, రాష్ట్రంలోనూ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పేదరికాన్ని ఆ పార్టీ నిర్మూలించలేకపోయిందని ఆమె ఆరోపించారు. ఆ పార్టీ నినాదాలు మాత్రమే చేస్తుందని కవిత ఎద్దేవా చేశారు. ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినా దేశానికి ఒరిగిదేమీ లేదన్నారు. బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలు కేంద్రంలో అధికారంలోకి రావాలని కవిత అభిప్రాయపడ్డారు.

16 సీట్లు సాధిస్తాం..

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో వార్ వన్ సైడేనని కవిత ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 16 పార్లమెంట్ స్థానాలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. ఒక్క సీటు ఎంఐఎం గెలుచుకుంటుందన్నారు. తెలంగాణలోని 16 ఎంపీ సీట్లలో టీఆర్ఎస్‌దే విజయమన్నారు. నూతన సెక్రటేరియట్ నిర్మాణం కోసం బైసన్‌పోలో భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. ఇదే అంశంపై మోడీని కలిసేందుకు తమ పార్టీ ఎంపీలతో కలిసి ఢిల్లీకి వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన హామీల్లో పెండింగులో ఉన్నవాటిపై దృష్టి సారించాలని బడ్జెట్ సమావేశాల్లో ప్రధాని మోదీని కోరతామన్నారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలంతా పోరాటం చేస్తామని, ప్రధాని మోదీని కూడా కలిసి నిలదీస్తామని స్పష్టం చేశారు.

రాజకీయాల్లోకి విద్యార్థుల ప్రోత్సాహం

టీఆర్ఎస్ పార్టీ విద్యార్థులను రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రోత్సహిస్తోందని కవిత తెలిపారు. దీంట్లో భాగంగానే బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ వంటి విద్యార్థి నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా ఎదిగారని గుర్తు చేశారు. నిజామాబాద్లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున వల్ల ప్రజలకు కొంత అసౌకర్యం కలిగిందన్నారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్‌లో మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు పూర్తిగా నిర్మూలిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా రైతుల కోసం పసుపు బోర్డును ఏర్పాటుకు పోరాటం కొనసాగుతోందన్నారు. దీని కోసం గతంలో చాలాసార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని ఆమె తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలు అరికడతాం

గల్ఫ్ బాధితుల విషయంలో ఏజెంట్లపై చర్యలు తీసుకునే ప్రక్రియ చేపడుతున్నామని ఒక ప్రశ్నకు కవిత సమాధానమిచ్చారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుందని చెప్పారు. ఇరాక్ బాధితులను స్వదేశానికి తీసుకొచ్చామన్నారు. ఉపాధి కోసం వెళ్లి ఇతర దేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారిని స్వదేశానికి రప్పించేందుకు విదేశాంగమంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని కవిత తెలిపారు.

ఫ్రంట్‌పై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదు

ఫెడరల్ ఫ్రంట్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను కవిత తిప్పికొట్టారు. కేసీఆర్ ఫ్రంట్‌పై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీయే ముద్దు అని చంద్రబాబు అన్న మాటను గుర్తుచేశారు. నాలుగేళ్లుగా దేశానికి బీజేపీనే అవసరమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు స్వార్థం కోసం కాంగ్రెస్‌తో చేతులు కలిపారని ఆమె విమర్శించారు. ప్రజల ఆదరణ కోల్పోయిన చంద్రబాబు టెన్షన్‌లో ఉన్నారన్నారు. తెలంగాణ క్యాబినెట్‌పై ప్రశ్నకు స్పందిస్తూ తగిన సమయంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కవిత సమాధానమిచ్చారు.

రూ.40 కోట్లతో 'మీరాలం' అభివృద్ధి పనులు



- జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్

విజయక్రాంతి, హైదరాబాద్: చారిత్రాత్మక మీరాలం ట్యాంక్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు రూ.40కోట్లతో చేపట్టే పునరుద్ధరణ పనులను ఫిబ్రవరి 20వ తేదీలోపు ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, బయోడైవర్సిటీ, లేక్స్ విభాగాల అధికారులతో కమిషనర్ దానకిషోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మీరాలం ట్యాంక్ అభివృద్ధికి సంబంధించిన పనులపై టెండర్ ప్రక్రియను ఫిబ్రవరి 15వ తేదీలోపు పూర్తిచేసి ఎట్టి పరిస్థితుల్లోనూ పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను గుర్తించడానికి హైదరాబాద్ రెవెన్యూ అధికారుల సహాయాన్ని తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో పాటు గుర్తించిన ఆక్రమణలను సర్వేచేసి తొలగించడానికి ఆరుగురు సహాయ ఇంజనీర్లను ప్రత్యేకంగా కేటాయించనున్నట్లు తెలిపారు. మీరాలం ట్యాంక్ వద్ద అసంపూర్తిగా ఉన్న ఉద్యానవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు.

ఆరు ఎకరాల్లో ఏర్పాటుచేసిన పార్కులో లైటింగ్, దక్కన్ శైలీ పెయింటింగ్‌లు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పాంటెన్లు, మినీ సైన్స్ పార్కు, దక్కన్ శైలీ శిల్పాలను, చిత్రాలను ఏర్పాటు చేయాలని బయో డైవర్సిటీ విభాగానికి సూచించారు. మీరాలం ట్యాంక్‌లో సీవరేజ్ కాలుష్య జలాలు కలువకుండా అత్యంత ఆధునిక బయోఫైటో ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఈ ఆధునిక ఎస్‌టీపీ టెక్నాలజీలను మలేషియా, థాయిలాండ్‌లలో ఉపయోగిస్తున్నారని వెల్లడించారు. చెరువులోకి డ్రైనేజీ జలాలు కలువకుండా ఎస్‌టీపీల ఏర్పాటు, మాస్టర్ ప్లాన్‌ను జలమండలి రూపొందిస్తుందని దానకిషోర్ తెలిపారు. జీహెచ్ఎంసీ లేక్స్ విభాగం ద్వారా మీరాలం చెరువు కట్ట పటిష్టత, ఫెన్సింగ్ ఏర్పాటు, పాత్‌వే, లైటింగ్, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులను చేపట్టాలని స్పష్టం చేశారు.

బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ రాజశేఖర్‌కు సన్మానం

విజయక్రాంతి, మెహిదీపట్నం: బీజేపీ ఓబీసీ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఆర్. రాజశేఖర్‌ను తెలంగాణ ఓబీసీ రాష్ట్ర నాయకులు బోడి అశోక్ కుమార్ యాదవ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీలో ఓబీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షులు కాటం నర్సింహయాదవ్, నామా యాదగిరినేత, ముకేశ్ సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పే కమిషన్‌కు పాపిరెడ్డి నివేదిక

విజయక్రాంతి, హైదరాబాద్: ఏడవ పే కమిషన్ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి నివేదిక సమర్పించారు. యూనివర్సిటీలు, ప్రైవేటు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో సిబ్బందికి, పదవీ విరమణ చేసిన వారికి ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయాలని ఆయన కోరారు. కళాశాలలు, యూనివర్సిటీల నుండి పదవీ విరమణ చేసి ఉపాధ్యాయుల పెన్షన్‌లను రివిజన్ చేయాలని కూడా ఆయన నివేదికలో కోరారు.

రాజధాని వేళల్లో మార్పు

విజయక్రాంతి, హైదరాబాద్: సికింద్రాబాద్ – హజ్రత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్ వేళలను సవరించారు. ఈ రైలు భోపాల్ జంక్షన్‌కు అర్ధరాత్రి 2 గంటలకు బదులుగా 2.15 గంటలకు, జాన్సీకి ఉదయం 5.26కు బదులుగా 5.45 గంటలకు, హజ్రత్ నిజాముద్దీన్‌కు 10.25 గంటలకు బదులుగా 10.30 గంటలకు చేరుకుంటుంది.



కూటమి గెలిస్తే.. రోజుకో 'ప్రధాని'

(మొదటిపేజీ తరువాయి) అమిత్ షా తెలిపారు. అదే కూటమి గెలిస్తే.. ఆరుగురు ప్రధానమంత్రులు ఉంటారని ఆయన ఎద్దేవా చేశారు. ఇంకా చెప్పాలంటే తొమ్మిది మంది ప్రధానులు ఉంటారని ఎద్దేవా చేశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో కూటమి గెలిస్తే.. సోమవారం బెహెన్‌జీ (బీఎస్పీ చీఫ్ మాయావతి), మంగళవారం అఖిలేశ్ యాదవ్ (సమాజ్ వాదీ పార్టీ చీఫ్), బుధవారం మమతా దీదీ (పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి), గురువారం శరద్ పవార్ (ఎన్సీపీ చీఫ్), శుక్రవారం దేవెగౌడ (జేడీఎస్ చీఫ్), శనివారం స్టాలిన్ (డీఎంకే), ఆదివారం సెలవు దినం.' అని వ్యాఖ్యానించారు. మొత్తం 23 పార్టీలకు 9 మంది ప్రధాన మంత్రి అభ్యర్థులు ఉన్నారని అమిత్ షా విమర్శించారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని ప్రకటించిన కూటమికి తమ నాయకుడు ఎవరో స్పష్టత లేదని, ఇక ఈ కూటమి దేశాన్ని ఎలా తీర్చిదిద్దుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రజలు బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మోదీ వంటి బలమైన నేత ప్రధానిగా ఉన్నప్పుడే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరని ఆయన తెలిపారు. ప్రజలు బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటుంటే.. వారి అభిష్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు మాత్రం బలహీనమైన ప్రభుత్వం ఏర్పడాలని కోరుకుంటున్నారని షా విమర్శించారు. కూటమిగా ఏర్పడిన పార్టీలకు దేశంలో ప్రభావం చూపించే స్థాయి లేదన్నారు. గత ఎన్నికల్లో ఈ పార్టీలన్నింటిని బీజేపీ ఓడించిన సంగతిని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవరెన్ని కూటములు కట్టినా.. బీజేపీ అధికారంలోకి వస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

పంచాయతీ ఎన్నికలు.. పరిసమాప్తం



(మొదటిపేజీ తరువాయి) కైవసం చేసుకున్నట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీల్లో ఫలితాలు వెలువడాల్సి ఉంది.

అపాయింటెడ్ డే.. ఫిబ్రవరి 2

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అపాయింటెడ్ డే ను ఖరారు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. అపాయింటెడ్ డేను ఫిబ్రవరి 2వ తేదీగా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించి పాలకమండలి తొలి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

జిల్లాల వారీగా నమోదైన పోలింగ్ శాతం

1. ఖమ్మం	94.56	15. కొత్తగూడెం	87.24
2. నల్లగొండ	91.73	16. జగిత్యాల	77.70
3. సూర్యాపేట	92.70	17. ఆసిఫాబాద్	86.30
4. రంగారెడ్డి	88.40	18. మహబూబాబాద్	91.54
5. కరీంనగర్	89.02	19. మంచిర్యాల్	84.04
6. యాదాద్రి	94.99	20. మెదక్	90.28
7. కామారెడ్డి	86.97	21. మల్కాజ్‌గిరి	----
8. వికారాబాద్	83.68	22. నిర్మల్	89.05
9. వనపర్తి	85.41	23. నిజామాబాద్	79.81
10. నాగర్ కర్నూల్	87.40	24. సిరిసిల్ల	85.30
11. జోగులాంబ గద్వాల	89.81	25. సంగారెడ్డి	90.15
12. వరంగల్ రూరల్	89.78	26. సిద్దిపేట	90.73
13. భూపాల్‌పల్లి	84.71	27. వరంగల్ అర్బన్	88.80
14. ఆదిలాబాద్	82.99	28. మహబూబ్‌నగర్	85.94

డీఆర్‌యూసీసీ సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చ

విజయక్రాంతి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కి సంబంధించిన 163వ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సమావేశం బుధవారం సికింద్రాబాద్ డివిజనల్ కార్యాయం సంచాన్ భవన్‌లో జరిగింది. సికింద్రాబాద్ డీఆర్ఎం అమిత్ వరదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ డీసీఎం సుమిత్ శర్మ, ఇతర అధికారుతో పాటు 15 మంది డీఆర్‌యుసీసీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమిత్ వరదన్ మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి డీఆర్‌యూసీసీ సభ్యులకు వివరించారు. తరువాత సమావేశంలో ప్రయాణికులకు సౌకర్యాలు, రైళ్ళకు కొత్త స్టాపేజ్‌ను ఏర్పాటు చేయడం గురించి డీఆర్‌యుసీసీ సభ్యులు రైల్వే అధికారులతో సమగ్రంగా చర్చించారు. స్టేషన్‌లో పరిశుభ్రత చర్యలు, కొత్త రైళ్ళు ప్రవేశపెట్టడం, అదనపు కోచ్‌ల ఏర్పాటు మొదలైన ప్రయాణీకుల సౌకర్యాల ఏర్పాటుకు చొరవ చూపిన డివిజన్ అధికారుల కృషిని డీఆర్‌యూసీసీ సభ్యులు ప్రశంసించారు.

సమస్యలు పరిష్కరిస్తా: సబిత

విజయక్రాంతి, ఎల్బీనగర్: మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్‌లో పర్యటించారు. మహిళా పోలీస్ స్టేషన్ చుట్టూ పెట్టే ప్రహరీ గోడ వలన కాలనీ వాసులకు ఇబ్బంది జరుగుతుందని సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని అన్నారు. ప్రహరీ గోడను కొంచెం జరిపి కట్టుకోమని చెప్పామన్నారు. అలాగే శంకర్‌నగర్‌లో ఉన్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందని, కాలనీలో ఉన్న సమస్యలను తొందరగా పరిష్కరించవలసిందిగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయిని మహేందర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, షఫీ, నాగరాజు, సునీల్, అరుణ్, కుమార్, రమేశ్, ఫయాజ్, అప్సర్, కాలనీవాసులు, అధికారులు ఇ.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలపై హోంమంత్రిని కలిసిన టీఎన్‌జీఓ నేతలు

విజయక్రాంతి, మెహిదిపట్నం: ఉద్యోగుల సమస్యలపై హోంమంత్రి మహమూద్‌అలీకి టీఎన్‌జీఓ హైద్రాబాద్ అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికీ టీఎన్‌జీఓ పనిచేస్తుందనీ, అంతర్గతంగా ఏవైనా సమస్యలుంటే కలిసికట్టుగా ఉద్యోగులందరూ పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగులపై తప్పుడు కేసులను ఎత్తివేయాలని, ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవద్దని హోంమంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, పవన్, భాస్కర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయండి



- కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ

విజయక్రాంతి, ముషీరాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాగూడ రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అధికారులకు సూచించారు. బుధవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అడ్డగుట్ట, మెట్టుగూడ మరియు తార్నాక డివిజన్‌లలో పర్యటించి అక్కడి స్థానిక సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట, తుకారాంగేట్ వద్ద లాలాగూడ గేట్ రైల్వే స్టేషన్ వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి పనులను బండారు దత్తాత్రేయ రైల్వే ప్రయాణీకుల సేవల కమిటీ సభ్యులు వెంకట్ రమణితో కలిసి పరిశీలించి నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతుండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను రైల్వే శాఖ సహాయ మంత్రిగా ప్రాతినిధ్యం వహించినప్పుడు ఈ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రతిపాదనను తెరపైకి తేగా, తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అటకెక్కించిందని విమర్శించారు. మళ్ళీ తాను 2014 లో పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించినప్పుడు సంబంధిత రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి రోడ్ అండర్ బ్రిడ్జి పనులకు వెంటనే నిధులు కేటాయించేలా ఒత్తిడి చేశానని తెలిపారు. తన కృషి మూలంగా రోడ్ అండర్ బ్రిడ్జి వంతెనకు రైల్వే శాఖ వెంటనే 13 కోట్లు రూపాయలు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన వాటా నిధులు ఇవ్వకపోగా కనీసం రోడ్డు విస్తరణ పనులకై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అసహనాన్ని వెలిబుచ్చారు. ఈ వంతెనకు సంబంధించి ఒక వైపు రైల్వే భూముల్లో పనులు చురుగ్గా సాగుతుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల్లో మాత్రం భూసేకరణలో నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంలేదని, కేవలం శాసన సభ ఎన్నికల నేపథ్యంలో హడావిడిగా ఈ వంతెన పనులను ప్రారంభించారే తప్ప వంతెన నిర్మాణం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధిలేదని తెలుస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు వెంటనే విడుదల చేసి, వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నాబార్డ్ వార్షిక ప్రణాళిక విడుదల

- రైతులకు సౌకర్యవంతంగా ఉండాలి :ఎస్కే జోషి

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సూచించారు. రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక చర్యలను తీసుకుంటున్నారని ఆయన వివరించారు. బుధవారం నగరంలో నాబార్డు రాష్ట్ర ప్రణాళిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2019–20 వార్షిక ప్రణాళికను ఎస్‌కే జోషి విడుదల చేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో వినూత్న పథకాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కోసం అన్ని స్థాయిల్లో కృషి జరగాలని, తరగిపోతున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు అందించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సకాలంలో రైతులకు బ్యాంకులు రుణాలు అందజేయాలని, వ్యవసాయంలో యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఖర్చులు తగ్గించి ఉత్పత్తి, ఉత్పాదకత సాధన ద్వారానే ఆదాయం పెంపు సాధ్యమవుతుందని ఎస్‌కే జోషి స్పష్టం చేశారు.

నేడు ఫార్మా.డి కాలేజీల బంద్

విజయక్రాంతి, హైదరాబాద్: ఆసుపత్రుల్లో రోగుల నిష్పత్తికి తగినట్టుగా క్లినికల్ ఫార్మాసిస్టు పోస్టులను సృష్టించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ముందు ఫార్మా.డి విద్యార్థులు చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతు డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అసోసియేషన్ గురువారం ఫార్మా.డి కాలేజీల బంద్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సాయి కుమార్ కాటం ఒక ప్రకటన విడుదల చేశారు.

2008లో ఫార్మా.డి లేదా డాక్టర్ ఆఫ్ ఫార్మసీ ఆరు సంవత్సరాల కోర్సుకు ప్రవేశపెట్టారని ఆయన తెలిపారు. అయితే కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ప్రభుత్వ రంగంలో ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు లేకపోవడంతో కొంత మంది విదేశాలకు వెళ్లిపోగా, మరికొందరు కార్పొరేట్‌కు సేవలందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈ కోర్సు పూర్తి చేసుకున్న లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రోగులకు తగిన సేవలు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

బాపుఘాట్‌లో మహాత్ముడికి ఘన నివాళి



విజయక్రాంతి, మెహిదిపట్నం: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా లంగర్‌హౌజ్‌లోని బాపుఘాట్‌వద్ద మహాత్ముడికి ఘనంగా నివాళులర్పించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి,కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, మేయర్ బొంతు రాంమోహన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు మహాత్ముడి విగ్రహానికీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతియుత మార్గంలో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి శశిధర్ రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, జీఏడీ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అరవింద్ సింగ్ హైద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ జి.రవి, కార్పొరేటర్లు బంగారు ప్రకాశ్, మిత్ర కృష్ణ, పరమానందం, చంటిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ ఆదేశాలు

విజయక్రాంతి, కూకట్‌పల్లి: అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ శంకరయ్య, సీసీపీ దేవేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా అవసరాల దృష్ట్యా పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమాంతర రోడ్లను ఏర్పాటు అవసరం ఉందన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, ప్రగతి నగర్ నుంచి ఎల్లమ్మబండ సమాంతర రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టాలని, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ చౌరస్తా నుండి మెట్రో వరకు గల రోడ్డును త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పారు. సమావేశంలో దేవేందర్‌రెడ్డి , డీసీలు మమతా, అశోక్ సామ్రాట్ జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీధర్, డీఈ కృష్ణ, శ్రీరాములు, ఏసీపీ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలమైన ప్రభుత్వముంటేనే దేశాభివృద్ధి

- ప్రధాని మోదీ



సూరత్: దేశంలో బలమైన ప్రభుత్వం ఉంటేనే.. దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. స్థిరమైన ప్రభుత్వం లేకుంటే.. అభివృద్ధి నిలిచిపోతుందని చెప్పారు. గడిచిన 30 ఏళ్లలో హంగ్ కారణంగా బలహీనమైన ప్రభుత్వాలు ఏర్పడ్డాయని, వీటి ప్రభావం దేశాభివృద్ధిపై ప్రభావం పడిందన్నారు. అభివృద్ధిలో దేశం వెనుకబడిందన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తమకు పూర్తి ఆధిక్యత ఇవ్వడం వల్ల దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గుజరాత్‌లోని సూరత్ విమానాశ్రయంలో బుధవారం నూతన టెర్మినల్ విస్తరణకు మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనకు, తమ పాలనను పోల్చి చూపారు. యూపీఏ పదేళ్ల పాలనలో కేవలం 25 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించిందని, తమ నాలుగేళ్ల పాలనలో 1.30 కోట్ల ఇళ్లను నిర్మించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి 2022 నాటికి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన ప్రకటించారు. పెద్ద నోట్ల రద్దు కారణంగా రియల్ ఎస్టేట్‌లో నల్లధనం రాక ఆగిపోయిందన్నారు. ఈ కారణంగా ఇళ్ల ధరలు తగ్గాయని చెప్పారు. తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా జరిగిన పనుల వల్ల మంచి ఫలితాలు వచ్చాయని ప్రకటించారు. గత పాలకులే అధికారంలో ఉండి ఉంటే.. తమ ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాలు తీసుకోవడానికి 25 ఏళ్ల సమయం పట్టి ఉండేదని తెలిపారు.

సొమ్మసిల్లిన కెమెరామెన్

బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా.. వీడియో తీస్తున్న కెమెరామెన్ కిషన్ రమేలియా సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన మోదీ తన ప్రసంగాన్ని ఆపివేసి, అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లాలని వేదిక మీది నుంచే ఆదేశించారు. దీంతో కార్యకర్తలు, భద్రతా సిబ్బంది రమోలియాను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అనంతరం మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

గుర్రపుడెక్క తీయరు.. చెరువులను బాగుచేయరు

- అంబీర్ చెరువులో పరుచుకున్న గుర్రపుడెక్క
- చుట్టుపక్కల కాలనీలకు దోమల బెడద



విజయక్రాంతి, హైదర్‌నగర్: ఓ పక్క చెరువుల సుందరీకరణ, మరోపక్క నాలాల అభివృద్ధి చేపడుతున్నామని సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నా అవి ఆచరణలో మాత్రం కంటికి కనిపించడం లేదు. చెరువుల పక్కన చదునుచేసి, నాలుగు మొక్కలు నాటి తమపని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారే కానీ, చెరువులను మాత్రం అభివృద్ధి చేయడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వెలువెత్తుతున్నాయి.

ఇప్పటికే వందలాది చెరువులు కబ్జాకోరుల పాలిటపడి కనుమరుగయ్యాయి. మిగిలిన కొద్దిపాటి చెరువుల సైతం ప్రజాప్రతినిధుల, అధికారులు నిర్లక్ష్యం వెరసి మురికి చెరువులుగా మారి కంపుకొడుతున్నాయి. దీంతో స్థానికంగా నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధభరితంగా మారతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇండ్లల్లో స్వైర విహారం చేయడంతో స్థానిక నివాసులు అనారోగ్యాలకు గురువుతున్నారు. చెరువులంటానే వ్యర్థాలతో నిండిపోయి, గుర్రపు డెక్కకు నిలయంగా మారాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చెరువులపై దృష్టి సారించి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అంబీర్ చెరువులో అంతా అదే

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్‌లోని అంబీర్ చెరువు కట్ట ఇటు హౌసింగ్ బోర్డు కాలనీకి, అటు ప్రగతి నగర్ కు మధ్య వారధిగా ఉంటుంది. ఈ దారి వెంట అనునిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ చెరువు మధ్య నుంచి వెళ్లడం ఒకప్పుడు ఎంతో ఆనందంగా ఉండేది. కానీ ఇప్పుడు అటువైపు నుంచి వెళ్లాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి దాపరిస్తోంది. గుర్రపు డెక్క, మురికి చెత్తతో చెరువు నిండిపోయింది. గుర్రపుడెక్క నివారణ కోసం సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇది తిరిగి విస్తరిస్తోందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

రూ.30.32 కోట్లతో మల్టీ మోడల్ ఫంక్షన్‌హాళ్లు

- సికింద్రాబాద్ సర్కిల్లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు
- సీతాఫల్‌మండీ మల్టీ మోడల్ ఫంక్షన్ హాలు పరిశీలన



విజయక్రాంతి, హైదరాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్ మండిలో నిర్మాణంలో ఉన్న మల్టీమోడల్ ఫంక్షన్ హాలు పనులను, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ బుధవారం ఉదయం తనిఖీ చేశారు. మాజీ మంత్రి, సికింద్రాబాద్ శాసన సభ్యులు టి.పద్మారావు, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రఘుప్రసాద్‌లతో కలిసి సికింద్రాబాద్ సర్కిల్లో పర్యటించారు. దాదాపు రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీమోడల్ ఫంక్షన్ హాలు త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు ప్రకటించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పేదలకు అందుబాటులో ఉండేలా కనీసం ఒక మల్టీమోడల్ ఫంక్షన్ హాళ్లను నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. ఈ మేరకు తొలి దశలో రూ. 30.32 కోట్ల వ్యయంతో 16 మల్టీమోడల్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు చేపట్టామని వివరించారు. ఒక్కో ఫంక్షన్ హాలు ను కనీసం 3,300 చదరపు గజాల స్థలంలో, 24వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మల్టీలేవల్ ఫంక్షన్ హాళ్లను నిర్మిస్తున్నామని, దీనిలో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లలో 12,350 చదరపు అడుగుల విస్తీర్ణంతో చేపట్టామని పేర్కొన్నారు. చిలుకలగూడ మోడల్ ఫంక్షన్ హాలును ఏసి ఫంక్షన్ హాలుగా రూపొందించి రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మాజీ మంత్రి పద్మారావు కమిషనర్ కు సూచించారు. దీంతో సవరించిన అంచనాలు పంపించాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను అక్కడికక్కడే కమిషనర్ ఆదేశించారు. మార్చి ప్రారంభంలోగా ఈ ఫంక్షన్ హాళ్లను పజలకు అందుబాటులోకి తేవాలని దానకిషోర్ అధికారులను ఆదేశించారు. . నామాల గుండులో ఖాళీగా ఉన్న 3వేల గజాల స్థలంలో మోడల్ మార్కెట్ను గానీ, క్రీడా సముదాయం (స్పోర్ట్స్ కాంప్లెక్సు) గాని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అదేవిధంగా చిలుకలగూడలో క్రీడా సముదాయం నిర్మాణానికి కేటాయించిన 3వేల గజాల స్థలంలో వాకింగ్ ట్రాక్ ను నిర్మించి ఎగ్జిబీషన్లు తదితర కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగించాలని అనంతరం మధురానగర్లో నిర్మాణంలో ఉన్న కమ్యునిటిహాలును పరిశీలించారు. సికింద్రాబాద్ డిప్యూటి కమిషనర్ రవికుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ అశ్విన్ కుమార్, స్థానిక కార్పొరేటర్లు హాజరయ్యారు.

సుప్రీంతీర్పుపై హర్షం

విజయక్రాంతి, హైదరాబాద్: మాతృ రాష్ట్రంలో చేసుకున్న రిజిస్ట్రేషన్‌తో ఇతర రాష్ట్రాల్లోనూ విధులు నిర్వహించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు లక్ష్మణ్ రుఢావత్ బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

గతంలో స్వరాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసే నర్సులు తప్పనిసరిగా ఆ రాష్ట్రంలోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనతో చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. తాజాగా సింగిల్ నర్సింగ్ రిజిస్ట్రేషన్‌తో నర్సులు దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఉద్యోగాలు చేయవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమకు ఎంతో ఊరటనిచ్చాయని లక్ష్మణ్ రుఢావత్ తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గచ్చిబౌలి డివిజన్‌లో ప్రభుత్వం నూతనంగా మంజూరు జేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జిల్లా డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారిని కలిసి ఆరోగ్య కేంద్ర ఏర్పాటు విషయంలో చర్చించినట్లు సాయిబాబా తెలిపారు. గచ్చిబౌలిలో ప్రజా ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఉన్నత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వదంతులు నమ్మకండి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



విజయక్రాంతి, ఎల్బీనగర్: కొంత మంది స్వార్థ రాజకీయాల కోసం వదంతులు సృష్టిస్తు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నారని వాటిని ప్రజలు నమ్మవద్దని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం హస్తినపురం డివిజన్ రోషన్ దౌల కాలనీలో పర్యటించి స్థానిక ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గూర్చి అడిగి తెలుసుకున్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. కొంత మంది దళారులు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయిస్తామని మోసం చేస్తారని, వారిని నమ్మి లబ్ధిదారులు మోసపోవద్దని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్య వచ్చిన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన ప్రజలకు భరోసా కల్పించారు.

ఫిబ్రవరి 1న కార్యకర్తల సమావేశం



విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మున్సిపల్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఫిబ్రవరి 1వ తేదిన గాజులరామారంలోని విన్ ప్యాలిస్ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని, దీనికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని వివరించారు.

మానసిక వికలాంగులను ఆదుకుంటాం

విజయక్రాంతి, అంబర్‌పేట్: మానసిక వికలాంగులపై చూపాల్సింది జాలి కాదని, వారి అభ్యున్నతి కోసం తోడ్పాటునందించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని టీఆర్‌ఎస్ పార్టీ అంబర్‌పేట్ నియోజకవర్గం ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం నల్లకుంట ఓయూ రోడ్డులో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలేషన్ సెంటర్ ఫర్ హాండీక్యాపడ్(డీడీవీటీఆర్‌సీ) ఆవరణలో మానసిక వికలాంగులకు ఇంటర్ స్కూల్‌లో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ రెడ్డి డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఎన్.ఉషారెడ్డితో కలిపి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు తమ కాళ్లపై తాము నిలబడేందు కోసం వృత్తి శిక్షణ ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పిస్తున్న డీడీవీటీఆర్‌సీ సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సురేఖ, కార్యదర్శి డాక్టర్ కె.ఉషారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన బీసీలకు మంజూరైన రుణాల చెక్కులను ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ పంపిణీ చేశారు. హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అధికారి నాగేశ్వరావు, సీనియర్ టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. –విజయక్రాంతి, ముషీరాబాద్



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ –అంబర్‌పేట్, విజయక్రాంతి

ప్రజా ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

విజయక్రాంతి, బోడుప్పల్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం బోడుప్పల్ మున్సిపల్ పరిధిలో రూ.45 లక్షల వ్యయంతో మూడు చోట్ల ఆరుబయట వ్యాయామశాలలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ వ్యాయామం అనేది ప్రతి వ్యక్తి జీవితంతో నిత్యకృత్యం కావాలని అన్నారు. వ్యాయామశాలలు అందుబాటులో లేని కారణంగా బోడుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ప్రజా అవసరాల నిమిత్తం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి, ఎంపీపీ బండారు శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ మంద సంజీవ రెడ్డి, ఎంపీటీసీలు వుటుకూరి శారద, కొత్త దుర్గమ్మ, జె. పద్మారాములు, తోటకూర చందర్ యాదవ్, విజయ్ కుమార్ యాదవ్, వీరాచారి, టీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు చెర్ల అంజనేయులు, పులకండ్ల జంగారెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు రాసాల వెంకటేష్, మీసాల కృష్ణ, నత్తి మైసయ్య, మైసగళ్ల మల్లేష్, ఉప్పరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కోడి గుడ్లతో మందుల తయారీ!

ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే ఏ పదార్థంలో అయినా మానవుల వ్యాధులను అరికట్టకలిగే వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. అలా కాకుండా జన్యుమార్పిడి ద్వారా పుట్టిన కోళ్ల పెట్టే గుడ్లతో ఆర్థ్రైటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులకు మందు కనిపెట్టవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ కోళ్ల పెట్టే గుడ్లలో ఔషధ గుణాలుంటున్నాయని, వాటితో వ్యాధుల నివారణ సాధ్యమని వారు చెబుతున్నారు. దీనికి ఖర్చు కూడా తక్కువేనని వారు అంటున్నారు. కొద్దికాలంలోనే ఈ మందుల ఉత్పత్తిని భారీ స్థాయిలో చేపట్టవచ్చని, మందుల తయారీ కోసం కోళ్లకు ఎలాంటి హాని తలపెట్టాల్సిన అవసరం లేదని ఎడిన్‌బరోకు చెందిన రోస్లిన్ టెక్నాలజీస్ ప్రతినిధి డాక్టర్ లిసా హెరాన్ తెలిపారు. కోళ్ల పెంపకం కేంద్రాల్లో వాటికి రోజూ సరైన సమయానికి ఆహారం, నీళ్లు అందిస్తారు. గుడ్లు పెట్టడం వల్ల కోళ్ల ఆరోగ్యానికి ఎలాంటి హానీ కలగదు అని లిసా అంటున్నారు. జన్యు మార్పిడి చేసిన మేకలు, కుందేళ్ల పాలు, కోళ్ల పెట్టే గుడ్లతో ప్రోటీన్ థెరపీలను చేయవచ్చని గతంలోనే శాస్త్రవేత్తలు నిరూపించారు. అయితే ప్రస్తుత పరిశోధన మరింత ప్రభావమంతమైనదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించవచ్చని వారు అంటున్నారు. ఫ్యాక్టరీల్లో మందుల తయారీతో పోలిస్తే కనీసం 10 నుంచి 100 రెట్లు తక్కువ ఖర్చుతోనే కోడిగుడ్ల నుంచి మందులు తయారు చేయవచ్చని, ఇదే తమ లక్ష్యమని డాక్టర్ లిసా చెబుతున్నారు. కొన్ని రకాల రసాయనాలు, ప్రొటీన్లను మన శరీరం తగిన స్థాయిలో తయారుచేసుకోలేకపోవడమే చాలా వ్యాధులకు కారణం. తక్కువైన ఆ ప్రొటీన్లను శరీరానికి అందిస్తే చాలా జబ్బులను నయం చేయవచ్చు. వీటిని ఫార్మా కంపెనీల్లో కృత్రిమంగా తయారుచేయడం చాలా ఖర్చుతో కూడుకున్నది. డాక్టర్ లిసా బృందం మానవ శరీరంలో ఈ ప్రొటీన్లను ఉత్పత్తి చేసే జన్యువులను కోళ్ల శరీరంలో గుడ్డులో ఉండే తెల్లసొనను తయారు చేసే డీఎన్ఏలో ప్రవేశపెట్టారు. ఈ కోళ్లు పెట్టిన గుడ్ల తెల్ల సొనలో భారీ స్థాయిలో ప్రొటీన్లు ఉన్నట్లు డాక్టర్ లిసా కనుగొన్నారు. వీటిలో ప్రధానంగా రెండు ప్రొటీన్లు మానవ రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడతాయి. వాటిలో ఒకటి క్యాన్సర్, వైరల్ ఇన్ఫెక్షన్లపై ప్రభావం చూపించేది కాగా, రెండోది దెబ్బతిన్న కణజాలాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుంది. కేవలం మూడు గుడ్లతోనే ఔషధంలో ఒక డోస్ తయారు చేయవచ్చంటున్నారు.

మనుగడ పోరులో మతమెందుకు?

బ్రెజిల్‌లో మిగతా ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా, తమ జీవితం తాము గడుపుతున్న ఆదిమ తెగల మనుగడను ప్రమాదంలో పడదోస్తూ మత ప్రచారకులు చేస్తున్న ప్రయత్నాలు ఆందోళనకరం. అమెజాన్ ప్రాంతంలో మిగతా మానవాళి స్పర్శకు దూరంగా నివసించే హి మెరిమా అనే తెగ ప్రజలలో మత మార్పిడులు చేసేందుకు స్టీవ్ క్యాంప్ బెల్ అనే ఒక మిషనరీ ప్రయత్నాలు చేయడం ఇలాంటి ఆదిమ తెగల మనుగడ కోసం ప్రయత్నిస్తున్న సంస్థలు, వ్యక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బయటి వారి స్పర్శతో ఈ తెగల ప్రజలకు కొత్త వ్యాధులు వస్తాయి, ఆ వ్యాధులను తట్టుకునేందుకు కావలసిన రోగ నిరోధక శక్తి వీరిలో ఉండదు. కాబట్టి ఒక్క సారి బయటివారి సంస్పర్శలోకి రాగానే ఇలాంటి తెగలు పూర్తిగా అంతరించిపోతాయి. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి తెగల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం జరుగుతుంది. ఈ చర్యలను నీరు గార్చడమంటే ఆ తెగల మనుగడపై ప్రశ్నచిహ్నాలు పెట్టడమే. ఇది మేక పిల్లలను తోడేళ్లకు వదిలివేయడం లాంటిదే.

బ్రెజిల్‌లో హి మెరిమా తెగ వంటివి మరొక పది పన్నెండు ఉన్నాయి. ఇవి మిగతా ప్రపంచానికి దూరంగా తమదైన జీవితాన్ని గడుపుతున్నాయి. బయటి వారి రాకతో ఈ తెగలు వ్యాధుల బారిన పడి అంతరించిపోతున్నాయి. ఇలాంటి తెగల్లో ఒకటైన అకుంట్సు తెగకు పశువులు మేపుకునేవారితో పరిచయం ఏర్పడింది. పశువుల కాపరుల నుంచి అంటుకున్న వ్యాధుల వల్ల దాదాపు తెగ మొత్తం అంతరించిపోయింది. ప్రస్తుతం కేవలం అయిదుగురు మాత్రమే మిగిలారు. పెరూలో 1990వ దశకంలోనే నహువా, మురు సహువా అంటి తెగలు ఇవే కారణాల వల్ల అంతరించిపోయాయి.

బ్రెజిల్‌లో ఆదిమ తెగలను మిగతా వారికి దూరంగా ఉంచి వారిని కాపాడాలని ప్రభుత్వాలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి. అందుకే బ్రెజిల్‌లో ఈ తెగల పరిరక్షణ కోసం ఏర్పాటైన ప్రభుత్వ ఏజెన్సీ పునాయ్ కూడా ఈ తెగలలోకి స్టీవ్ క్యాంప్ బెల్ వంటి మతప్రచారకులు చొరబడటాన్ని తీవ్రంగా పరిగణించింది. స్టీవ్ గత నెల హి మెరిమా తెగ నివసించే ప్రాంతంలో చొరబడి, వారిని కలుసుకునేందుకు ప్రయత్నించాడు. పొరుగునే ఉన్న జమామాడి అనే తెగకు జీపీఎస్ పరికరాలు వాడే విధానాన్ని నేర్పించే పేరిట ఆయన ఆ ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఆ సాకుతోనే ఆయన హిమారియా తెగను కలుసుకునే ప్రయత్నం చేశాడు. ఆయనకు జమామాడి తెగ మధ్య కూడా నివాసం ఉండటానికీ అనుమతి లేదు.

ఇలాంటి ఆదిమ తెగలకు మతం అవసరం లేదు. కానీ వారికి మతం బోధించేందుకు పట్టుబట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిజానికి ఈ ప్రయత్నాల వల్ల ఆదిమ తెగలకు తెగలే అంతరించిపోతున్నాయి. ఉదాహరణకు బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల్లో నివసించే జో తెగ ను చేరుకునేందుకు 1982 నుంచి 1985 వరకూ హెలికాప్టర్ల ద్వారా తినుబండారాలను అందచేసేవారు. వాటిని తిన్న జో తెగ వ్యాధుల పాలై అంతరించిపోయింది. అంతకు ముందు 1987లో మత ప్రచారకులు జో తెగను తొలి సారి కలిసిన తరువాత 45 మంది వ్యాధుల బారిన పడి చనిపోయారని సర్వైవల్ ఇంటర్నేషనల్ సంస్థ తన నివేదికల్లో తెలియచేసింది.

నిజానికి బ్రెజిల్ కొత్త దేశాధ్యక్షుడు జైర్ బోల్సోనారో ఆదిమవాసుల నివాస ప్రాంతాలకు బయటి వారు వెళ్లేలా వీలు కల్పిస్తామని, వలసవాద పాలనలో బానిసత్వాన్ని వదిలించుకుని అడవులకు పారిపోయిన క్విలొంబోలా వర్గం వారికి విడిగా నివాసప్రాంతాలను కేటాయించబోమని ప్రకటించారు. ఇందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన తరువాత ఒక మత ప్రచారకుడిని ఆదిమ తెగల వ్యవహారాల శాఖ మంత్రిగా నియమించారు. ఆ తరువాత నుంచే ఆదిమ తెగల నివాస ప్రాంతాల్లో ఇలాంటి అనవసర చొరబాట్లు ప్రమాదకరంగా పెరిగాయి.

నిజానికి దీనిని ఒక చెదురుమదురు సంఘటనగా చూడకూడదు. గత నవంబర్‌లో అండమాన్ నికోబార్ ద్వీప సమూహంలో అరవై వేల సంవత్సరాలుగా తమదైన శైలిలో బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా జీవిస్తున్న సెంటినలీస్ తెగ ప్రజల మతం మార్చేందుకు జాన్ అలెన్ చౌ అనే అమెరికన్ మత ప్రచారకుడు ప్రయత్నించి, చనిపోయాడు. అతను ద్వీపంలోకి భద్రతా దళాల కన్ను గప్పి లోపలికి ప్రవేశించి, ఆదిమ సెంటినలీస్ తెగ ఆగ్రహానికి గురై చనిపోయాడు. ప్రవేశ నిషేధ నియమాలు అమలులో ఉన్న సెంటినలీస్ ద్వీపంలోకి జాన్ అలెన్ చౌ వంటి వివాదాస్పద వ్యక్తులు ప్రవేశించడం కూడా ఆందోళన కలిగించే పరిణామం.

ఆదిమ జాతుల జీవన శైలిని ప్రభావితం చేసే ఈ ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. సర్వైవల్ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు, సర్ మారక్స్ రైలాన్స్ వంటి వ్యక్తులు ఇప్పటికే ఈ దిశగా పోరాటాలు చేస్తున్నారు. మతాన్ని, ఆధునిక జీవన శైలిని అందించే ప్రయత్నంలో ప్రచారకులు చేస్తున్న తప్పిదాల వల్ల ఈ తెగలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

పురుగు పడుతున్న బియ్యం

ముచ్చెట

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాల నిరోధానికి జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ ప్రశంసలు పొందుతోంది. అయితే అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్న బియ్యం విషయంలో మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో లక్షల రూపాయల విలువైనవి పాడైపోతున్నాయి. జిల్లాలో అక్రమ రవాణా, నిల్వలతోపాటు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న రూ.80లక్షల విలువైన బియ్యం పంపిణీకి నోచుకోకపోవడంతో చౌకధర దుకాణాలు, మండల స్థాయి నిల్వ గోదాములో ముక్కి పురుగు పట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.జిల్లాలో అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చౌకధర దుకాణాలు, మండల స్థాయి గోదాముల్లో అధికారులు నిల్వ ఉంచారు. మండల గోదాముల్లో 2142.77 క్వింటాళ్లు, చౌకధర దుకాణాల్లో 1256.47 క్వింటాళ్లు నిల్వలు ఉన్నాయి. ప్రజా పంపిణీ బియ్యం కిలోకు రూ.24 అని లెక్క వేసుకున్నా స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.81 లక్షలకు పైగా ఉంటుంది. స్వాధీనం చేసుకున్న సమయంలోనే సమగ్రమైన నివేదికలు పొందుపర్చి ప్రజా పంపిణీ బియ్యం అని నిర్ధారించుకున్న వెంటనే సమీప చౌకధర దుకాణాలు, మండల స్థాయి గోదాములకు అందించి వాటిని అదే నెల లేదా వారం రోజుల్లో ఆహార భద్రత కార్డు దారులకు పంపిణీ చేయవచ్చు. నిబంధనల పేరుతో పట్టుకున్న సొత్తును అధికారులు మూలకు చేర్చడంతో పురుగుపట్టి పోతున్నాయి. అధికారులు ఈ విషయంలో ప్రజలకు ఉపయోగపడే చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– శ్యామల, మహబూబ్‌నగర్

విశ్వాసంతో బంధుత్వాలు బలోపేతం



14- విశ్వసనీయత

బంధుత్వానికి ఉన్నతస్థాయి విశ్వాసం. సంపూర్ణ ఆత్మస్థైర్యానికి, సంపూర్ణమైన నమ్మకానికి, సంపూర్ణాంగీకారానికి నిజాయితీ అవసరం. నీకు ఎవరిపై విశ్వాసం ఉంటే వారిపై నీకు సంబంధించిన అన్నింటినీ విశ్వాసంతో వదలిపెట్టు. నీవు ఎవ్వరినైనా విశ్వసిస్తే ఉద్వేగం మాయమౌవుతుంది. నీ భారం తగ్గి, ప్రతిగా నీపై నీకు నమ్మకం కలుగుతుంది.

విశ్వసించు, విశ్వసనీయతను పొందు.

నిజాయితీ, ప్రేమ, ప్రాతినిధ్యం, శక్తిదాయకాలకంటే అధికం. ప్రేమ పోషించేది. ప్రాతినిధ్యం అధికారాన్నిచ్చేది. శక్తిదాయకం శక్తిమంతం చేసేది. విశ్వాసం నీకు సర్వాన్నీ ఇస్తుంది.

నిన్ను ఎవరైనా విశ్వసిస్తే నీ బాధ్యత ఉన్నతస్థాయిని పొంది ఆవ్యక్తికి సహకారాన్ని, రక్షణను కల్పించడానికి నీవు అన్నీ చేయాల్సివస్తుంది.

విశ్వాసం బంధుత్వాలను బలోపేతం చేసి అతిశయింపచేస్తుంది. విశ్వాసం కొనసాగితే వ్యక్తులను బంధువులను చేస్తుంది. విశ్వాసానికి వెనుక ఉద్దేశ్యాలు ఉంటాయి. నీ ఉద్దేశ్యాలు స్వచ్ఛమైనవైతే నీవు విశ్వసనీయురాలివి, విశ్వాసపూరిత వ్యక్తివి అవుతావు.

సందేహాల తుప్పును, సంశయాలను, భయాలను, 'అయితే', 'కానీ' లను విశ్వాసంగా అతిశయింపచేయి.

నిన్ను నీవు విశ్వసిస్తే నీవు చేయగలవు.

నీ పిల్లను విశ్వసిస్తే ఆమె చేయగలదు.

నీ సహోద్యోగులను విశ్వసిస్తే వారు తప్పక చేయగలరు.

విశ్వాసం అత్యున్నతమైనది. అదే. నీవు ఒక వ్యక్తిని విశ్వసిస్తే హృదయస్థితినుంచీ కలసిపోతావు.

విశ్వసించు, హృదయాలను జయించు. నీ హృదయాన్ని ఇచ్చి విశ్వసనీయతను పొందు.

వ్యక్తులను విశ్వసించు, కానీ పరిస్థితిని అనుసరించి విశ్వసించకు. వారు విశ్వసనీయులే అయినా పరిస్థితిని బట్టి సఫలురు కాలేకపోవచ్చు. పరిస్థితులను పరిశీలించి, మార్గాలను ఏర్పరచి, అడ్డంకులను తొలగించి విశ్వసనీయులకు సహకరించు.

విశ్వసనీయవ్యక్తి నిన్ను చేరకపోతే నీ మనసును చెదరనీయకు. సమయాన్ని ఇవ్వు. విశ్వసనీయుడు సరియైన సమయం లోనే చేరుతాడు.

విశ్వసనీయుడిపై విశ్వాసంతో అప్పగించు. విశ్వసనీయతతో నీ బాధ్యతను అందించు. నీవు విశ్వసించినప్పుడే పరస్పరాధారంలో ఆనందం కలుగుతుంది. నీవు విశ్వసనీయురాలివైతే ఇతరులకు సహకరించే ఆనందం కలుగుతుంది.

విశ్వసించు, ఆనందించు.

విశ్వసించు, హృదయాలను జయించు.

విశ్వాసాన్ని భద్రపరచే మార్గాలు:

- ఏ బంధానికైనా ముందు వ్యక్తులను విశ్వసించు. సంశయించకు. మరొకవిధంగా నిరూపణ అయ్యే వరకు విశ్వసించు. చాలామంది వ్యక్తులు మంచి వారే. విశ్వసనీయులే అంతేకాదు వంచకులు కారు.
- విశ్వాసం గొప్ప సంస్కర్త. ఒక వంచకుడినైనా పూర్తిగా విశ్వసిస్తే అతడు వంచనకు సంశయిస్తాడు. వంచన చేయడు. ఒకసారి అతడు విశ్వాసానం దాన్ని రుచిచేస్తే అతడు మారిపోగలడు.
- నీ ఒప్పందాలను పూర్తి చేయి. నీకు అప్పగించేవి ఏమీ లేకపోతే పూర్తి చేయలేవు. అప్పగింతలను దూరం చేయకు.
- నీవేం చేస్తావో చెప్పు, చెప్పిందే చేయి.
- విశ్వసించినప్పుడు అనుమానించకు.
- సూత్రాలపై నిలువెత్తుగా నిలబడి విశ్వాసాన్ని పొందు.
- నీవు ఎప్పుడైతే పిల్లలను ప్రేమిస్తావో, జాగ్రత్తగా చూస్తావో, పోషిస్తావో అప్పుడు వారు నిన్ను విశ్వసిస్తారు. అప్పుడే నీవు గొప్పదానివి.



గట్టు నారాయణ (గురూజీ)

తీవ్ర పరిణామాలకు దారితీసిన కాకాని మృతి

(నిన్నటి తరువాయి)

ఆంధ్రసేన ఆవిర్భావాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రత్యేక రాష్ట్ర వాదుల సవాల్ ఎదుర్కొనేందుకు ప్రజలు ధైర్యంతో ముందుకు వెళ్ళేందుకు ప్రోత్సహించాలని కమ్యూనిస్టులు చేసిన సూచన మేరకు డిసెంబర్ 24వ తేదీన విజయవాడలో ఒక పెద్ద సభ జరపాలనీ, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర వాదాన్ని నిరసించాలని ముఖ్యమంత్రి, ఆయన సహచరులు నిర్ణయించారు. ఈ సభ జరిగితే తమ ఉద్యమాన్ని అపహాస్యం చేసినట్టు అవగలదని ప్రకటించిన ఆంధ్ర భీష్ముడు కాకాని వెంకటరత్నం ప్రతిపాదిత సభకు వ్యతిరేకంగా, నిరసన ప్రదర్శనలకు ఊరేగింపులకు పిలుపు ఇచ్చారు. ఆ రోజు ఉద్యమకారులపై దమన కాండకు పాల్పడిన పోలీసులు జరిపిన కాల్పులలో ఎనిమిది మంది మరణించగా అనేక మందికి గాయాలు అయ్యాయి. ఆనాటి రాత్రి, ఆస్పత్రుల చుట్టూ తిరిగిన కాకాని వెంకటరత్నం ఆకస్మికంగా గుండెపోటు వచ్చి కన్నుమూసారు.

ఈ విషాద సంఘటన ఉద్యమానికి కొత్త ఊపును ఇచ్చింది.

'నిరాడంబర దేశభక్తుడు: కాకాని వెంకటరత్నం'

బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీజీ నాయకత్వంలో ప్రారంభమైన వివిధ సత్యాగ్రహోద్యమాలలో పాల్గొని ఎన్నో కష్టనష్టాలకు గురియైన దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ కాకాని వెంకటరత్నం. జమిందారీ గ్రామాలలో రైతుల న్యాయమైన హక్కులను సాధించటానికి పోరాటాలు జరిపి, వారి కోర్కెలను సాధించిన రైతు బాంధవుడాయన. గాంధీజీ నిర్మాణ కార్యక్రమంలో ప్రధానాంశాలైన అస్పృశ్యతా నివారణ, ఖాదీ ఉత్పత్తి, గ్రామీణ పరిశ్రమల స్థాపన, హిందీభాషా ప్రచారం, గ్రంథాలయోద్యమ వ్యాప్తికి ఆయన ఎంతో పాటు పడ్డారు. కృష్ణా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులుగా, రాష్ట్రమంత్రిగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన నిర్వహించిన పాత్ర గణనీయమయినది.

శ్రీ కాకాని వెంకటరత్నం కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా, ఆకునూరు గ్రామంలో ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో 1900 సంవత్సరం ఆగస్టు 3వ తేదీన జన్మించారు. 1924లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో స్వచ్ఛంద సేవకుడుగా పనిచేయటంతో ఆయన రాజకీయ జీవితానికి నాంది జరిగింది. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గాను ఆయనకు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. 1937 నుండి 1940 వరకు ఆయన కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శిగా వ్యవహరించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో శ్రీ కాకానిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. 1942 నుంచి 1945 వరకు మూడు సంవత్సరాలు తంజావూరు, నెల్లూరు జైళ్ళలో నిర్బంధంలో ఉన్నారు.

కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీకి చాలాకాలం అధ్యక్షులుగా, 1953లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 1955లో ఉయ్యూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. 1966లో శ్రీ కాకాని వెంకటరత్నం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ ఎన్నికల కమిటీ సభ్యులుగా ప్రతిష్టాత్మక పోటీలో ఎన్నికైనారు. 1967లో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవిని చేపట్టారు. 1968 జూన్‌లో జరిగిన సాధారణ ఎన్నికలలో గన్నవరం నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికైనారు. 1969లో శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలోనూ, 1971లో శ్రీ పి.వి. నరసింహారావు మంత్రి వర్గంలోనూ సభ్యులుగా ఉన్నారు.

(ఎం.ఎల్. నరసింహారావుగారి 'చిరస్మరణీయులు' గ్రంథం నుండి) అంత్యక్రియల రోజు 26న పలు ఆంధ్ర పట్టణాలలో హర్తాళ్ జరిగింది. కృష్ణానదీ తీరాన జరిగిన కాకాని అంతిమ సంస్కారాలకు , ఆ సందర్భంలో జరిగిన బహిరంగసభకు అపార సంఖ్యలో ప్రజలు హాజరుకాగా నాయకులు ఉద్రేకపూరిత ప్రసంగాలు చేశారు. ఆంధ్ర రాయలసీమ ప్రాంతాల జనం తీవ్ర ఉద్రేకానికి లోనైనారు.

కాంగ్రెస్ కార్యకర్తలు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన ప్రత్యేక ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకూడదని తీర్మానించారు. ఈ సభలకు బి.వి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో 131 మంది శాసనసభ్యులు, 11 మంది పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. వీరిలో చాలామందిని అరెస్ట్ చేయడం ద్వారా పోలీసులు వారిని రెచ్చకొట్టారు. అందువలన జనవరి రెండవ తేదీన జరిగిన 'బంద్' ఉధృతంగా జరిగింది. వివిధ పట్టణాలలో ఉద్యమకారులపై పోలీసులు జరిపిన కాల్పులలో సుమారు 60 మంది ప్రాణాలు బలికాగా వందలమంది గాయపడినారు. వేలమంది నిర్బంధానికి గురి అయ్యారు. ఈ ఘోర సంఘటనలపై స్పందించి ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన 15 మంది పార్లమెంటు సభ్యులు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ, జనవరి 26వ తేదీనాటికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకపోతే పరిణామాలు తీవ్రంగా ఉండగలవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయాలని అప్పటికే విద్యార్థులు పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు కనిపిస్తే వారిని ముట్టడి చేసి రాజీనామా చేయాలని వత్తిడి చేయడం ఆరంభించారు. ఆంధ్ర, రాయలసీమ పట్టణాలలో లాఠీ చార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, పోలీసుల కాల్పులు, అమాయకుల మృతి క్రమం తప్పకుండా నిత్యకృత్యంగా కొనసాగాయి. రాష్ట్రంలో మూడింట రెండు వంతుల ప్రాంతం అల్లకల్లోలంగా ఉన్నది.

కాకాని మృతి తీవ్ర పరిణామాలకు దారితీసిన ఈ దశలో కూడ, కమ్యూనిస్టు పార్టీ సహాయంతో తాము ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి ఎదురొడ్డి నిలువగలనని ముఖ్యమంత్రి శ్రీ పి.వి. భావించారు. రాజీనామా చేసిన మంత్రివర్గ సహచరులు ఎనిమిది మంది స్థానాలలో కొత్తవారిని నియమించేందుకు ఆయన పార్టీ అధిష్ఠాన వర్గం అనుమతి కూడ పొందగలిగారు. అయితే మంత్రి వర్గ విస్తరణ జరిగి వారం తిరుగకముందే ఆయన మంత్రివర్గంతో ప్రధాని రాజీనామా చేయించారు. ఆ మరునాడు జనవరి 18వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో తొలి పర్యాయం రాష్ట్రపతిపాలన విధించారు. గవర్నర్ సలహాదారులుగా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ వి.కె. రావు, కేంద్రంలో రక్షణ శాఖ మాజీ కార్యదర్శి హెచ్.సి.సెరిన్ నియమితులయ్యారు.

ప్రత్యేక రాష్ట్ర వాదులందరూ జనవరి 21న కాకినాడలో మహాసభలు నిర్వహించి శ్రీ బి.వి. సుబ్బారెడ్డిని కార్యాచరణ సంఘం అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. ఈ ఎన్నిక తరువాత ఉద్యమ అగ్రనాయకులలో మనస్పర్ధలు చోటు చేసుకోవటం మొదలైనది. కాకినాడలో ఒక ప్రకటన చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీ వరకు సమస్య పరిష్కారంకాక పోయినట్లయితే తాము విప్లవం సృష్టించనున్నట్టు బి.వి. సుబ్బారెడ్డి ప్రకటన చేశారు. జనవరి 27న నెల్లూరులో సమావేశమైన విద్యార్థి కార్యాచరణ సమితి, ఫిబ్రవరి 15న కారంచేడులో సమావేశమైన కార్యాచరణ సంఘం ప్రజాప్రతినిధులు తమ తమ పదవులకు రాజీనామా చేయాలని తీర్మానించారు. శ్రీమతి గాంధీ ఆహ్వానం మేరకు శ్రీ బి.వి. సుబ్బారెడ్డి, ఎవరూ ఆహ్వానించకుండా మరికొందరు మాజీ మంత్రులు ఢిల్లీ సందర్శించడాన్ని కారంచేడు సమావేశం అభిశంసించినది. ఈ సమావేశానికి హాజరు కాకుండా శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, తెన్నేటి విశ్వనాథం, యన్.జి.రంగా ప్రభృతులు తప్పించుకున్నారు. అయితే కారంచేడు సమావేశంలో కాంగ్రెస్ – కాంగ్రెసేతర పార్టీల నాయకుల మధ్య జరిగిన తగాదాలకు మాత్రం ప్రచారం బాగా లభించింది. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు


రైతుల శ్రమకు అధిక విలువతో ఆర్థికాభివృద్ధి

రైతుపక్షం



వ్యవసాయ రంగం ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో అనేక స్థితి గతులు కలిగి ఉంది. ప్రపంచమంతా వ్యవసాయ రంగం విస్తరించి ఉంది. ప్రతి మనిషికి కావలిసిన ఆహారం వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా లభిస్తుంది. వ్యవసాయ రంగం కేవలం ఆహార అవసరాలను తీర్చడమే కాకుండా ఆ దేశాల యొక్క ఆర్థిక స్థితి గతులను ప్రభావితం చేస్తుంది. వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యత ఉన్న దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంటుంది. వ్యవసాయం అంటే భారత దేశం. భారత దేశం అంటే వ్యవసాయ రంగం. ప్రపంచంలో అత్యధిక భూ భాగంలో భారత దేశంలో పంటలు పండుతాయి. మన దేశంలో 50 శాతం మంది ప్రజలు వ్యవసాయ పంటలు పండిస్తూ, పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత పనులు చేయడం భారతీయ ప్రజల జీవన ఆధారం. ప్రధాన పంటలైన వరి, గోధుమ, పత్తి వంటి పంటలు ప్రపంచంలో భారత దేశంలో అధిక విస్తీర్ణంలో పండుతున్నాయి. అయితే భారతదేశంతో పోల్చితే చైనా ఆహార ఉత్పత్తులలో మొదటి స్థానంలో ఉంటుంది. అధిక ఉత్పత్తులు సాధిస్తున్నప్పటికీ వారి యొక్క వ్యవసాయ భూమి భారతదేశం కన్నా తక్కువ విస్తీర్ణం కలిగి ఉంటుంది. చైనీయులు తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులను సాధిస్తున్నారు. చైనీయులు వ్యవసాయరంగంతో పాటుగా పరిశ్రమలు, సేవా రంగాల్లో సమతుకాన్ని పాటించటం ద్వారా ప్రపంచంలో ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు. ప్రపంచంలో ఏ దేశం లేని విధంగా వారు సమతూకాన్ని పాటిస్తున్నారు. చైనాలో రైతులకు వారి యొక్క శ్రమకు కచ్చితమైన ప్రతిఫలం ఉంటుంది. అధిక దిగుబడులు సాధించడం ద్వారా వారు వారి శ్రమకు సరైన ప్రతిఫలం పొందటంలో ముందు ఉన్నారు. మిగతా దేశాలతో పోల్చితే ఒక హెక్టారు భూమిలో వారు ఒకటిన్నర రెట్లు అదనపు దిగుబడి సాధిస్తున్నారు. చైనాలో మొత్తం జనాభాలో 30 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. భారతదేశంతో పోల్చినప్పుడు భారతీయులు ఒక హెక్టారులో శ్రమ చేసి పండించే పంటను చైనీయులు సుమారు రెండు రెట్లు అధికంగా ఉత్పత్తి చేస్తారు.

అదే విధంగా అమెరికాలో మొత్తం జనాభాలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే ప్రజల సంఖ్య జనాభా ప్రాతిపదికన ప్రపంచంలోనే అత్యల్ప శాతంగా చెప్పవచ్చు. మొత్తం జనాభాలో 0.7 శాతం మంది ప్రజలు మాత్రమే అమెరికాలో వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి యొక్క ఆదాయం ప్రపంచంలో మొత్తం రైతులతో పోల్చితే అనేక రెట్లు అధికంగా ఉంటుంది. ఇక్కడ అధిక దిగుబడితో పాటు ఆధునిక వ్యవసాయం చేయటం ద్వారా తక్కువ మంది శ్రమతో వ్యవసాయం చేస్తున్నారు. అమెరికాలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రోసెసింగ్ ప్రధాన జీవన ఆధారం. వ్యవసాయం చేసే వారికన్నా వ్యవసాయ ఉత్పత్తులను ప్రోసెసింగ్ చేయడం, మార్కెటింగ్ చేయటంపై ప్రధానంగా అమెరికన్లు ఆధారపడి ఉన్నారు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు కన్నా 15 రెట్లు అధికంగా వ్యవసాయ ఉత్పత్తుల ఫుడ్ ప్రోసెసింగ్ కంపెనీల ద్వారా వారు వారి పంటలకు అధిక విలువ పొందుతున్నారు. అందువలన రైతుల పంటలకు అదనపు విలువ అందుతోంది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రోసెసింగ్ చేయటం, నేరుగా వినియోగదారులకు అమ్మటం, పంటలను ఎక్కువకాలం నిల్వ చేయడం, సంవత్సర కాలం వ్యవసాయ ఉత్పత్తులను అమ్మటంతో రైతులు పండించే పంటలకు డిమాండ్, సరఫరా బ్యాలెన్సు చేస్తున్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతిలో కూడా ముందు ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులకు అమెరికాలో ఒక రైతు శ్రమ యొక్క విలువ భారత రైతులతో పోల్చినప్పుడు 20 నుంచి 30 శాతం అధికంగా వారి ఆదాయం ఉంటుంది. అమెరికాలో రైతుల శ్రమకు అత్యధిక విలువ లభిస్తుందని చెప్పటానికి ఉదాహరణ. వ్యవసాయంలో ఆధునికమైన పద్ధతులున్నాయి. ఆధునిక పద్ధతుల ద్వారా రైతుల శ్రమ తక్కువగా ఉండి అధిక దిగుబడితో పాటు సగటున ఒక రైతు సాగు చేసే వ్యవసాయ భూమి అధికంగా ఉంటుంది. ఇక్కడ వ్యవసాయం ఒక వ్యాపారం మాదిరి పెద్ద పెద్ద కమతాల్లో పండిన పంటను సరైన పద్ధతిలో నిల్వ చేయటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వ ఉండి సరైన మార్కెటింగ్ వ్యవస్థ కలిగి ఉంటాయి.అమెరికాలో రైతుల యొక్క శ్రమకు ప్రపంచంలో ఎక్కడ లేనంత విలువ ఉంటుంది. భారతదేశంలో మొత్తంలో 50 శాతం జనాభాలో 60 కోట్ల మంది వారి యొక్క శ్రమతో పండించే పంట యొక్క విలువ సుమారు 35 లక్షల కోట్ల రూపాయలు. అమెరికాలో మొత్తం జనాభాలో రైతుల సంఖ్య 0.9 శాతం కాగా సుమారు వ్యవసాయం చేస్తున్న వారి సంఖ్య 30 లక్షల మంది కన్నా తక్కువ. వారి యొక్క శ్రమ విలువ దాదాపు 13 లక్షల కోట్ల రూపాయలు. దీనిని గమనిస్తే ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంలో రైతు యొక్క శ్రమ విలువకి భారతదేశంలోని రైతుల యొక్క శ్రమ విలువకి ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. ఈ వ్యత్యాసాన్ని మరిన్ని కోణాల్లో పరిశీలించాల్సిన అవసరం ఉంది. భారతదేశం యొక్క నాయకత్వ ధోరణి ఆత్మరక్షణలో ఉండటం చేత ప్రపంచంలోనే అపారమైన మానవ వనరులు, సహజ వనరులు ఉండి అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ఉంది. ప్రపంచ దేశాలతో పోటీలో భారతదేశం ఆర్థికంగా ఎదుగుతున్న దేశాల జాబితాలో జీడీపీ పెరుగుదలలో మొదటి స్థానంలో ఉంది. కాని ప్రస్తుత భారత దేశం యొక్క జీడీపీ పెరుగుదల 7.4 వరకు ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ అమెరికా, చైనాని అధిగమించాలి అంటే అసాధ్యం. 270 లక్షల కోట్లు జీడీపీ ఉన్న భారత దేశం 2000 లక్షల కోట్ల జీడీపీ కలిగిన అమెరికాను అధిగమించడానికి 7.4 నుంచి పెరుగుదల 40కు చేరుకోవలిసిన అవసరం ఉంది. జనాభాపరంగా నేడు అమెరికా కన్నా మరో నాలుగు రెట్లు అదనంగా ఉండవలిసిన భారత ఆర్థిక వ్యవస్థ నేడు అమెరిక కన్నా 7, 8 రెట్లు తక్కువగా ఉండటం బాధాకరం. భారత ప్రభుత్వం ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల ద్వారానే మరో పది రెట్లు జీడీపీని పెంచుకునే వెసులు బాటు వుంది. భారత్‌లో అపారమైన మానవ వనరులు, సహజ వనరులు ఉండి కూడ ఆర్థిక అభివృద్ధిలో వెనుకపడటానికి గల కారణాల గురించి నేటి ప్రభుత్వాలు ఆలోచించాలి.



–మార్తా రామకృష్ణ
ఖమ్మం, 99486 73333

'మొక్కుబడి భేటీలకు జనసేన దూరం'

విజయక్రాంతి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ లేఖ రాశారు. తెలుగుదేశం పార్టీ బుధవారం నిర్వహించనున్న అఖిలపక్ష భేటీకి తమ పార్టీ దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. బుధవారం సమావేశం ఉంటే మంగళవారం సాయంత్రం ఆహ్వానిస్తే ఎలా అని ప్రశ్నించారు. సరైన అజెండా లేకుండా నిర్వహించే మొక్కుబడి భేటీలకు జనసేన దూరంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై అఖిలపక్ష సమావేశం పెట్టడం హర్షణీయమన్న పవన్ కళ్యాణ్, అఖిలపక్ష సమావేశానికి తమను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డినెన్స్‌పై వివరణ కోరిన గవర్నర్

విజయక్రాంతి, హైదరాబాద్: చుక్కల భూములకు సంబంధించి ఏపీ ప్రభుత్వ ఆర్డినెన్స్‌పై వివరణ కోరుతూ గవర్నర్ నరసింహన్ దస్త్రాన్ని వెనక్కి పంపారు. దరఖాస్తుకు కనీస పరిష్కార సమయం 2 నెలలు పెట్టడంపై ఆయన అభ్యంతరం తెలిపినట్లుగా తెలుస్తోంది. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు రెండు ఆర్డినెన్సులు పంపగా వాటిలో ఒకదానికి ఆమోదం తెలిపి, మరోదానిపై వివరణ కోరారు. ఏపీ అసైన్‌మెంట్ ల్యాండ్‌కు ఆమోదం తెలిపిన గవర్నర్ 20 ఏళ్ల వరకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఎవరికీ అమ్ముకోకుండా ఉండే నిబంధనకు అంగీకారం తెలిపారు. చుక్కల భూములపై అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఆర్డినెన్స్‌కు ఆస్కారం లేదనే అభిప్రాయం గవర్నర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ జరుగుతున్నప్పుడే మరో ఆర్డినెన్స్‌కు ఎలా ఆమోదం తెలిపారనే చర్చ ప్రభుత్వవర్గాల్లో నడుస్తోంది. అసైన్‌మెంట్ ల్యాండ్ దస్త్రం అసెంబ్లీ నోటిఫికేషన్‌కు ముందు వచ్చిందని, చుక్కల భూముల దస్త్రం అసెంబ్లీ షెడ్యూల్ వెలువడ్డాక వచ్చిందన్నది గవర్నర్ కార్యాలయ వర్గాల భావనగా తెలుస్తోంది. చుక్కల భూముల బిల్లుకు సంబంధించి గవర్నర్ ఆమోదంతో సంబంధం లేకుండా నేరుగా అసెంబ్లీలో బిల్లు పెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

ఫిబ్రవరి 5న ఏపీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్



విజయక్రాంతి, అమరావతి: ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని సభాపతి కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన జరిగిన శాసనసభా సలహా కమిటీ (బీఏసీ) నిర్ణయించిందని సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. బీఏసీ సమావేశం వివరాలను మీడియాకు ఆయన వెల్లడించారు. 5న శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టనున్నారు. మొత్తం ఏడు రోజులపాటు సభ జరగనుంది.

8వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం శాసనసభను నిరవధికంగా వాయిదా వేయనున్నారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలకు సెలవుగా నిర్ణయించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన విభజన సమస్యలపై సభలో చర్చించి అదే రోజు బ్లాక్ డేగా ప్రకటించనున్నారు. ఫిబ్రవరి ఆరో తేదీన గవర్నర్ ప్రసంగం ధన్యవాదాల తీర్మానంపై చర్చ జరగనుంది.

రిట్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయక్రాంతి, అమరావతి : ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన కోడికత్తితో దాడి ఘటన కేసును అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు అప్పగిస్తూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదంటూ ఏపీ ప్రభుత్వం హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. వెంటనే ఎన్ఐఏ విచారణపై స్టే విధించాలని ప్రభుత్వం ఈ పిటిషన్‌లో పేర్కొంది. అయితే ఈపిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగ్గా తక్షణమే విచారణను నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వం వాదించింది. గత హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్‌పై ఎన్ఐఏ అధికారులు కౌంటర్ దాఖలు చేయగా, తమ వాదనను వినిపించేందుకు ఏపీ ప్రభుత్వం మరింత గడువు కోరింది. దీంతో ఈ కేసు విచారణను కోర్టు ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. హైకోర్టులో ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసే సమయం దగ్గరపడుతుండటంతో టీడీపీ ప్రభుత్వం ఈ కేసును నిలువరించేందుకు శతవిధాల ప్రయత్నిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఎన్ఐఏకు ఇవ్వాలని సిట్ అధికారులను హైకోర్టు ఆదేశించినప్పటికీ వారిలో ఎలాంటి చలనం లేదు.

రాహుల్‌ని ప్రధానిని చేస్తాం

- బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



విజయక్రాంతి, కర్నూలు : ప్రాణాలు అర్పించైనా తమ అధినేత రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని కాంగ్రెస్ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్, ప్రియాంక గాంధీలను త్వరలోనే కర్నూలుకు తీసుకువస్తామన్నారు. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి కుటుంబం కాంగ్రెస్‌ను వీడినా పార్టీకి వచ్చే నష్టం ఏమి లేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఇతర పార్టీల నాయకుల్ని లాక్కోవడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. జిల్లాలో రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ కర్నూల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డికి దక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఆయన తన దూకుడును పెంచినట్లు తెలుస్తోంది.

ఆర్థిక ఇబ్బందులున్నా ఏపీ అభివృద్ధి

- వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 11శాతం వృద్ధి రేటు
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్



విజయక్రాంతి, అమరావతి : రాష్ట్రం విభజన నష్టాల నుంచి కోలుకుని అభివృద్ధి పథంలో పయనిస్తోందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. నాలుగున్నరేళ్లలో విభజన హామీలతో పాటు ప్రత్యేకహోదా అమలుకాలేదని చెప్పారు. అవినీతి రహిత పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 11శాతం వృద్ధి రేటు నమోదు చేశామని చెప్పారు. అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైందని, అనేక రంగాల్లో ఇప్పటికే సంతృప్త స్థాయిని సాధించామని గవర్నర్ వివరించారు.

కేంద్రం చేయూత అవసరం

పొరుగు రాష్ట్రాలతో పోటీపడే స్థాయికి ఏపీ చేరే వరకూ కేంద్రం చేయూత అవసరమని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం ఇచ్చిన రూ.350 కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం ఊహించని పరిణామమని ఆయన అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం అభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. కేంద్రం సహాయ నిరాకరణకు పాల్పడుతూ తోడ్పాటు అందించడం లేదని, సహకరించకపోయినా ఆదర్శంగా నిలవడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని చెప్పారు. సగటున రాష్ట్ర వృద్ధిరేటు 10.66గా ఉందన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద 2014–15 నుంచి 2018–19 వరకు రూ.24,618.39 కోట్లు పంపిణీ చేశామని గవర్నర్ నరసింహన్ చెప్పారు.

చాలా హామీలను కేంద్రం నెరవేర్చలేదు

విభజన చట్టంలోని చాలా హామీలను కేంద్రం ఇంకా నెరవేర్చలేదని గవర్నర్ అన్నారు. కేంద్రం నిధులపై రాష్ట్రం సమర్పించిన వినియోగపత్రాలను నీతి ఆయోగ్ ధ్రువీకరించిందని చెప్పారు. ప్రత్యేకహోదా ఇవ్వకూడదని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన విరోధమన్నారు. ప్రజలు ఆత్రుతగా ఎదురు చూసినా కేంద్రం ఆర్థికంగా ఆదుకోలేదని, రాష్ట్రం అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండాపోయిందన్నారు. విభజన కారణంగా ఆర్థిక, ఇతర వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినా రాష్ట్ర నాయకత్వం వల్ల కష్టాల నుంచి గట్టెక్కామని చెప్పారు. పింఛన్ల కోసం రూ.14వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశే అని, ఆదరణ పథకం ద్వారా 90 శాతం రాయితీపై పరికరాలు అందిస్తున్నామని గవర్నర్ తెలిపారు.

సాగునీటికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం వయాడక్ట్ విధానం ద్వారా ఆర్థిక పురోగతిని సాధించేందుకు కృషి చేస్తోందని, నాలుగున్నరేళ్లలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నరసింహన్ చెప్పారు. సాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి ఈ నాలుగున్నరేళ్లలో రూ.64,333 కోట్లు ఖర్చు చేసిందని, దీంతో 32 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.15,585కోట్లు ఖర్చు చేశామన్నారు. 2019 చివరి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కృష్ణా–గోదావరి నదుల అనుసంధానంతో నీటి కొరతను అధిగమించామని, పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో 263 టీఎంసీల నీటిని డెల్టాకు మళ్లించామన్నారు.

జాతిపితకు నివాళులు

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఉభయసభల సభ్యులంతా ఆయనకు నివాళులర్పించారు. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యాక రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

ఒక రాష్ట్రం – ఒక సిరీస్



విజయక్రాంతి, అమరావతి: 'ఒక రాష్ట్రం – ఒక సిరీస్' పేరిట ఏపీ రవాణా శాఖ వినూత్న విధానాన్ని ప్రారంభించింది. రేపటి నుంచి రిజిస్ట్రేషన్ చేసే కొత్త వాహనాలకు AP 39 సిరీస్‌తో వాహనాల నెంబర్లు కేటాయించనున్నారు. అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో ఈ నూతన విధానం అమల్లోకి రానుంది. విజయవాడలో ఈ నూతన విధానాన్ని రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. రవాణా శాఖ కమిషనర్ బాలసుబ్రమణ్యం, అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకూ వాహనాలకు జిల్లాకో కోడ్ చొప్పున కేటాయించేవారు. ఇకపై ప్రతి జిల్లాలో ప్రతి కొత్త వాహనానికి AP 39 సిరీస్‌తో నెంబర్లు కేటాయించనున్నారు. ఆర్టీసీ వాహనాలకు AP 39Z, పోలీస్ వాహనాలకు AP 39P, రవాణా వాహనాలకు AP 39T, సహా U,V, W, X, Y సిరీస్ కేటాయించారు. ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో 'ఒకే రాష్ట్రం ఒకే సిరీస్' విధానానికి శ్రీకారం చుట్టామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గతంలో రవాణా శాఖ అంటే ప్రజల్లో అవినీతి శాఖ అనే అభిప్రాయం ఉండేదని, సాంకేతికతతో అవినీతిని పూర్తి స్థాయిలో నివారించామన్నారు. మిగిలిన అన్ని విభాగాల్లో కెల్లా ఉత్తమ విభాగంగా నిలిపామన్నారు.

రవాణా శాఖ సేవలన్నీ సత్వరం ప్రజలకి అందుబాటులో తేవాలని తాను బాధ్యతలు చేపట్టినపుడు చంద్రబాబు ఆదేశించినట్లు రవాణా శాఖ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. సాఫ్టవేర్ రూపొందించి కేవలం 58 రోజుల్లో అన్ని రకాల సేవలు ఆన్‌లైన్‌లోకి తెచ్చామని ఆయన వివరించారు. వాహనం కొన్నవారికి పర్మినెంట్ నెంబర్ రావడానికి గతంలో రెండు నెలలకుపైగా వేచి చూడాల్సి వచ్చేదని, ఇప్పుడు వాహనం కొన్న వెంటనే షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి అమలు చేస్తున్నామన్నారు. రవాణా శాఖలోని 83 సేవల్లో 70 రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు కాజేయటానికి కుట్రలు

- బొత్స సత్యనారాయణ

విజయక్రాంతి, విజయవాడ: అగ్రిగోల్డ్ ఆస్తులు కాజేయటానికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్‌లు కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత బొత్సా సత్యనారాయణ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 20 లక్షల అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ప్రభుత్వం ఆటకెక్కించిందని మండిపడ్డారు. తాము పోరాటం చేస్తుంటే ప్రభుత్వం హడావిడి చేస్తోందని విమర్శించారు. రూ.1183 కోట్లు ఇస్తే 80 శాతం మందికి న్యాయం జరుగుతుందని, కానీ ప్రభుత్వం దగ్గరనుంచి స్పందన లేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. క్యాబినేట్ సమావేశంలో అగ్రిగోల్డ్ అంశం లేదని, కానీ టీడీపీ గెజిట్ పత్రికల్లో అగ్రిగోల్డ్ బాధితులకు 250 కోట్లు.. అని రాశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగిస్తూ అగ్రిగోల్డ్ అంశం ఎక్కడా తేకపోవడం దురదృష్టకరమన్నారు. సీబీసీఐడీ వెంటనే అగ్రిగోల్డ్ ఆస్తుల లిస్ట్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ వాచ్‌డాగ్‌లా అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడిందని తెలిపారు. ఫిబ్రవరి 4న విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బినామీ ఆస్తులు ఎందుకు సీజ్ చేయడం లేదని ప్రశ్నించారు. 'అఖిలపక్షం కాదు.. పక్షాలు పోయాయి, పక్షులు మిగిలాయి.. టీడీపీ ఏకాకిగా మిగిలింది' అంటూ ఎద్దేవా చేశారు.



ప్రత్యేక హోదాకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది

ప్రత్యేకహోదా తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రత్యేక హోదా కోసం బంద్ నిర్వహించినప్పుడు ఈ నేతలే తమపై విమర్శలు చేశారని గుర్తుచేశారు. తమ నేతలు చాలామందిని అరెస్ట్ చేసి జైలులో పెట్టారని పేర్కొన్నారు. వారే ఇప్పుడు ప్రత్యేకహోదా పేరుతో బంద్ కు పిలుపునిచ్చారని వ్యాఖ్యానించారు. విజయవాడలో బుధవారం ఓ మీడియా ఛానల్ తో బొత్స మాట్లాడారు.

ఏపీకి ప్రత్యేకహోదా, విభజన హామీలపై ఢిల్లీలోవైఎస్సార్‌సీపీ ఆందోళన చేస్తే ఢిల్లీలో ధర్నా చేస్తే ఏం ప్రయోజనం అని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారని బొత్స అన్నారు. తాము హోదా విషయమై గుంటూరులో ధర్నా చేస్తే. ఇక్కడ చేసి ఏం ప్రయోజనం. ఢిల్లీకి వెళ్లండి అని చెప్పారని వ్యాఖ్యానించారు.

ఏపీ అభివృద్ధి కోసం 29 సార్లు తాను ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీని కలిశానని చంద్రబాబు చెప్పడాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ఈ 29 సార్లలో ఓ మూడింటిని వదిలేద్దాం.. మిగిలిన 26 సార్లు మోడీని కలుసుకున్నప్పుడు చంద్రబాబు ప్రత్యేకహోదాపై లేఖలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా అని సవాల్ విసిరారు. ఫిబ్రవరి 1న జరిగే బంద్ కు తాము మద్దతు ఇవ్వబోవడం లేదని తేల్చిచెప్పారు.

ఫిబ్రవరి 17న ఏలూరులో వైఎస్సార్‌సీపీ బీసీ గర్జన

- బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్న వైఎస్ జగన్

విజయక్రాంతి, విజయవాడ : ఐదేళ్ల పాలనలో బీసీలకు చంద్రబాబు నాయుడు చేసిందేమి లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తితో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో బీసీల జీవితాలు దుర్భర పరిస్థితిలో ఉన్నాయన్నారు. బీసీలకు న్యాయం చేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఏడాదిన్నర క్రితమే బీసీ అధ్యయన కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. బీసీల పరిస్థితిపై కమిటీ అధ్యయనం చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని బీసీ కుల సంఘాలతో సమావేశమై నివేదిక రూపొందించామని తెలిపారు. ఫిబ్రవరి 17న ఏలూరులో జరిగే బీసీ గర్జనలో వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని చెప్పారు.



బీసీలు ఎవరూ చంద్రబాబును నమ్మడం లేదు : జంగా

ఐదేళ్లుగా బీసీలను గాలికొదిలేసిన చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జయహో బీసీ అంటూ మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి విమర్శించారు. చంద్రబాబు పాలనలో బీసీల జీవితాలు దుర్భర పరిస్థితికి వచ్చాయని ఆరోపించారు. ఐదేళ్ల కాలంలో బీసీలకు చంద్రబాబు చేసిందేమి లేదన్నారు. చంద్రబాబు బీసీలపై చేసే వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. బీసీలు ఎవరూ చంద్రబాబుని నమ్మడం లేదన్నారు. వైఎస్ జగన్ మాత్రమే బీసీలకు న్యాయం చేస్తారని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. వైఎస్సార్సీపీ బీసీ అధ్యయన కమిటీ రాష్ట్రమంతా పర్యటించి సమస్యలను గుర్తించిదని, వాటి పరిష్కారం కొరకు వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. బీసీ కులాలన్ని ఏకమై చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని కోరారు.



వచ్చే ఖరీఫ్‌కు పోలవరం నీళ్లు

- పనులు పూర్తి చేసేందుకు అధికారుల బృందం ప్రణాళిక

విజయక్రాంతి, అమరావతి : వచ్చే 150 రోజుల్లో పోలవరం జలాశయంలో నీరు నిలబెట్టి ఇచ్చేందుకు జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ ఆధ్వర్యంలో పోలవరం చీఫ్ ఇంజినీరు వి.శ్రీధర్, సలహాదారు రమేష్‌బాబుల బృందం ప్రణాళిక సిద్ధం చేసింది. పోలవరం ప్రాజెక్టులో 42.5 మీటర్ల ఎత్తుకు ఎగువ కాఫర్ డ్యాం నిర్మించి , జలాశయంలో నీటిని నిలబెట్టి జూన్ నెలాఖరుకు నీళ్లు సరఫరా చేయాలనేది లక్ష్యం. ఎగువ కాఫర్ డ్యాం పనులు 18శాతం పూర్తయ్యాయి. జూన్ నాటికి ఈ కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయాలనేది లక్ష్యం. దిగువ కాఫర్ డ్యాం పనులను కూడా జూన్‌కు పూర్తి చేసేందుకు ఇబ్బందులు ఏమీ లేవని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులు మే 20 నాటికి పూర్తి చేస్తారు. స్పిల్ ఛానల్‌కు అటూ ఇటూ వరద నీరు పొర్లకుండా కరకట్టలు నిర్మించాలి. వీటి శాశ్వత నిర్మాణాలకు ఇంకా ఆకృతులు ఖరారు కాలేదు. తాత్కాలికంగా కట్టలను నిర్మించనున్నారు. పోలవరం స్పిల్ వేలో మొత్తం 48 గేట్లకు సంబంధించిన పియర్ నిర్మాణం, ఇతర సివిల్ పనులన్నీ ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని నిర్ణయించారు. గేట్లు ఏర్పాటు చేశాక స్పిల్ వే శ్లాబ్ పనులు, స్పిల్ వే వంతెన పనులు చేపడతారు.

మే నెలాఖరుకల్లా మొత్తం 48 గేట్లు ఏర్పాటు చేసి వాటిని నిర్వహించుకునేలా పనులు పూర్తి చేయాల్సిన అవసరం లేదని, జులై నెలాఖరు వరకు కూడా ఈ పనులు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందని ఇంజినీరింగు అధికారులు ప్రణాళిక రూపొందించారు. జూన్‌లో గరిష్ఠంగా 7 లక్షల క్యూసెక్కులు, జులై నెలాఖరుకు గరిష్ఠంగా 13 లక్షల క్యూసెక్కుల వరద రావచ్చని లెక్కిస్తూ , ఆ వరద దిగువకు వదిలెయ్యాలంటే ఎప్పటికి ఎన్ని గేట్లు పని చేయించాల్సి ఉంటుందో అంచనాకు వచ్చారు.

జూలైలో కాలువలకు నీళ్లిస్తాం: వి.శ్రీధర్, పోలవరం చీఫ్ ఇంజినీరు

అన్ని పరిస్థితులను, సవాళ్లను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక సిద్ధం చేశాం. వచ్చే ఖరీఫ్‌కు పోలవరం నీటిని కాలువలకు గ్రావిటీ ద్వారా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఆ మేరకు మేం పనులు పూర్తి చేస్తాం. పోలవరం కాలువలు 35.5 మీటర్ల గర్భ స్థాయితో నిర్మిస్తున్నాం. గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వాలంటే 38.1 మీటర్ల వరకు నీరు నిలబడాలి. ఆ స్థాయిలో నీరు రావాలంటే పోలవరం జలాశయంలో 80 టీఎంసీలు నిల్వ చేయాల్సి ఉంటుంది. ఆ స్థాయి నీళ్లు జులై నెలలోనే వస్తాయి. అంతవరకు గేట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేసి నీళ్లందిస్తాం. ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రధాన డ్యాం పరిధిలో పనులకు రూ.2,000 కోట్ల ఖర్చు చేయగలిగితే సరిపోతుంది. హైడ్రాలిక్ సిలిండర్లను త్వరగా రప్పించేందుకు వీలుగా ఉన్నతాధికారులను ప్రభుత్వం జర్మనీ వెళ్లమని సూచించింది.

కేంద్ర సహకారంతోనే పథకాల అమలు

- బీజేపీ నేత సోము వీర్రాజు



విజయక్రాంతి, అమరావతి : దివంగత నేత ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన జరిగితే కాంగ్రెస్‌తో టీడీపీ ఎలా పొత్తుపెట్టుకుంటుందని బీజేపీ నేత సోము వీర్రాజు ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా గవర్నర్ నరసింహన్ అసత్యాలు ప్రసంగించారని మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు బీసీ కులాలకు ఎక్కడ మేలు చేశారో చెప్పాలన్నారు. కాపులను బీసీల్లో చేరుస్తామన్న హామీ ఎందుకు నెరవేర్చలేదో తెలపాలన్నారు. కేంద్రం చేసిన వాటన్నటినీ చంద్రబాబు తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కేంద్ర సాయం వల్లే రాష్ట్ర ప్రభుత్వం విజయాలు సాధించిందని, 24 గంటల విద్యుత్ సరఫరా కేంద్ర సహకారంతోనే సాధ్యమైందన్నారు. ప్రైవేట్ సంస్థలకు మేలు చేసేందుకే ప్రభుత్వ ప్లాంట్లు మూసి ఉత్పత్తి నిలిపేశారని, ఉపాధి హామీ నిధుల్లో వేల కోట్ల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. 74 అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తోందని, కేంద్రం సహకరించడం లేదనడం అవాస్తవమన్నారు. కేంద్ర ప్రభుత్వనిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పథకాలు అమలు చేస్తోందని, రూ.వేల కోట్లు ఇస్తే, కేంద్రం సహకరించలేదనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధి హామి పథకంలో భాగంగా రూ. 9 వేల కోట్ల నిధులను రాష్ట్రానికి ఇచ్చారని, అభివృద్ధి పథకాల అమలులో కేంద్రం భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబు విడుదల చేసిన 10శ్వేత పత్రాలు అబద్దాలతో నిండినవని విమర్శించారు.

పసుపు, కుంకుమ కింద ఇస్తున్నది గ్రాంటే





విజయక్రాంతి, అమరావతి : డ్వాక్రా సంఘాలను స్థాపించి ఆంధ్రప్రదేశ్ మహిళలను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని మంత్రులు అచ్చెన్నాయుడు, పరిటాల సునీతలు కొనియాడారు. ఇవాళ రాష్ట్రంలో 94 లక్షల మంది మహిళలు సంఘాల్లో ఉండి ఆర్థిక, సామాజిక లాభాలు పొందుతున్నారంటే అది ఆయన దూరదృష్టి, మహిళలపై ఆయనకున్న అభిమానం కారణమన్నారు. పసుపు కుంకుమ కింద ఇస్తున్న మొత్తం పూర్తిగా సభ్యులకు గ్రాంటుగా ఇస్తున్నామని, ఈ నిధులను వారికి కావలసిన రీతిలో ఉపయోగించుకోవచ్చన్నారు. తిరిగి కట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ కింద ఇవ్వబోయే మొత్తం అప్పేనంటూ జగన్ సొంత మీడియాలో వచ్చిన కథనంపై మంత్రులు మండిపడ్డారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ రోజు మహిళలకు చంద్రబాబు భాగస్వామ్యం కల్పించారన్నారు. 'వెలుగు' సంస్థను స్థాపించి సంఘాలను పటిష్టం చేసి దేశానికి ఆదర్శంగా నిలబెట్టారన్నారు.

అఖిలపక్షం పేరుతో కొత్త డ్రామా

- వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పేర్ని నాని

విజయక్రాంతి, విజయవాడ: అఖిలపక్షం పేరుతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త డ్రామాకు తెరతీశారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పేర్ని నాని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు అఖిలపక్షం ఏర్పాటు చేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు. పైగా విపక్షాలు హాజరు కాలేదని గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణం విషయంలో అఖిలపక్షాన్ని పిలిచారా అని నిలదీశారు. టీడీపీ నేతలు భూములు కొనుక్కున్న చోటునే చంద్రబాబు రాజధాని ప్రకటించారని గుర్తుచేశారు. ఎవరి సలహాలు తీసుకోకుండా రాష్ట్రాన్ని చీకటిమయం చేశారని మండిపడ్డారు. వ్యక్తిగత అవసరాల కోసం చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీతో లాలుచీ పడ్డారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజలు ఛీదరించుకుంటారనే అఖిలపక్షం ఏర్పాటు పేరుతో చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. టీడీపీ, బీజేపీలు కలిసి రాష్ట్ర ప్రజలను వంచన చేశాయని తెలిపారు.

రైల్వే ఉద్యోగాల పేరుతో మోసం

విజయక్రాంతి, విజయవాడ : రైల్వే ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను బోల్తా కొట్టించిన ఓ ముఠా బాగోతం బుధవారం బయటపడింది.

ముంబైకి చెందిన మిత్రా, నాగూర్, వరుణ్ యశ్వంత్ సోలంకి విజయవాడ కేంద్రంగా ఈ మోసానికి తెరలేపారు. ఒక్కో ఉద్యోగాన్ని రూ.8 లక్షలకు అమ్ముతామంటూ బేరం పెట్టిన మోసగాళ్లు నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో ఫేక్ ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. ఈ తతంగంపై అనుమానం వచ్చిన చిరంజీవి అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

నిందితులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. ఇంటర్వ్యూల సందర్భంగా నిరుద్యోగుల నుంచి రెండు లక్షల రూపాయలు వసూలు చేసేందుకు ముఠా సభ్యులు యత్నించినట్టు తెలిసింది.

ఫిబ్రవరి 1న సీబీఐ చీఫ్ నియామక కమిటీ భేటీ

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) పూర్తి కాలపు డైరెక్టర్ నియామక కమిటీ శుక్రవారం (ఫిబ్రవరి 1న) సమావేశం కానుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సభ్యులు. మల్లికార్జున ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ సీబీఐ చీఫ్ ఎంపిక కమిటీ తదుపరి సమావేశం ఫిబ్రవరి 1న జరుగుతుందని చెప్పారు. సీబీఐ చీఫ్‌గా ఎంపిక చేయాలనుకుంటున్న అభ్యర్థుల జాబితాలోని వ్యక్తుల అనుభవం, ఇతర వివరాలు సవివరంగా అందజేయలేదని ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు.

జయ మరణంపై కమిషన్ విచారణ

- ఒంటరితనాన్ని కోరుకున్న జయలలిత



చెన్నై: జయలలిత వైద్యం పొందే సమయంలో కొన్నిసార్లు చిరునవ్వు నవ్వేవారని, అప్పుడప్పుడు ఒంటరిగా వదిలేయమని కోరేవారని ఆ సమయంలో ఐసీయూలో విధులు నిర్వహించిన వైద్యురాలు పేర్కొన్నారు. ఈ మేరకు జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్కు ఆమె వాంగ్మూలం ఇచ్చారు. జయలలిత 2016 సెప్టెంబరులో ఆస్పత్రిలో చేరగా 75రోజులపాటు వైద్యం పొంది మరణించారు. 2017లో జయలలిత మరణంపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని జస్టిస్ ఆర్ముగస్వామి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ను సర్కారు ఏర్పాటు చేసింది. పలువుర్ని కమిషన్ విచారిస్తోంది. నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా అందజేయాలని విచారణను కమిషన్ వేగవంతం చేసింది.ఇందులో భాగంగా జయలలిత ఆస్పత్రిలో చేరినప్పుడు అక్కడ ఐసీయూలో విధులు నిర్వర్తించిన డాక్టర్ శిల్ప ఇటీవల కమిషన్ ముందు హాజరయ్యారు. ఆమె ప్రస్తుతం అపోలోలో విధులు నిర్వహించకపోయినప్పటికీ ఆమె వివరణను కమిషన్ నమోదు చేసింది. అందులో పై విషయాలను పేర్కొన్నట్లు తెలిసింది.

పూర్తిస్థాయి కాదు.. మధ్యంతర బడ్జెట్టే!





- ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందనే వార్తలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ను ప్రవేశపెట్టనున్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2019–20 సంవత్సరానికి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సాధారణంగా ఎన్నికల ఏడాది మధ్యంతర బడ్జెట్ లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఎన్నికల అనంతరం కొలువు తీరే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఎన్నికలకు ముందు పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయానికి సంబంధించి అనుమతి అవసరం కావడంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం కొద్దినెలల కాలానికి ప్రవేశపెడుతుంది. కాగా, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లడంతో గత వారం ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన పీయూష్ గోయల్ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక శాఖ సహాయమంత్రులు పొన్ రాధాకృష్ణన్, శివ్ ప్రతాప్ శుక్లాలు ఇటీవల హల్వా వేడుకతో బడ్జెట్ కసరత్తును ప్రారంభించిన విషయం విదితమే. ఫిబ్రవరి చివరిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయానికి మోదీ సర్కార్ స్వస్తిపలుకుతూ ఫిబ్రవరి ఒకటవ తేదీనే బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో ఏప్రిల్‌లో నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభానికే మంత్రిత్వ శాఖలు తమ కేటాయింపులు పొందేలా కార్యాచరణ రూపొందించుకునే వెసులుబాటు ఏర్పడింది. ఈ సారి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏయే అంశాలపై దృష్టి కేంద్రీకరించనుందనే విషయంపై ఆసక్తి నెలకొంది. బడ్జెట్‌లో రైతులకు సంబంధించి పెద్ద ఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ఇప్పటికే వార్తలు గుప్పుమంటున్నాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో మోదీ సర్కార్ బడ్జెట్ ఎలా ఉండనుందో అంశం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

లోక్‌పాల్ ఏర్పాటయ్యే వరకూ దీక్ష

కావాలనే ఆలస్యం చేస్తున్నారు: అన్నాహజారే

ముంబై: లోక్‌పాల్ బిల్లుపై మరోమారు అన్నహాజారే నిరశన దీక్షకు దిగారు. లోక్‌పాల్ బిల్లు 2013లోనే ఆమోదం పొందినా దీని గురించి ఏ పార్టీ గానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోలేదనే అసహనంతో హజారే ఈ దీక్షకు దిగారు. లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటుచేసే వరకూ నిరశన దీక్ష విరమించబోనని అన్నా స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హజారే నిరాహార దీక్ష గురించి ప్రకటించారు. '2014లో అవినీతి రహిత ప్రభుత్వం అనే నినాదంతో మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆయన లోక్‌పాల్ బిల్లును అమలు చేస్తారని, తద్వారా దేశంలో అవినీతికి కళ్లెం పడుతుందని ఆశించా. ఐదేళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ప్రభుత్వం కావాలనే దీన్ని ఆలస్యం చేస్తూ వస్తోంది. అందుకే నేను మరోసారి దీక్షకు దిగుతున్నా' అని అప్పట్లో హజారే పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయని మృతి



- భర్త పరిస్థితి విషమం

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రముఖ పాప్ సింగర్ శివానీ భాటియా (24) మంగళవారం ఉదయం మృతిచెందారు. సోమవారం ఉదయం ఆగ్రాలో ఒక ఫంక్షన్ హాజరయ్యేందుకు వెళుతుండగా ఢిల్లీలోని యమునా ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ప్రమాదంలో శివానీ తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం భర్త నిఖిల్‌తో కలిసి కారులో వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో వీరి కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో శివానీ కూర్చున్న వైపు కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే శివానీ, నిఖిల్‌ను దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. అయితే ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మధురలోని నియాస్ ఆసుపత్రికి తరలించారు. కానీ తీవ్రగాయాలతో శివానీ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారని పోలీసు అధికారి వీర్ సింగ్ ప్రకటించారు. భర్తకు వైద్యులు చికిత్స అందిస్తున్నారని, అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. కాగా బీహార్‌కు చెందిన శివానీ స్థానిక 2016లో టీవీ చానల్ నిర్వహించిన పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. అలా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన స్వల్పకాలంలోనే రీమిక్స్, పాప్ సింగర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆమె మృతి పట్ల పలువురు గాయకులు, ఇతర సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

చిన్నారి స్వెట్టర్ విప్పించిన భద్రతా సిబ్బంది

- అసోం సీఎంపై దుమ్మెత్తిపోసిన ప్రతిపక్షాలు
- విచారణకు ఆదేశించిన సీఎం సర్బానంద



ఢిల్లీ: మూడేళ్ల పిల్లాడికి నల్లరంగు స్వెట్టర్ ధరింపచేసిందనే కారణంతో సీఎం సభ జరిగే ప్రాంతంలోని భద్రతా సిబ్బంది ఆ స్వెట్టర్ విప్పేయాలని తల్లికి హుకుం జారీ చేశారు. సీఎం కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఓ చిన్నారి విషయంలో సెక్యూరిటీ సిబ్బంది మితిమీరి ప్రవర్తించడం అసోంలో తీవ్ర వివాదానికి దారితీసింది. అసోం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ బిశ్వనాథ్ జిల్లా బోర్గాంగ్‌లో ఓ సిల్క్ మిల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వీరిలో ఓ మహిళ తన మూడేళ్ల కుమారుడితో కలిసి వచ్చింది. ఆ చిన్నారి నలుపు రంగు జాకెట్ ధరించడంతో.. సెక్యూరిటీ సిబ్బంది సీఎం కార్యక్రమానికి అనుమతించలేదు.

ఆ చిన్నారి వేసుకున్న నలుపు రంగు జాకెట్‌ను విప్పాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో చేసేది లేక అసహనానికి గురవుతూనే ఆ తల్లి పిల్లాడి జాకెట్ విప్పారు. ఆ తర్వాత ఆ పిల్లాడు చలికి వణికిపోయాడు. ఈ తతంగాన్ని అక్కడున్న ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో బయటి ప్రపంచానికి తెలిసింది. దీంతో విపక్షాలు సీఎం సర్బానంద సోనోవాల్ బిశ్వనాథ్‌పై దుమ్మెత్తిపోస్తున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న సీఎం సోనోవాల్ స్పందించారు. తక్షణమే విచారణ జరిపి వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. పౌరసత్వ సవరణ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో కొన్ని రోజులుగా ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. నిరసనకారులు నలుపు రంగు దుస్తులు వేసుకొని తమ వ్యతిరేకత తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో నలుపు రంగు దుస్తులు ధరించిన కొంత మందిని సెక్యూరిటీ సిబ్బంది సీఎం కార్యక్రమానికి అనుమతించలేదు. అయితే.. చిన్నారి విషయంలోనూ అదే రీతిలో ప్రవర్తించడం విమర్శలకు కారణమైంది. దీంతో సోనోవాల్ సమావేశాలకు నిరసనల సెగ తగిలే అవకాశం ఉండడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి హాజరవుతున్న సభలకు నల్ల చొక్కాలు వేసుకొస్తే వాటిని విప్పేయాల్సిందేనని, లేదంటే సభకు వెళ్లేందుకు వారికి అనుమతి ఇవ్వబోమని పోలీసులు ప్రజలకు చెబుతున్నారు. చిన్నారి స్వెటర్‌ను విప్పేసిన వీడియో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి సోనోవాల్ దీనిపై దర్యాప్తు జరపాలని డీజీపీని ఆదేశించారు.

నల్ల చొక్కాలు ధరించి ఆందోళనకారులు నిరసన చేపట్టడం చూస్తూనే ఉంటాం. అయితే అసోం ముఖ్యమంత్రి సోనోవాల్ హాజరవుతున్న ఓ సమావేశానికి నల్ల చొక్కాలు వేసుకురావద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. కానీ.. ఓ మూడేళ్ల చిన్నారి ఆ రంగు స్వెటర్ ధరించి సభకు హాజరయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు ఆ స్వెటర్ విప్పేయాలని అతడి తల్లిని ఆదేశించారు. దీంతో ఆమె తన కుమారుడి స్వెటర్‌ను విప్పేసింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ ఘటన బిశ్వనాథ్ జిల్లాలో చోటు చేసుకుంది. స్థానిక టీవీ ఛానళ్లలోనూ ఈ వీడియో ప్రసారమైంది. ముఖ్యమంత్రి ముందు నిరసన తెలుపుతాడని ఇలా చిన్న పిల్లాడి స్వెటర్‌ను బలవంతంగా విప్పేస్తారా? అంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. తన స్వెటర్ విప్పేయడంతో ఆ చిన్నారి భయపడిపోయి బిగ్గరగా ఏడ్చేశాడు. 'నా మూడేళ్ల చిన్నారి నల్ల రంగు స్వెటర్ వేసుకున్నాడు. దీంతో నా కుమారుడిని ఆ సమావేశానికి హాజరుకానివ్వబోమని భద్రతా సిబ్బంది అన్నారు. ఆ స్వెటర్ను విప్పేయాలని ఆదేశించారు' అని ఆ చిన్నారి తల్లి మీడియాకు తెలిపింది. నల్లా చొక్కాలు నిరసనలు తెలపడానికి చిహ్నమని వారు భావిస్తున్నారు' అని ఓ స్థానిక వ్యక్తి తెలిపాడు.

బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం పారికర్

- రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు రాజకీయ లాభం కోసమే



పనాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. తనలో ఇంకా శక్తి ఉందని, ఆ ధీమాతోనే చురుగ్గా పని చేస్తున్నట్లు పారికర్ తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం రఫెల్ డీల్ పైన ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చేసిన కామెంట్లపై స్పందించారు. రాహుల్‌గాంధీ తనను కలవడం రాజకీయంగా తనకు లాభించాలనే అన్నారు. రాజకీయ లాభం కోసం రాహుల్‌గాంధీ తనపై చేసిన ఆరోపణలు అసత్యాలన్నారు. తాను రాహుల్‌గాంధీ మీడియాలో చేసిన వ్యాఖ్యాలను చూసి నిశ్చేష్టునయ్యానన్నారు. రఫెల్ డీల్ గురించి తనకు తెలియదని రాహుల్ చేసిన వ్యాఖ్యలను పారికర్ తప్పుబట్టారు. అంతకుముందు రోజు ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ.. పారికర్‌ను పరామర్శించిన విషయం విదితమే. ప్యాంక్రియాటిక్ వ్యాధితో బాధపడుతున్న పారికర్ గత కొన్నాళ్లుగా సచివాలయానికి హాజరు కాలేదు. అయితే ముక్కులో ట్యూబ్‌తోనే ఇటీవల బయట అధికారులతో కలిసి కనిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలో తన కుర్చీలో కూర్చొని బడ్జెట్‌ను చదివారు. ఇద్దరు అసిస్టెంట్ల సాయంతో ఆయన బడ్జెట్‌ను చదివి వినిపించారు. కాగా, ఏడాది కాలంగా పారికర్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. గత ఏడాది అమెరికాలో ఆయనకు చికిత్స జరిగింది. అక్కడే మూడు నెలల పాటు ఉన్నారు.

కార్తీ చిదంబరం విదేశాలకు సుప్రీం ఓకే

- షరతులతో అంగీకరించిన కోర్టు



ఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసుల్లో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి. చిదంబరం కుమారుడు కార్తీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కార్తీ విదేశాలకు వెళ్లేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అయితే ఇందుకు కొన్ని షరతులు విధించింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో రూ. 10కోట్లు జమ చేసి కార్తీ విదేశాలకు వెళ్లొచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే విచారణకు మాత్రం తప్పకుండా సహకరించాల్సి ఉంటుందని కోర్టు ఆదేశించింది.

'ఫిబ్రవరి 10 నుంచి 26 మధ్య మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటే అక్కడకు వెళ్లొచ్చు. కానీ విచారణకు మాత్రం తప్పకుండా సహకరించాలి. ఎయిర్‌సెల్ మ్యాక్సిస్, ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మార్చి 5, 6, 7, 12 తేదీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలి. ఒకవేళ మీరు విచారణకు సహకరించకపోతే మేం తదుపరి కఠిన చర్యలకు కూడా ఉపక్రమించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రస్తుతమైతే మీరు వెళ్లొచ్చు. అయితే అందుకోసం సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో రూ. 10కోట్లు జమ చేయాల్సి ఉంటుంది' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది.

అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్ల కోసం కొద్ది నెలల పాటు ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కార్తీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 10 నుంచి 26, మార్చి 23 నుంచి 31 మధ్య తాను విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కావాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఫిబ్రవరి 10 నుంచి 26 మధ్య మాత్రమే కార్తీ విదేశాలకు వెళ్లేందుకు అనుమతినిచ్చింది.

యోగిపై శశి వ్యాఖ్యలు

థరూర్‌పై బీజేపీ శ్రేణుల మండిపాటు

న్యూఢిల్లీ: యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ కుంభమేళాలో పవిత్ర స్నానం చేస్తున్న ఫోటోపై సీనియర్ కాంగ్రెస్ నేత శశి థరూర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్నే రేపుతున్నాయి. సీఎం యోగి తన కేబినెట్ సహచరులతో కలిసి కుంభమేళాలో స్నానం చేసే ఫోటోను ట్వీట్ చేసిన శశి థరూర్ దానికి ఇచ్చిన క్యాప్షన్‌పై బీజేపీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నాయి. యోగి స్నానం చేసిన అనంతరం గంగా జలాలను శుద్ధిచేయాల్సిన అవసరం ఉందని, వారు చేసిన పాపాలు నది నుంచి కొట్టుకుపోవాలని థరూర్ వ్యాఖ్యానించారు. థరూర్ వ్యాఖ్యలను యూపీ మంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్ తిప్పికొట్టారు. శశి థరూర్ తాను చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకునేందుకు గంగా నదిలో మునకేయాలన్నారు. కుంభమేళా ప్రాధాన్యతను శశి థరూర్ సరైన రీతిలో అవగాహన చేసుకోలేదనేందుకు ఆయన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. తన వ్యాఖ్యలు థరూర్ ఎలాంటి వాతావరణంలో పుట్టి పెరిగారో వెల్లడిస్తున్నాయని ఎద్దేవా చేశారు. 'మీరు చాలా తప్పులు చేశారు..వాటిని దిద్దుకునేందుకు కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించండి..మీ పాపాలను పోగొట్టుకోండి'అంటూ శశి థరూర్‌కు యూపీ మంత్రి హితవు పలికగా.. శశిథరూర్ గురించి ఎవరికి తెలియదు? అతని నేపథ్యం చేసిన పాపాలు అంటూ నెటిజన్ల నుంచి కౌంటర్‌లు వస్తున్నాయి. అయితే శశిథరూర్ ట్వీట్‌తో బీజేపీ విమర్శిస్తుండగా, ఆయన పార్టీ వర్గాలు భుజానికెత్తుకోవడం గమనార్హం.

రాహుల్‌గాంధే ఆ వ్యాఖ్యలు చేయించారా? : స్మృతి ఇరానీ

మరోవైపు శశిథరూర్ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ స్పందించారు. హిందూవుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ శశిథరూర్‌ను ఉసిగొల్పారని ఆరోపించారు. 2019 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయంగా లబ్ధి కోసం శశిథరూర్‌తో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేయించారని అనుకోవాల్సి వస్తోందన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై స్టే జారీ చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ చట్టం కింద నిందితులకు ముందస్తు బెయిల్ నిరాకరించడాన్ని తిరిగి చట్టంలో జోడిస్తూ తీసుకువచ్చిన సవరణలపై స్టే ఇవ్వాలన్న అప్పీల్‌ను నిలిపివేయలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన తీర్పుపై కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌తోపాటు అన్ని అంశాలను ఫిబ్రవరి 19న విచారణ చేపడతామని న్యాయస్థానం వెల్లడించింది.

ఈ అంశాన్ని లోతుగా విచారించాల్సిన అవసరం ఉన్నందున దీనికి సంబంధించిన అన్ని అంశాలను వచ్చే నెల 19న వాద, ప్రతివాదనలను కోర్టు పరిశీలిస్తుందని జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని సుప్రీం బెంచ్ పేర్కొంది. చట్టానికి చేసిన మార్పులను తక్షణమే నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదించగా, ఎస్సీ, ఎస్టీ చట్టానికి చేసిన సవరణలపై స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద విచారణ లేకుండానే అరెస్టులు వద్దంటూ గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఈ చట్టాన్ని బలోపేతం చేస్తూ గత ఏడాది ఆగస్ట్ 9న పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే.

మహాత్మునికి ప్రముఖుల నివాళులు





ఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీ 71వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి రాజ్‌ఘాట్ వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తదితరులు అంజలి ఘటించారు.







వెనెజువెలాపై అమెరికా ఆంక్షల కొరడా

- రూ.77 వేల కోట్ల మేరకు నష్టపోయే అవకాశం

వాషింగ్టన్: వెనెజువెలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా అమెరికా ఆంక్షల కొరడా ఝుళిపించింది. ఆ దేశ ప్రభుత్వరంగ చమురు సంస్థ 'పెట్రోలియోస్ డి వెనెజువెలా, ఎస్ఏ(పీడీవీఎస్ఏ)'తో అమెరికాకు చెందిన పలు సంస్థలు లావాదేవీలు జరపకుండా నిషేధం విధించింది. ఫలితంగా వచ్చే ఏడాది కాలంలో వెనెజువెలా ఖజానాకు సుమారు రూ.77 వేల కోట్ల మేర ఆదాయం దూరమవుతుందని అంచనా. వెనెజువెలాలో వారం రోజులుగా రాజకీయ సంక్షోభం నెలకొంది. దేశాధ్యక్షుడు నికోలస్ మాద్యురోకు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనలను ఉద్ధృతం చేశాయి. ప్రతిపక్ష నేత జువాన్ గుయిడో తనను తాను తాత్కాలిక దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. జువాన్కు అమెరికా మద్దతుగా నిలుస్తోంది.



కువాన్ గ్వాయిడో దేశం విడిచి వెళ్లవద్దు

- వెనెజువెలా సుప్రీంకోర్టు

వెనజువెలా : ప్రతిపక్ష నేత కువాన్ గ్వాయిడో దేశం విడిచి వెళ్ళడాన్ని నిషేధిస్తూ వెనెజువెలా సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయన బ్యాంక్ అకౌంట్లను కూడా స్తంభింప చేసింది. గతవారం గ్వాయిడో తనను తాను తాత్కాలిక అధ్యక్షునిగా ప్రకటించుకున్న తరువాత ముదిరిన రాజకీయ సంక్షోభంలో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది. గ్వాయిడోకు అమెరికా తదితర దేశాల మద్దతు లభించింది. అయితే, నికొలస్ మడూరోకు రష్యా వంటి దేశాలు అండగా ఉన్నాయి. మడూరో ఇటీవల ఒక ఇంటర్వ్యూలో, తాను ప్రతిపక్షంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'ప్రతిపక్ష నేతలతో కలిసి చర్చలు జరపడానికి, వెనెజువెలా మంచి కోసం ఏం చేయాలో నిర్ణయించడానికి నేను సిద్ధంగా ఉన్నా' అని ఆయన కరకాస్లో రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ ఆర్.ఐఏ నోవోస్టితో అన్నారు.

అయితే, ముందస్తు అధ్యక్ష ఎన్నికలు జరిగే అవకాశమే లేదని, మళ్ళీ ఎన్నికలు జరగాల్సింది 2025లోనే అని చెప్పిన మడూరో, 'రాజకీయ చర్చలకు ఒక మెరుగైన సంకేతం'గా ముందస్తు పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించడాన్ని తాను బలపరుస్తానని కూడా అన్నారు.

ఫేస్‌బుక్ రహస్య చెల్లింపులు

- టీనేజర్లకు 20 డాలర్లు ఇచ్చి సమాచారం సేకరణ
- వ్యక్తిగత సమాచారం తస్కరణపై మీడియా దిగ్గజంపై ఆరోపణలు



కాలిఫోర్నియా: అంతర్జాతీయంగా దూసుకుపోతున్న సోషల్ మీడియా దిగ్గజం ఫేస్ బుక్ తొక్కిన అడ్డదారులు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. టీనేజర్లకు నెలకు 20 డాలర్లు ఇచ్చి వారి సమాచారాన్ని సేకరించిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. యూజర్ డేటాను కంపెనీ సేకరించేందుకు 'ఫేస్ బుక్ రీసెర్చ్' అనే వర్చువల్ ప్రైవేట్ నెట్ వర్క్(వీపీఎన్) ఇన్ స్టాల్ చేసుకున్నవారికి ఫేస్ బుక్ రహస్యంగా చెల్లింపులు జరుపుతున్నట్టు ఒక నివేదిక తెలిపింది.

ఇది యాపిల్ పాలసీకి విరుద్ధం..

టెక్ క్రంచ్ రిపోర్ట్ ప్రకారం సోషల్ మీడియా దిగ్గజం యూజర్ల వినియోగ శైలి తెలుసుకొనేందుకు ఈ రీసెర్చ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. దీనిని భవిష్యత్తులో నిలిపేసే యోచనలో కూడా ఫేస్ బుక్ లేదు. యాపిల్ యాప్ స్టోర్ ను పక్కనపెట్టి టీనేజర్లు, పెద్దలు తన రీసెర్చ్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని నెట్ వర్క్ ట్రాఫిక్ కి రూట్ యాక్సెస్ ఇచ్చినందుకు బహుమతులు ఇస్తోంది. దీని ద్వారా ఫేస్ బుక్ యూజర్ల ఫోన్ వినియోగం, ఏమేం చేశారో విశ్లేషించగలదు. ఇది యాపిల్ పాలసీకి విరుద్ధమని టెక్ క్రంచ్ తెలిపింది.

వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తోంది..

ఐఓఎస్ లేదా ఆండ్రాయిడ్ ఫోన్లలో 'ఫేస్ బుక్ రీసెర్చ్'యాప్ ఇన్ స్టాల్ చేసుకొని వారి వ్యక్తిగత సమాచారాన్ని అమ్మినందుకు 2016 నుంచి ఫేస్ బుక్ 13 నుంచి 35 ఏళ్ల వయసుల యూజర్లకు నెలకు 20 డాలర్లు చెల్లిస్తోంది. ఎవరికైనా సిఫార్సు చేస్తే అందుకు అదనపు ప్రోత్సాహకం కూడా ఇస్తోంది. అమెజాన్ ఆర్డర్ హిస్టరీ పేజీ స్క్రీన్ షాట్ ను తమకు పంపాలని యూజర్లను కోరేది. ఈ యాప్ మీ ఫోన్లో ప్రత్యేకమైన సెక్యూరిటీ సర్టిఫికెట్ ఇన్ స్టాల్ చేస్తుంది. ఒకసారి ఇన్ స్టాల్ చేసిన తర్వాత, వివిధ చాట్ యాప్ ల ద్వారా మీరు జరిపిన వ్యక్తిగత సంభాషణలు, ఫోటోలు, వీడియోలు, ఈమెయిళ్లు, ఇంటర్నెట్లో మీరు వెతికే కీవర్డ్స్, వెబ్ బ్రౌజింగ్ యాక్టివిటీ, మీ లొకేషన్ డీటెయిల్స్ వంటి పూర్తిస్థాయి సమాచారం ఫేస్ బుక్ సేకరిస్తూ ఉంటుంది.

ఆసియా బీబీకి ఊరట

- దైవదూషణ కేసులో నిర్దోషిగా విడుదల

ఇస్లామాబాద్: దైవదూషణ ఆరోపణలపై ఎనిమిదేళ్లపాటు పాకిస్థాన్ జైల్లో మగ్గి ఇటీవల నిర్దోషిగా బయటపడిన క్రిస్టియన్ మహిళ ఆసియా బీబీకి మరోసారి ఊరట లభించింది. ఈ కేసులో ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన రివ్యూ పిటీషన్‌ను పాకిస్థాన్ సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఆసియా బీబీని నిర్దోషిగా తేలుస్తూ గతేడాది అక్టోబరులో పాక్ సుప్రీం కోర్టు ప్రకటించింది. దీంతో ఆమె జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఈ తీర్పును మత ఛాందస వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తీర్పును మరోసారి సమీక్షించాలని కోరుతూ మహ్మద్ సలామ్ అనే వ్యక్తి న్యాయస్థానంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టిన చీఫ్ జస్టిస్ ఆసిఫ్ సయీద్ ఖోసా నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్ తీరును తప్పుబట్టింది. 'సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాతే మేం తీర్పు వెల్లడించాం. తప్పు చేయని వారిని కూడా శిక్షించాలని ఇస్లాం చెప్పిందా? మా తీర్పు తప్పని భావిస్తే దాన్ని మీరు రుజువు చేయండి' అని చీఫ్ జస్టిస్ ఖోసా అసహనం వ్యక్తం చేశారు.



ఆసియా బీబీ 2009లో ఓ పొలంలో పనిచేస్తుండగా తోటి మహిళలను త్రాగు నీరు అడిగింది. కానీ బీబీ క్రైస్తవురాలు కావడంతో ఆమెకు నీరు ఇచ్చేందుకు వారు నిరాకరించారు. త్రాగునీటి కుండను కూడా తాకనీయలేదు. ఈ నేపథ్యంలో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో స్థానిక మతపెద్ద ఒకరు ఆసియా బీబీ దైవదూషణకు పాల్పడిందని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆమెపై కేసు పెట్టి జైల్లో నిర్బంధించారు. ఆమెకు మద్దతు పలికిన ఇద్దరు నాయకులను కాల్చి చంపేశారు. దిగువ కోర్టులు ఆమెకు మరణశిక్ష విధించగా.. గతేడాది అక్టోబరులో ఆసియా బీబీని నిర్దోషిగా తేలుస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆందోళనల నేపథ్యంలో నెదర్లాండ్స్ పారిపోయిన బీబీ న్యాయవాది గతవారమే పాక్కు తిరిగొచ్చారు.

పాకిస్తాన్‌లో జడ్జిగా హిందూ మహిళ

- కరాచీలో న్యాయమూర్తిగా నియమితులైన సుమన్‌కుమారి

కరాచీ: పాకిస్థాన్లోని ఒక జిల్లా న్యాయమూర్తిగా హిందూ మహిళ సుమన్ కుమారి నియమితులయ్యారు. ముస్లింల ఆధిక్యం గల పాకిస్థాన్లోని సింధ్ రాష్ట్రం ఖ్వాంబర్‌షాహ్దద్కోట్కు చెందిన సుమన్ కుమారి ఆమె తన సొంత జిల్లా కోర్టు న్యాయమూర్తిగా సేవలందించనున్నారు. సుమన్ కుమారి తన ఎల్ఎల్బీ కోర్సును హైదరాబాద్లో పూర్తిచేశారు.తర్వాత కరాచీలోని సాబిస్ట్ విశ్వవిద్యాలయంలో పీజీ పట్టా అందుకున్నారు. పేదలకు న్యాయసాయం కోసమే న్యాయ వ్యవస్థలోకి వచ్చానని తెలిపారు. తాను ఈ స్థాయికి రావడానికి తన తండ్రి డాక్టర్ పవన్ కుమార్ బోడన్తోపాటు ఇతర కుటుంబ సభ్యుల మద్దతు ఇతోధికంగా ఉన్నదన్నారు. ఆమె తండ్రి పవన్కుమార్ స్పందిస్తూ పేదలు, ప్రత్యేకించి హిందువులకు అవసరమైన న్యాయ సాయం అందించేందుకు వీలుగా ఆమెకు స్వేచ్ఛనిచ్చినట్లు తెలిపారు. ఆమె పెద్దక్క సాఫ్ట్వేర్ ఇంజినీర్ కాగా, మరో సోదరి చార్టర్డ్ అకౌంటెంట్. హిందువు న్యాయమూర్తిగా నియమితులు కావడం ఇదే మొదటిసారేం కాదు. 200507 మధ్య జస్టిస్ రాణా భగవాన్దాస్.. పాక్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్గా పని చేశారు. ఇక సుమన్ కుమారికి భారత గాయకులు లతా మంగేశ్వరి, అతిఫ్ అస్లాం అంటే ఎంతో ఇష్టం.



ఎన్నికల ముందు భారత్‌లో హింసాకాండ

- హెచ్చరించిన అమెరికా ఇంటలిజెన్స్ చీఫ్

న్యూయార్క్: మే నెలలో జరిగే లోక్ సభ ఎన్నికలకు ముందు భారత్ లో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తుతాయని అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ డాన్ కోట్స్ అమెరికా సెనేట్ సెలెక్ట్ కమిటీకి మంగళవారం తెలిపారు. అధికార బీజేపీ జాతీయవాదాన్ని భుజానికెత్తుకుంటే పార్లమెంటరీ ఎన్నికల్లో మతపరమైన హింసాకాండ ఎక్కువయ్యే అవకాశం ఉన్నట్టు నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ కోట్స్ లిఖితపూర్వకంగా వివరించారు. 'మోడీ ప్రభుత్వం అమలు చేసిన బీజేపీ విధానాలు కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలను పెంచాయి. హిందూ జాతీయవాద ప్రచారాన్ని కొందరు రాష్ట్రస్థాయి నేతలు స్వల్ప మతఘర్షణలు చెలరేగేందుకు ఉపయోగించవచ్చు. తద్వారా తమ మద్దతుదారులను కూడగట్టవవచ్చని వారి ఆలోచన కావచ్చని' కోట్స్ కమిటీకి తెలిపారు.

అమెరికా ఇంటెలిజెన్స్ అంచనాలు

2019లో ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే ప్రమాదాలపై అమెరికా ఇంటెలిజెన్స్ అంచనాలను కోట్స్ సెలెక్ట్ కమిటీకి తెలియజేశారు. ఇటీవల భారత్‌లో పర్యటించిన సిఐఏ డైరెక్టర్ జినా హాస్పెల్, ఎఫ్ బిఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ రే, డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ రాబర్ట్ యాష్లే కూడా సెనేట్ సమావేశంలో పాల్గొన్నారు. మతఘర్షణలు పెరిగితే భారత ముస్లింలు దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపుల ప్రభావం పెరిగేందుకు సహాయపడే ప్రమాదం ఉందని కోట్స్ హెచ్చరించారు. కనీసం ఎన్నికలు పూర్తయ్యే వరకు సరిహద్దు ఉగ్రవాదం, బలహీనమైన దౌత్య సంబంధాలు కొనసాగుతాయని చెప్పారు.



అమెరికాలో –50 డిగ్రీ ఉష్ణోగ్రతలు

- గజగజ వణికిపోతున్న మధ్య పశ్చిమ ప్రాంత ప్రజలు

మిన్నెసోటా: అమెరికాలో చలి ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోంది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలి కారణంగా చాలా చోట్ల ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే కిందకు పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో – 20 నుంచి – 50 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో మధ్య పశ్చిమ ప్రాంతం ప్రజలు గజగజ వణికిపోతున్నారు. దాదాపు తొమ్మిది కోట్ల మంది ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో దాదాపు 2.5 కోట్ల మంది ప్రజలు 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలో జీవిస్తున్నారని అమెరికా జాతీయ వాతారణ సేవల సంస్థ వెల్లడించింది. హిమపాతం కారణంగా మిన్నెసోటాలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రహదారులు మంచుతో కూరుకుపోయాయి. విస్కాన్సిన్ ప్రాంతంలో చలి తీవ్రత మరింత తీవ్రంగా ఉంది. ఇటీవల కాలంలో ఇదే అత్యంత తీవ్రమైన హిమపాతమని స్థానికులు చెబుతున్నారు. ఇక ఉత్తర మిన్నెసోటా, డకోటాల్లో – 50 డిగ్రీలు నమోదయ్యాయి. ఇల్లీనాయిస్, గ్రేట్ లేక్స్, మిన్నెపోలీస్, డెట్రాయిట్, షికాగో తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షికాగోలు 1985 జనవరి 20వ తేదీన – 27 డిగ్రీలు నమోదైంది. ఇప్పటి వరకు అదే రికార్డు. కానీ తాజాగా – 29 డిగ్రీల వరకు చలి నమోదుకావచ్చని నిపుణులు చెబుతున్నారు. కాగా అత్యంత చలి, తీవ్రమైన హిమపాతం కారణంగా అమెరికాలో పలు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాఠశాలలను మూసివేశారు. యునివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, యునివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా కూడా క్లాసులను రద్దు చేశాయి. దాదాపు వెయ్యి విమానాలు రద్దయ్యాయి. పోస్టల్ సర్వీసులు కూడా నిలిచిపోయాయి.

యూకేలోని ఎన్నారైలకు అందుబాటులో అన్ని రకాల సేవలు

లండన్: యూకేలోని దూర ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా పాస్‌పోర్టు, వీసా, సర్టిఫికెట్ ధ్రువీకరణ సేవలను దగ్గర చేసినట్టు లండన్‌లోని ఇండియన్ హై కమిషన్ తెలిపింది. లండన్‌లోని జరిగిన రిపబ్లిక్ డే రిసెప్షన్లో భారత సంతతికి చెందిన వందలాది మంది అతిథులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. యూకేలోని ప్రతి ఒక్క భారతీయుడికి సాయం చేయడమే తమ లక్ష్యమని యూకే ఇండియన్ హై కమిషనర్ రుచి ఘనశ్యామ్ ఈ కార్యక్రమంలో తెలియజేశారు. యూకే, ఇండియా మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలపరిచేందుకు ఇక ముందు కూడా ఇలానే పనిచేస్తామని అన్నారు. పాస్‌పోర్టు రెన్యూవల్, ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) తదితర సర్టిఫికెట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతేడాది నుంచి తామే స్వయంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి భారతీయులకు సహాయపడుతున్నట్టు తెలిపారు. ఫోన్ల ద్వారా సంప్రదించే వారికి కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు గతేడాది డిసెంబరు నుంచి తమ సిబ్బందిని కూడా పెంచినట్టు చెప్పారు. అంతే కాకుండా కాన్సులర్ సర్వీసులకు సంబంధించి ఎటువంటి సహాయం కావాలన్నా లండన్లోని ఇండియన్ హౌస్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈ రిసెప్షన్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన యూకే సెక్రటరీ ఆఫ్ స్టేట్(డిజిటల్, కల్చర్, మీడియా, స్పోర్ట్స్) జెరెమీ రైట్ మాట్లాడుతూ, ఈ ఏడాది తమ దేశం బ్రిటన్‌లో జరగబోయే ప్రపంచ వరల్ కప్పు భారత క్రికెట్ జట్టుకు కూడా ఆహ్వానం పలకబోతోందని ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది భారత్‌కు జారీ చేసిన స్టూడెంట్ వీసాలు 33 శాతం, విజిటర్ వీసాలు 10 శాతం పెరిగినట్టు కూడా ఆయన చెప్పారు. యూకే వర్క్ వీసాలను ప్రపంచ దేశాలన్నిటి కంటే భారత్‌కు ఎక్కువ జారీ చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ఈ ఏడాది గురునానక్ 350వ జయంతిని, మహాత్మాగాంధీ 150వ జయంతిని లండన్‌లో ఘనంగా జరిపేందుకు ఇండియన్ కమిషన్ సన్నాహాలు చేస్తోంది.

ఫోన్లో అశ్లీల వీడియోలు

- ఆస్ట్రేలియాలో భారతీయ యువకుడు అరెస్ట్

ఆస్ట్రేలియా: ఆస్ట్రేలియా దేశ నిబంధనలు తెలియక చిక్కుల్లో పడ్డాడో భారతీయ యువకుడు. ఫోన్లో అశ్లీల వీడియోలు ఉండటంతో విమానాశ్రయంలోనే అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. పెర్త్ విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. కౌలాలంపూర్ నుంచి ఆస్ట్రేలియాకు 32 ఏళ్ల భారతీయుడు వెళ్లాడు. పెర్త్ విమానాశ్రయంలో దిగిన అతడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. లగేజీలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు. కానీ అతడి వద్ద ఉన్న రెండు ఫోన్లను ఓపెన్ చేసి చూసిన అధికారులు ఖంగుతిన్నారు. ఆ యువకుడికి సంబంధించిన ఓ ఫోన్లో అయిదు వీడియోలు ఉన్నాయి. వాటిల్లో ఓ రెండు చిన్న పిల్లలతో చిత్రీకరించిన అశ్లీల వీడియోలు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వెంటనే అతడిని ఆస్ట్రేలియా బోర్డర్ ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం.. అలాంటి వీడియోలను దేశంలోకి తీసుకురావడం నిషేధం. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పెర్త్ న్యాయస్థానంలో హాజరు పరిచారు. ప్రస్తుతం పోలీసుల విచారణలో ఉన్న అతడికి.. దాదాపు రూ.3.75కోట్ల రూపాయల జరిమానా కానీ, పదేళ్ల జైలు శిక్ష కానీ విధించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆస్ట్రేలియా చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకున్న తర్వాతే దేశంలోకి రావాలని అధికారులు చెబుతున్నారు. అశ్లీల వీడియోలను చాలా దేశాల మాదిరిగానే ఆస్ట్రేలియా కూడా నిషేధించిందనీ, ఈ చర్యలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయి.

అమెరికా, యూకేలోని ఎన్నారైలకు పండగే పండగ..

విజయక్రాంతి, హైదరాబాదు: 'రివల్యూషనరీ వీసా రిజైమ్ ఫెసిలిటీ' అనే కొత్త కార్యక్రమానికి పాకిస్థాన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. దీని ద్వారా అమెరికా, యూకేలోని ఎన్నారైలు వీసా ఆన్ ఎరైవ్ల ఇక నుంచి పాకిస్థాన్కు సులభతరంగా వెళ్లే సౌకర్యం కలగనుంది. ఇప్పటివరకు టూరిస్ట్ వీసాపై పాకిస్థాన్ వెళ్లే పర్యటకులకు పీఓకే, గిల్గిత్‌బలిస్థాన్, మరికొన్ని ప్రాంతాలకు వెళ్లడం నిషిద్ధం. కొత్తగా తీసుకొచ్చిన మార్పులతో ఇకపై పర్యటకులు పాకిస్థాన్లోని ఏ ప్రాంతానికైనా ఈజీగా వెళ్లొచ్చని పాకిస్థాన్ సమాచార, ప్రసార శాఖామంత్రి ఫవాద్ హేస్సేన్ ప్రకటించారు. ఈ కొత్త విధానంతో యూకే, అమెరికాలోని ఎన్నారైలకు..ముఖ్యంగా సిక్కులు, హిందువులకు ఎక్కువ ప్రయోజనం కలగనుంది. పాకిస్థాన్లోని అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని సిక్కులు, హిందువులు కోరుకుంటూ ఉంటారు. ఈ అవకాశాన్ని కల్పించినందుకు అమెరికాలోని సిక్కు సంఘ సభ్యులు పాకిస్థాన్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధానాన్ని భారత ప్రజలకు కూడా విస్తరించాలని వాళ్లు డిమాండ్ చేశారు.

కొత్త పాలసీతో 175 దేశాలు ఈవీసా సౌకర్యాన్ని పొందే అవకాశం ఉండగా..50 ఇతర దేశాలు వీసాఆన్ఎరైవల్ ద్వారా ఈ ప్రయోజనాల్ని పొందవచ్చు. దీంతో పాటు ఇప్పటివరకు 68 దేశాలకే పరిమితం చేసిన బిజినెస్ వీసాను కూడా 96 దేశాలకు పెంచారు. అదే విధంగా జర్నలిస్టులకు ఇచ్చే వీసా విధానాలలో కూడా మార్పులు చేపట్టాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీని ద్వారా కొన్ని నగరాలకు మాత్రమే వెళ్లడానికి పరిమితమైన జర్నలిస్టులు ఇకపై దేశం మొత్తం పర్యటించే అవకాశం కలగనుంది.



ప్రజాస్వామ్యంపై దాడి

- కమలా హ్యారిస్




వాషింగ్టన్: అమెరికాలో గతంలోలేనంతగా ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలిచిన భారత సంతతి మహిళ కమలా హ్యారిస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ, ట్రంప్ విధానాలపై ధ్వజమెత్తారు. దేశ ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడి అనంతరం ఇప్పుడు మళ్లీ అమెరికా మార్పు ముంగిట్లోకి వెళ్తోందనీ, ఆ మార్పును ప్రజలు స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. 'స్వేచ్ఛా పాత్రికేయంపై దాడి, ఎగతాళి చేసే నాయకులు మనకు ఉన్నప్పుడు, మన ప్రజాస్వామ్య వ్యవస్థలను వారు నీరుగారుస్తున్నప్పుడు.. అది మన అమెరికా కాదు' అంటూ ట్రంప్‌ను ఉద్దేశించి అన్నారు.


హిందువుననే విమర్శలు: తులసీ గబార్డ్

హిందువునైనందునే తనపై విమర్శలు చేస్తూ తన చిత్తశుద్ధిని శంకిస్తున్నారని అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ బరిలో నిలిచిన మరో మహిళ తులసీ గబార్డ్ ఆవేదన వ్యక్తం చేశారు.' ప్రధాని మోదీతో నా భేటీని రుజువుగా చూపి నేను హిందూ జాతీయవాదినంటూ విమర్శలు చేస్తున్నారు. మోదీతో అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు ఒబామా, మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ సహా ఎందరో భేటీ అయ్యారు. వారినెవ్వరూ ఏమీ అనరు. ఎందుకంటే వాళ్లు హిందువులు కారు. ఇలా చేయడం ద్వంద్వ ప్రమాణాలను పాటించడమే. మత దురభిమానాన్ని ప్రదర్శించడమే' అని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో తులసీ వ్యాఖ్యానించారు.

అత్యంత ప్రాచీన భాషల్లో సంస్కృతం, తమిళం

- ప్రపంచంలోని టాప్ టెన్ పురాతన భాషలు ..





ఇంటర్నేషనల్ డెస్క్: ఈ సృష్టిలో మనుషులు గాని ఏ ఇతర జాతి జీవులు గాని వాటి భావాలను అవతలి వారికి అర్థమయ్యేలా చెప్పాలంటే వాడేది మాట లేదా పదం. అయితే ఇది ఒక్కొక్క ప్రాంతాన్ని బట్టి అనేక రకాలుగా ఎన్నో వేల భాషలుగా విడిపోయింది. అయితే ఈ సృష్టి ఏర్పడి ఎన్నో లక్షల సంవత్సరాలు గడిచినా ఇప్పటికి కొన్ని ప్రాచీన భాషలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి అంటే మీరు నమ్మగలరా..? అలాంటివే కొన్ని టాప్ 10 భాషలు మీకోసం.

1. **హెబ్రూ :** ఇది ఇజ్రాయిల్‌కి చెందిన ప్రాచీన భాష.దాదాపు క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాల క్రిందట పుట్టిందట,ఈ భాష ఇప్పటికి వాడుకలోనే ఉంది.
2. **తమిళం :** దాదాపు 8 కోట్ల మంది భారతీయులు మాట్లాడే భాష.ఇది క్రీస్తు పూర్వం 300 ఏళ్ల క్రిందట ఆవిర్భవించింది.
3. **సంస్కృతం:** దీనిని భారతీయులు దేవతలు మాట్లాడే భాషగా పరిగణిస్తారు.క్రీస్తు పూర్వం 200 ఏళ్ల క్రిందట ఆవిర్భవించింది.ఈ భాషని కూడా ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు.
4. **పార్సీ :** దీనినే పర్షియన్ భాష అని కూడా అంటారు.ఇరాన్,ఆఫ్ఘనిస్తాన్ మరియు తజికిస్థాన్ లో మాట్లాడే ఈ భాష క్రీస్తు పూర్వం 500 ఏళ్ల క్రిందట ఆవిర్భవించింది.
5. **లిత్ యునియన్ :** లిత్ యూనియ, పోలాండ్ దేశాలలో ఎక్కువగా ఈ భాషను మాట్లాడుతారు.దాదాపు క్రీస్తు పూర్వం 3500 ఏళ్ల క్రిందట ఈ భాష ఐరోపా లో పుట్టింది.
6. **గ్రీక్ :** ఈ భాషను ప్రపంచంలోని పండితులు మరియు తత్వవేత్తలు మాట్లాడడానికి ఎక్కువగా వినియోగిస్తారు.ఇది క్రీస్తు పూర్వం 1450 ఏళ్ల క్రిందట ఆవిర్భవించింది.
7. **లాటిన్ :** పోలాండ్ మరియు వాటికన్ సిటీ లలో ఈ భాషను ఎక్కువగా వినియోగిస్తారు.ఈ భాష క్రీస్తు పూర్వం 7వ శతాబ్దంలో ఆవిర్భవించింది.
8. **చైనీస్ :** ఇది కూడా ప్రాచీన భాషే..క్రీస్తు పూర్వం 1200వ శతాబ్దంలో ఆవిర్భవించింది.ఈ భాషను ఎక్కువగా చైనా,తైవాన్,సింగపూర్ మరియు ఉత్తర,దక్షిణ ఆసియాల్లో మాట్లాడుతారు.
9. **బాస్క్ :** ఇప్పటి వరకు విన్న భాషల్లో కన్నా మీరు ఈ భాషనే అతి తక్కువగా విని ఉంటారు.ఉత్తర,దక్షిణ ఫ్రాన్స్ లో ఎక్కువగా మాట్లాడే ఈ భాష,కొన్ని మిలియన్ ఏళ్ల కిందట పుట్టినా ఇంకా వాడుకలోనే ఉంది.
10. **అరబిక్ :** ఈ భాష అయితే తెలీని వాళ్ళు చాలా తక్కువ మందే ఉంటారని చెప్పాలి. ఈ భాష క్రీస్తు శకం 328 వ సంవత్సరంలో ఆవిర్భవించి ఇప్పటికీ అనేక దేశాలలో వాడుకలోనే ఉంది.ఎక్కువగా ఈ భాషను సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్ మరియు కువైట్ తదితర దేశాల్లో ఎక్కువగా వినియోగిస్తారు.



అల్లూరి సీతారామరాజు బయోపిక్

రిసాలి ఫిల్మ్ అకాడమీ అండ్ స్టూడియో బ్యానర్ పై... డా. శ్రీనివాస్ నిర్మాతగా.... సొంత ఊరు, గంగపుత్రులు, గల్ఫ్ వంటి సామాజిక చిత్రాలను.... రొమాంటిక్ క్రైమ్ కథ, క్రిమినల్ ప్రేమ కథ వంటి యూత్ ఫుల్ చిత్రాలను తెరకెక్కించిన పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో... అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర ఆధారంగా 'సీతారామరాజు' ఏ ట్రూ వారియర్ చిత్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మన్యంలో జరుగుతున్న తెల్లదొరల ఆకృత్యాలకు నిరసనగా విప్లవ బావుటా ఎగరవేసిన పాతికేళ్ల కుర్రాడి పోరాట గాథను ఉత్తమ సాంకేతిక విలువలతో తెరకెక్కించనున్నారు. మార్చిలో ప్రారంభించి, ఆగస్టులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి సహనిర్మాతలు యెక్కలి రవీంద్రబాబు, డా.ఎల్.ఎన్.రావు... ఎగ్జిక్యూటివ్ నిర్మాత బాపిరాజు. దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.... అప్పటి చరిత్రతో ఇప్పటి యువతకి స్ఫూర్తి నింపేలా అల్లూరి సీతారామరాజు త్యాగం ఆయన కీర్తిని మరింత ఇనుమడింపజేసే దిశగా 'సీతారామరాజు' ఏ ట్రూ వారియర్ చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ లోనే తొలిసారిగా పూర్తి పోస్ట్ ప్రొడక్షన్ వసతులతో స్టూడియో ఏర్పాటు చేసిన రిసాలి ఫిల్మ్ స్టూడియో అండ్ అకాడమీ బ్యానర్ పై ఈ చిత్ర నిర్మాణం జరుగుతుంది. విశాఖ, కాకినాడ, రాజమండ్రి, ఏజెన్సీ ల పరిసర ప్రాంతాల్లో సింహ భాగం షూటింగ్ జరుపుకునే ఈ చిత్రానికి సీనియర్ సాంకేతిక నిపుణుల బృందం పనిచేస్తుంది. నూతన నటీనటులతో పాటు సీనియర్ నటీనటులు కూడా ఇందులో నటిస్తారు.



మజిలీ.. విరామం

సమంత కథానాయికగా ప్రస్తుతం మజిలీ ఆన్ సెట్స్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో పాటు సమంత మిస్ గ్రానీ అనే కొరియన్ సినిమా రీమేక్ లో 60 ఏళ్ల భామగా నటించనున్నారు. కెరీర్ పరంగా క్షణం తీరిక లేని సామ్ ఇటీవల ఓ ఫ్యామిలీ సెలబ్రేషన్‌లో ఇలా కనిపించారు. ట్రెండీ లుక్ తో యువతరంలో స్ఫూర్తి నింపడం తన ప్రత్యేకత అని అర్థమవుతోంది కదూ?



వెంకీమామలో రానా

విక్టరీ వెంకటేష్, నాగ చైతన్య కలిసి నటించనున్న మల్టీ స్టారర్ 'వెంకీమామ' ఫిబ్రవరి 21నుండి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇక ఈచిత్రంలో రానా దగ్గుబాటి అతిథి పాత్రలో నటించనున్నాడని ప్రచారం జరుగుతుంది. అందుకోసం సినిమాలో రానా కు ఒక చిన్న పాత్రను కూడా సృష్టించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే రానా బాబాయ్ తో నటించాలని ఉందని చాలా సార్లు వెల్లడించిన విషయం తెలిసిందే. మరి రానా కోరిక ఈ చిత్రంతో నెరవేరుతుందో లేదో చూడాలి.

'జై లవ కుశ' ఫేమ్ బాబీ తెరకెక్కించనున్న ఈ చిత్రంలో వెంకీ కి జోడీగా శ్రీయ అలాగే చైతు సరసన రకుల్ ప్రీత్ సింగ్ నటించనున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్, సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మించనున్న ఈచిత్రం దసరా సీజన్ లో విడుదలకానుంది. ఇక ఇటీవల ఎఫ్ 2 అనే మల్టీ స్టారర్ తో సాలిడ్ హిట్ కొట్టి స్ట్రాంగ్ కం బ్యాక్ ఇచ్చిన వెంకీ ఈ వెంకీమామ తో కూడా అదే హిట్ కొడతారో లేదో చూడాలి.

'శివాజీ' తర్వాత వెరైటీ రోల్ చేశాను! – సుమన్

'శివాజీ– ది బాస్' చిత్రంలో సుమన్ విలనీ గురించి చెప్పాల్సిన పనేలేదు. ఆ తర్వాత మళ్లీ తనకు పేరు తెచ్చే ఓ వెరైటీ రోల్ చేశానని అంటున్నారు సుమన్. ఆల్ వెరైటీ మూవీ మేకర్స్ (ఏవీఎం) బ్యానర్ టైటిల్‌కి తగ్గట్టే వెరైటీ చిత్రం తీశారు. వెరైటీ కంటెంట్ తో సినిమా తీసి ఈ సీజన్ లో హిట్ కొట్టేందుకు వస్తున్నారు అని అన్నారు సీనియర్ హీరో సుమన్. ఆయన ఓ కీలక పాత్ర పోషించిన 'బిచ్చగాడా మజాకా' (బ్రేకప్ లవ్‌స్టోరి) ఫిబ్రవరి 1న రిలీజవుతోంది. అర్జున్ యజత్, నేహా దేశ్‌పాండే నాయకానాయికలుగా నటించారు. కె.ఎస్.నాగేశ్వరరావు దర్శకుడు. ఎస్.ఎ.రెహమాన్ సమర్పణలో బి. చంద్రశేఖర్ నిర్మించారు. శ్రీవెంకట్ సంగీతం అందించారు. రిలీజ్ సందర్భంగా కీలకపాత్రధారి సుమన్ ఇంటర్వ్యూ ఇది...

ఈ సినిమాలో మీ రోల్ ఏంటి?

ఈ బ్యానర్ పేరు వెరైటీ. అందుకు తగ్గ చిత్రమిది. దర్శకుడు కె.ఎస్.నాగేశ్వరరరావు.. మేం పాత బ్యాచ్ .. చాలాకాలంగా కలవలేదు. ఆయనే ఫోన్ చేసి ఈ సినిమాలో మీరు నటిస్తే బావుంటుందని అన్నారు. దర్శకుడు తొలిసారి సినిమా చేసినా పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం ఉన్నవాడు. ఆయన కథ చెప్పడం మొదలు పెట్టాక నా పాత్ర వినగానే విభిన్నంగా ఉందని అనిపించింది. రెగ్యులర్ హీరోయిన్ ఫాదర్ తరహా పాత్ర కాదు ఇది. పూర్తి కథ విన్నాను. ఇది రొటీన్ ప్రేమ కథా చిత్రం కానే కాదు. దీంట్లో కామెడీ, ట్రాజెడీ, నెగెటివ్, పాజిటివ్ అన్నీ కలిసి ఉన్న పాత్ర నాది. చాలా ప్రాక్టికాలిటీ ఉన్న రోల్. నెగెటివిటీకి కారణం.. పాజిటివిటీకి లాజిక్ ఉన్న పాత్ర నాది. ఈ కారణాలన్నీ నాకు నచ్చాయి. పతాక సన్నివేశాల వరకూ టెన్షన్ ఉండేలా తెరకెక్కించారు. విభిన్నమైన పాత్రలో నటనకు ఆస్కారం ఉంటుంది. అలాగే దర్శకుడు వినిపించిన స్క్రీన్ ప్లే ఆకట్టుకుంది. సీన్ టు సీన్ తీసేప్పుడు కంటిన్యుటీతో పాటు కంటెంట్ మిస్సవ్వకుండా తీశారు.

దర్శకుడి గురించి?

దర్శకుడు అనుభవజ్ఞుడు. రియల్ స్టార్ శ్రీహరితో మంచి సినిమాలు తీశారు. ఆయన అనుభవానికి అడుసుమిల్లి విజయ్ వంటి ఛాయాగ్రాహకుడు తోడవ్వడం ప్లస్ అయ్యింది. పరిమిత బడ్జెట్ చిత్రాలను వేగంగా పూర్తి చేయడం ఇంపార్టెంట్. కొన్ని ఇబ్బ ందులు ఎదురైనా ఒక మంచి సినిమాని తీయగలిగారు. ఇందులో నా పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని చెప్పగలను.

హీరో కొత్త కుర్రాడు కదా.. బాగా నటించాడా?

ఈ సినిమా హీరో అర్జున్ రెడ్డి కొత్త కుర్రాడే అయినా తాను ఎంతో బాగా చేశాడు. హీరో అంటే రొమాన్స్ , లవ్ అనే ట్రాక్ పక్కన పెడితే పెర్ఫామెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలో నటించాడు. పాటలు, ఫైట్స్ లో నూ చక్కగా చేశాడు. కొత్త హీరోలు కొన్ని సీన్ల విషయంలో ఇబ్బ ంది పడతారు. కానీ తను చాలా బాగా చేశాడు. కథానాయిక నేహా దేశ్ పాండే ఎమోషనల్ సీన్స్ లో చాలా బాగా నటించింది. తండ్రి కుమార్తెల మధ్య ఎమోషనల్ సీన్స్.. లవర్ కోసం తపించే సీన్స్ బాగా చేసింది.

ఇతర పాత్రధారులపై మీ వ్యూ?

ఈ సినిమాలో బాలాజీ చాలా చక్కని పాత్రలో నటించాడు. మంచి ఆర్టిస్టు ఆయన. ఈ సినిమా తనకు ఎంతో విభిన్నమైనది. నేనే ఆ పాత్ర చేసి ఉంటే బావుండేది అన్న ఫీలింగ్ కలిగింది. నా పాత్ర బావున్నా.. అంతకంటే మంచి పాత్ర తనది. సినిమాకి ఆయన మంచి అస్సెట్ అవుతాడు. అలాగే బాబూ మోహన్ పెర్ఫెక్ట్ ఆర్టిస్ట్. చాలా బాగా చేశారు. ఈ సినిమాలో పాత్ర ఆయనకు కరెక్ట్. సినిమా చూసి బయటకు వచ్చేప్పటికి ఆర్టిస్టులు గుర్తుంటారు.

కథలో నచ్చిన పాయింట్?

అమ్మాయి అబ్బాయి ప్రేమకథ రొటీన్ అయినా.. ఇందులో ఓ సందేశం ఆకట్టుకుంటుంది. కష్టపడి పని చేయడం ఎందుకు? షార్ట్ కట్ లో డబ్బు వచ్చేస్తే ఎంజాయ్ చేసేద్దాం అనే ఆలోచన ఉన్న యువతరానికి సంబంధించిన కథను చ ఊపించారు. కష్టపడి సంపాదించ కుండా జనాల్ని మోసం చేస్తూ డబ్బు సంపాదించి హోదాను అనుభవించే తత్వ ం సరికాదని అంతర్లీనంగా మంచి పాయింట్ ని చెబుతున్నారు. కామెడీ, సెంటిమెంట్, ఎమోషన్, లవ్ తో పాటు మంచి సందేశం ఆకట్టుకుంటుంది. ఆడా మగా అనే తేడా లేకుండా అందరూ చూడాల్సిన చిత్రమిది. నిరుద్యోగులు చూడాల్సిన చిత్రమిది. అసభ్యత అన్నదే లేని కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. ద్వంద్వార్థ సంభాషణలు లేని చిత్రమిది.



నిర్మాతే రచయిత కదా.. ఫ్రీడమ్ ఇచ్చారా?

నిర్మాతల సహకారం ఎంతో గొప్పది. దర్శకనిర్మాతలు ఓ మంచి పాత్ర ఇచ్చినందుకు చాలా థాంక్స్. సుమన్ ఓ వెరైటీ పాత్ర చేశాడు అన్న పేరొస్తుంది.

శివాజీ–ది బాస్ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రలో చేశారు.. అది అభిమానులు మర్చిపోరు కదా?

శివాజీ సినిమా వేరు.. ఈ సినిమా వేరు. ఆ గ్రాండియారిటీతో పోల్చకుండా చూస్తే 'బిచ్చగాడా మజాకా' సినిమా విభిన్నమైనది. సుమన్ ఓ వెరైటీ పాత్ర చేయగలడు అని ఈ సినిమాతో పేరొస్తుంది. శివాజీ చూసినప్పుడు సుమన్ విలన్ ఏంటి? అన్నమయ్య చేసినప్పుడు సుమన్ వెంకటేశ్వర స్వామి ఏంటి? అన్నారు. ఆ తర్వాత వాళ్లే పొగిడారు. ఒక స్థాయికి వచ్చాక మాకు ట్యాలెంట్ నిరూపించుకునేలా మంచి పాత్రల్ని ఇవ్వాలి. దర్శకనిర్మాతలను ఇదే అడుగుతాను. మంచి విలన్ పాత్రలు ఇవ్వ ండి. చేయను అని అనను. దర్శకరచయితలకు ఇదే చెబుతున్నా. సుమన్ చేయడు అని చెప్పను. విలన్ కి ఎంత పవర్ ఇస్తారు అన్నది ముఖ్యం.

ఈ జనరేషన్ దర్శకులు విలనీని అంత బాగా చూపించలేదని అసంతృప్తి ఉందా?

రాజమౌళిని చూడండి. ఆయన ఈ జనరేషన్ డైరెక్టర్. విలన్‌కి ఎంతటి పవర్ ని ఇస్తున్నారో. నేటి జనరేషన్ లో రాజమౌళి మాత్రం విలన్ ని ఎంతో గొప్పగా చూపిస్తున్నారు. పరిశ్రమ ఏదైనా విలనీ ఉన్న సినిమాలే గెలుస్తున్నాయి. తమిళం, మలయాళం సహా అన్ని పరిశ్రమల్లో ఇది ఉంది. బాహుబలి లో ప్రభాస్ కాదు రానా హీరో. చివరిలో రానా ఫైర్ లో పడిపోతాడు కానీ, ప్రభాస్ ఎక్కడా తనని తోసేయడు. తనే బ్యాలెన్స్ తప్పి పడిపోతాడు. చచ్చే వరకూ అతడు పవర్ ఫుల్. ప్రభాస్ ఎక్కడా టచ్ చేయడు. అంటే విలన్ చచ్చే వరకూ ఫవర్ ఫుల్ అని చూపించారు. అది రాజమౌళి వల్లనే సాధ్య ం. విలన్ ని అల చూపాలంటే గట్స్ కావాలి. హీరోలు పది మంది 20 మందిని కొట్టేయడం, క్లైమాక్స్‌లో 40 మందిని కొట్టేయడం ఇదేమీ గొప్ప కాదు. ఇక శివాజీ సినిమాలో విలన్ ఎంత పవర్ ఫుల్ గా కనిపించారో చూశాం. శంకర్ అంత గొప్పగా చేశారు. రాజమౌళి ఇప్పటికే నిరూపించారు. గొప్ప విలన్ ని చూపించారు. ఒక సినిమా కాదు ఎన్నో సినిమాలతో దీనిని నిరూపించారు. ఈగ సినిమాలో సైతం డిఫరెంట్ విలనిజం క్రియేట్ చేశారు. ఆ విలన్ ఈగతో ఫైట్ చేయడం అన్నది క్రియేట్ చేశారు. విలన్ కి కథలో ఎవరు ప్రాముఖ్యత నిస్తారో ఆ సినిమానే హిట్టవుతుంది.

రాగానే 20 మందిని కొట్టేయడం గాల్లో ఎగిరేయడం ఇవన్నీ చూపిస్తున్నారు. ఇంటెలెక్చువల్ గా ఎలా కొట్టాలి? అన్నది రాజమౌళి చూపించారు. విలన్ గా అలాంటి పవర్ ఫుల్ పాత్రలు ఇస్తే నేను చేస్తాను. రొటీన్ గా రేప్ లు చేయడం, బ్యాంక్ దోచేయడం వంటి విలనీని రాజమౌళి చూపించరు. పాత డబ్బా నుంచి బయటికి వచ్చి కొత్తగా చేయాలి.

నిర్మాత సహకారం, నిర్మాణ విలువలు ఎలా ఉన్నాయి?

కథ ఇదీ అని దర్శకనిర్మాతలు చెప్పారు. చెప్పిన ప్రకారం తీశారు. అవసరం మేర కాస్టింగ్ తో సినిమాని చేశారు. కొత్త దర్శకుడిని నమ్మి నిర్మాత అవకాశం ఇచ్చారు. మంచి కథలతో ఇలాంటి నిర్మాతలు మరింతమంది రావాలి. డబ్బు ఒక్కటే కాదు. సినీపరిశ్రమ ఒక గ్యాంబుల్ లాంటిది. క్రికెట్ బెట్టింగ్ తరహానే. అయితే కంటెంట్ తో కొట్టాలి. ఇతర భాషల్ని పరిశీలిస్తే అది అర్థమవుతుంది. హిందీ పరిశ్రమ గొప్పగా ఉంటుంది. కథ బావుంటే కొత్త కుర్రాళ్లు అయినా చూస్తారు. ఆర్.ఎక్స్ 100, అర్జున్ రెడ్డి వంటి చిత్రాల విజయాలు సాధించాయి.



అభిమాని చివరి కోరిక

ఆటపాటలతో.. చదువుసంధ్యలతో గొప్పగా ఎదగాల్సిన ఓ చిన్నారి మృత్యువుతో పోరాడుతోంది. అరుదైన లివర్ క్షయ వ్యాధి కబలిస్తోంది. ఈ వ్యాధి నయం అవ్వాలంటే రూ.30లక్షలు ఖర్చవుతుందని ముంబై కెమ్ (కె.ఇ.ఎం) ఆస్పత్రి డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు డీలా పడిపోయారు. ఇక తమ కుమార్తె బతకడం కష్టమేనన్న భయంతోనే బతుకు ఈడుస్తున్నారు. అయినా తన తండ్రి డ్రైవర్ షేక్ సలీమ్ హుస్సేన్ చేయని ప్రయత్నమే లేదు. కూతురిని బతికించుకునేందుకు నిధిని సేకరిస్తున్నాడు. ప్రఖ్యాత కెట్టో వెబ్ సైట్ ద్వారా ఆపన్నహస్తం కోసం ప్రయత్నిస్తే ఇప్పటికి రూ.30 వేల వరకూ కలెక్టయ్యింది. అయితే రూ.30లక్షల మేర సాయం రావాలంటే అది అంత సులువేం కాదు.

ఆ క్రమంలోనే ప్రాణంపై ఆశ వదులుకున్నారు. సదరు చిన్నారి సమ్మయ షేక్ తన ఫేవరెట్ స్టార్ శ్రద్ధా కపూర్ ని కలుసుకోవడమే తన చివరి కోరిక అని చెప్పింది. ఈ సంగతిని జనవరి 25న సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేశారు. ఆ సంగతి తెలుసుకున్న శ్రద్ధ తన అభిమానిని కలిసేందుకు కెమ్ కార్పొరేట్ ఆస్పత్రికి వెళుతున్నారు. ప్రస్తుతం ఆ తండ్రి తనకు ఉన్నదంతా ఊడ్చిపెట్టి వైద్యం చేయిస్తున్నాడు. సాహో బ్యూటీ శ్రద్ధా తనవంతు సాయం అందిస్తుందనే అందరూ ఆశిస్తున్నారు. అభిమానిని కలిసేందుకు శ్రద్ధ ఇప్పటికే తన అనుయాయులకు చెప్పారట. 13 ఏళ్ల చిన్నారి బతుకు చిద్రం కాకుండా శ్రద్ధ తనవంతు ఏం సాయం చేస్తుందో. శ్రద్ధ కపూర్ ప్రస్తుతం సాహో చిత్రంలో నాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే.



4 లెటర్స్ వెనక అసలు కథ ఇదీ

ఎన్నారై ఈశ్వర్‌ని కథానాయకుడిగా పరిచయం చేస్తూ, శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన సినిమా 4 లెటర్స్. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే... అనేది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లుగా నటించారు. ఆర్. రఘురాజ్ దర్శకత్వం వహించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

ఈ సినిమా ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాత జెమిని కిరణ్ ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ సంస్థ లోగోను విడుదల చేశారు. దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమా న్యూ ట్రైలర్ విడుదల చేశారు. నిర్మాత అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి ఆడియో బిగ్ సీడీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు భీమ్స్, సీనియర్ నటుడు సురేష్, కొరియోగ్రాఫర్ గణేష్, నిర్మాత బెక్కం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు ఆర్ రఘురాజ్ మాట్లాడుతూ ..సినిమాలకు చాలా అద్భుతాలు జరిగాయి. ఫస్ట్... సినిమా షూటింగ్ 75 రోజుల్లో పూర్తి చేశాం. దీనికి మా టీమ్ కారణం. మంచి మెసేజ్‌తో తీసిన సినిమా ఇది. ఒక రోజు ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తుంటే... 'సైన్స్ ఈజ్ అబౌట్ థింకింగ్. ఇంజనీరింగ్ అబౌట్ డూయింగ్. బట్, ఆల్ ఇంజనీయర్స్ ఆర్ డయింగ్' అని ఒక బోర్డ్ చూశా. మా డ్రైవర్‌ని అడిగితే... అతనూ బీటెక్ స్టూడెంట్ అని తెలిసింది. అప్పుడు వచ్చిన ఆలోచనతో ఈ సినిమా తీశా. ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కి ఈ సినిమా అంకితం ఇస్తున్నాం. సినిమా సెకండాఫ్‌లో డిఫరెంట్ పాయింట్ టచ్ చేశాం. 'లవ్ ఎట్ సెవన్ లుక్' కాన్సెప్టుతో చేశా. నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. నేను అడిగిన ఆర్టిస్టులు ఇచ్చారు. ప్రేక్షకులకు సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నా.. అన్నారు.

నిర్మాత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ–"నేను అమెరికాలో, న్యూయార్క్ సిటీలో సెటిలైన తెలుగు ఫ్యామిలీ మాది. 21 ఏళ్ళుగా అక్కడే ఉంటున్నా. అక్కడ జరిగే ప్రతి కార్యక్రమంలో మేము పాల్గొంటాము. మా ఇంట్లో తెలుగు వాతావరణం కనిపిస్తుంది. మా అమ్మాయి భరతనాట్యం కళాకారిణి. మా అబ్బాయిని డాక్టర్ చేయాలనుకున్నాం. తను యాక్టర్ అవుతానని చెప్పడంతో సత్యానంద్‌గారి దగ్గరకి పంపాను. సినిమాలపై ప్రేమతో '4 లెటర్స్' తీశాం. ఇంజనీరింగ్ నేపథ్యంలో తీసిన ఈ సినిమాను ఫిబ్రవరి 8న విడుదల చేయాలనుకుంటున్నాం. ట్రైలర్స్, సాంగ్స్ చూసి అందరూ మా అబ్బాయి బాగా చేశాడని అంటుంటే సంతోషంగా ఉంది. ఈ సంస్థలో మరిన్ని సినిమాలు, కొత్తవారితో సినిమాలు తీయాలనుకుం టున్నా" అన్నారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ నేను అమెరికాలో చదువున్నా. అయితే సినిమాలు అంటే ఎప్పటి నుంచో ఇష్టం. దర్శకుడితో మాట్లాడి సెట్స్ కెళ్లే ముందే రెండు నెలల ముందు వర్క్ షాప్ చేశాం. మా దర్శకుడు నాకు బాడీ లాగ్వేంజ్, వర్క్ డిసిప్లేన్ అన్నీ నేర్పించారు. నేను సత్యానంద్‌గారి నటనలో శిక్షణ తీసుకున్నా. ఫ్యామిలీలో అందరికీ ఇంట్రెస్ట్ ఉండటంతో, ఈ ఫీల్డ్‌లోకి ఎంటర్ కావాలని ఈ సినిమా నిర్మించడానికి అమ్మానాన్న అంగీకరించారు" అన్నారు.

మా అధ్యక్షుడు శివాజీరాజా మాట్లాడుతూ– "సినిమా మీద ప్రేమ ఉండాలి గానీ.. న్యూయార్క్‌లో ఉన్నా, అంటార్కిటికాలో ఉన్నా ఆ ప్రేమ ఎక్కడికీ పోదు. ప్రతి ఒక్కరూ సినిమా మీద ప్రేమతో పరిశ్రమకు వస్తారు. ఏ రంగంలో అయినా ప్రేమ పక్కకు వెళ్తుందేమో కానీ... సినిమాలోని 24 శాఖలపై ప్రేమకు వెళ్ళదు. ఆ ప్రేమతో నిర్మాతలు న్యూయార్క్ నుంచి వచ్చి ఈ సినిమా చేశారు. అందరికీ పేరు రావాలి అన్నారు.

అనసూయ కథనం



ది మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్, ది గాయత్రి ఫిలమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కథనం. బి.నరేంద్రరెడ్డి, శర్మచుక్కా ఈ చిత్రానికి నిర్మాతలు. రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనసూయ భరద్వాజ్ మెయిన్ లీడ్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం రెండు సాంగ్స్ మినహా టాకీ పార్ట్ మొత్తం పూర్తిచేసుకుని వేసవిలో విడుదలకు సిద్ధంగా ఉంది. అనసూయ మాట్లాడుతూ... కథనం సినిమా పేరు. కథనం అంటే కథని నడిపే విధానం.. మా ఫస్ట్ లుక్ విడుదలైన తర్వాత చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. నేను క్షణంలో కనిపించిన పాత్రలో ఉన్నట్లు ఉందని అందరూ అనుకుంటున్నారు. కాని కాదు నాది ఈ చిత్రంలో ఎడి క్యారెక్టర్ ఒక అసోసియేట్ డైరెక్టర్ పాత్ర. శర్మ మంగళ చిత్రం చేశారు. అలాగే నరేంద్ర చాలా పెద్ద డిస్ట్రిబ్యూటర్. నన్ను మెయిన్ లీడ్‌గా చూపిస్తున్నారు. చాలా మంచి చిత్రం వస్తోంది. పెళ్లి పృధ్వీగారు చాలా బాగా చేశారు. ఈ రోజుతో టాకీ పూర్తవుతుంది. 4షెడ్యూల్స్‌లో పూర్తయింది. వేసవిలో రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు" అన్నారు.

ధనరాజ్ మాట్లాడుతూ.. భాగమతి తర్వాత మళ్ళీ చాలా గ్యాప్ వచ్చింది నాకు. ఓ మంచి సినిమాతో అందరితో కలవాలనుకున్నా. పిల్లజమిందార్, భీమిలీకబాడీ జట్టు, రాజేష్ కథ విన్నాను. నాకు చాలా బాగా నచ్చింది. కొత్త పంథా క్రైమ్ థ్రిల్లర్ ఇది.. అన్నారు. ధృవ తర్వాత చక్కని పాత్రలో నటించానని రణధీర్ తెలిపారు.

నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ... చిరంజీవిగారి అభిమానిని నేను. డిస్ట్రిబ్యూటర్‌గా అన్నగారి సినిమాతో స్టార్ట్ అయ్యాను. పార్ట్ టైం నిర్మాతగా మంగళ చిత్రం చేశాను. ఈ చిత్రంతో పూర్తి నిర్మాతనయ్యా. రంగస్థలం నెల్లూరు కు పంపిణీ చేశాను. ఆయన ఏ సినిమా చేస్తే అది సూపర్ హిట్. ఇందులో ఫుల్ లెంగ్త్ కనపడుతున్నారు. ఇది డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుందని నాకు నమ్మకం ఉంది. ఈ సినిమాలో ధనరాజ్ ఒక ఆర్టిస్టుగా కాకుండా తన సినిమాలాగా ఫీలయి చాలా సాయం చేశారు. దర్శకుడు రాబోయే రోజుల్లో నెం.1 డైరెక్టర్ అవుతారని నమ్మకం ఉంది.. అన్నారు. ఇదే తొలి చిత్రమని రాజేష నాదెండ్ల అన్నారు. అనసూయ, ధన్ రాజ్, రణధీర్ పాత్రలు ఆకట్టుకుంటాయని తెలిపారు. అవసరాల శ్రీనివాస్, రణధీర్, ధనరాజ్, వెన్నెలకిషోర్, పెళ్లి పృధ్వీ, సమీర్, ముఖ్తార్‌ఖాన్, రామరాజు, జ్యోతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ః ఎస్.బి. ఉద్ధవ్, మ్యూజిక్ః సునీల్ కశ్యప్, ఆర్ట్ డైరెక్టర్ః కె.వి.రమణ, కెమెరాః సతీష్ ముత్యాల, సమర్పణ ః ఎమ్.విజయ చౌదరి, నిర్మాతలుః బి.నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా, కథ,కథనం,దర్శకత్వంఃరాజేష్ నాదెండ్ల,



'మళ్లీ మళ్లీ చూశా' సాంగ్ లాంచ్

అనురాగ్ కొణిదెన హీరోగా పరిచయమవుతొన్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. క్రిషి క్రియేషన్స్ పతాకంపై సాయిదేవ రామన్ దర్శకత్వంలో కొణిదెన కోటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరొయిన్ లుగా నటిస్తున్నారు.శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం లొని 'చినుకే నాకె చూపె' అనే పాట ను ఆదిత్య మ్యూజిక్ ద్వారా సెన్సేషనల్ డైరక్టర్ వినాయక్ విడుదల చేశారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ.. 'మళ్లీ మళ్లీ చూశా' పాట వినసొంపుగా ఉంది. ట్రైలర్ సైతం అందంగా అందరికీ చెరువయ్యేలా ఉంది. హీరో అనురాగ్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు. దర్శకుడు సాయిదేవ రామన్ .. ప్రేమకు ప్రకృతి తోడైతే ఎంతో అందంగా ఉంటుందన్న కాన్సెప్ట్ తొ తీసిన సినిమా 'మళ్ళీ మళ్ళీ చూశా' . శ్రవణ్ సంగీతం, సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ ఎసెట్స్ గా నిలుస్తాయి. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.



ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సకలకళావల్లభుడు'

బీరం సుదాకరెడ్డి సమర్పణలో సింహా ఫిలిమ్స్, మరియు దీపాల ఆర్ట్స సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. తనిష్క్ రెడ్డి,మేఘ్లా ముక్తా హీరోహీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి శివగణేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 1 న విడుదల కానున్న సందర్బంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే చిత్రనిర్మాతలు అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ యాక్షన్,కామెడీ లతో పాటు ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా ఫిబ్రవరి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి హీరో పెర్ఫార్మన్స్,కథ,కథనాలు హైలెట్‌గా నిలవనున్నాయు. సినిమాలో నటించిన ఏ ఒక్కరూ కొత్త వారిలా అనిపించరు. అంత అద్భుతంగా పెర్ఫామెన్స్ ను ఇచ్చారు. ఇక హీరో తనిష్క్ రెడ్డి అయితే ఆయనలో ఉన్న ప్రతి టాలెంట్ ను టైటిల్ కు తగ్గట్టు బెస్ట్ పెర్ఫామెన్స్ ను ఇచ్చారు. ఫ్యూచర్ లో బిగ్ స్టార్ అవుతాడు. అతనితో మరిన్ని సినిమాలు చేయలనుకుంటున్నాము. మా సకల కళా వల్లభుడి సినిమాకు బి సి, నైజాం, సీడెడ్ లలో మంచి రెస్పాన్స్ వస్తోంది. అన్నారు.

నగల్ని శుభ్రంచేయండిలా..



విలువైన బంగారు, వెండి ఆభరణాలను మెత్తటి బట్ట, రసాయనాలు లేని సబ్బుతో శుభ్రప రచాలి. కొందరు బంగారం, వెండి, ప్లాటినం ఆభరణాల్ని అన్నింటినీ ఒకే పెట్టెలో ఉంచుతారు. ఇలా చేస్తే ఒక్కోటి ఒక్కో రకం లోహం కావటం వల్ల వాటి మెరుపు తగ్గిపోతుంది. రంగులు, కెమికల్స్, పెర్ఫ్యూమ్స్, సెంట్స్ దగ్గరగా నగలను ఉంచరాదు. నీళ్లలోకి వెళ్తుంటే బంగారం గొలుసు, ఉంగరాల్ని తీసేయాలి. నీటిలో ఆభరణాల్ని ఎక్కువగా తడిపితే మెరుపు త్వరగా తగ్గుతుంది. వెండితో చేసిన ఆభరణాలను వాషింగ్ పౌడర్ శుభ్రపరచాలి. లేదా గోరువెచ్చని నీళ్లలో వంట సోడా కలిపి కడిగేయాలి. శుభ్రపరచటానికి మెత్తటి టూత్ బ్రష్ వాడాలి.

బంధాల్లో తగ్గుతున్న అనుబంధాలు



ఎన్నో ఏళ్ళుగా మానవుడు విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతి సాధించి, ఆ ప్రతిఫలాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఈ ప్రపంచంలో ప్రతీదీ ఒక వెలకి అమ్ముడుపోయేదే... పురోగతి అంతే... దాని వెల... మన విలువైన సమయం, డబ్బు బంధాలని లెక్కచేయలేనంత... ఈ ప్రపంచంలో మనుషులువిజయంపై కాంక్ష తో, సానుకూల ధృక్పథంతో దూసుకుపోతున్నారు.


ప్రస్తుత కాలంలో ఎంతటి కష్ట సాధ్యమైన పనినైనా, నేర్పుతో, ఓర్పుతో సాధిస్తున్నారు. కానీ సాధించిన దాన్ని అనుభవించలేనంత, ఒత్తిడికి గురౌతున్నారు. మారుతున్న కాలం, జీవన విధానం, ప్రపంచీకరణ వ్యవస్థ, ఇవన్నీ ఒక సందర్భంలో మనం చూసే తీరుని, మన ఆలోచనా విధానాన్ని, మన వ్యక్తిత్వాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయన్నది, ఒప్పుకుని తీరవలసిన సత్యం. ఆధునీకరణ అనేది, ఒక జాడ్యంలా, మన నరనరాన జీర్ణించుకుపోతోంది... దానితో, మన వ్యక్తిగత స్వేచ్ఛ, మన ఇష్టా ఇష్టాల పరిధి మించుతోంది... నేడు మనిషి జీవితంలో, అత్యంత డోలాయమాన స్థితిలో ఉన్నాడు. తన సౌకర్యం, తన వ్యక్తిగత స్వేచ్ఛ, కలివిడితనం మధ్య సమతూకం పాటించలేకపోతున్నాడు.

ఈ ఆధునిక జీవన విధానంలో, ప్రతీ ఒక్కరం మన కోరికలు తీర్చుకోవడంలో మునిగి ఉన్నాం... మనకి డబ్బుంది, కానీ, బంధాలు బలపరచడానికి మనల్ని ఇష్టపడే వారితో గడపడానికి సమయం లేదు. చేయాల్సిన పనికి, కేటాయించిన సమయం సరిపోక, పని, కుటుంబం, మధ్య సమతుల్యం లోపించి, బంధాలు బీటలువారుతున్నాయి.

బాగా దగ్గరి వారైన, అన్నయ్య, బాబాయ్, మేనత్త... ఒక్కరేంటి ? అందరితో అదే ముక్తసరి మాట, ప్లాస్టిక్ నవ్వు. పరిస్థితి ఎలా తయారయిందంటే, తరతరాలుగా, వేళ్ళూనుకున్న, మన సంస్కృతి, మన ఆచారం, మన ఆప్యాయతలు, మన అనుబంధాలు అన్నీ సమసి, మన నుంచి, మనమే వేరైపోయి, ఒక కొత్త ప్రపంచంతో స్నేహం నెరపుతున్నాం... కృత్రిమ యంత్రాలతో. ఇక్కడ, అతి పెద్ద సమస్య... అసలైన ఆప్యాయతా ప్రపంచం నుండి విడివడి, కృత్రిమ యంత్రాల్లో, మన భావాలను, అస్సలు సంబంధం లేని, లక్షల మందితో పంచుకోవడం... ఇంట్లో వారికి, కనీసం మాట మాత్రం తెలియకపోవడం. రక్త సంబంధీకులతో అస్సలు మాటలు లేకపోవడం...

ఇదివరకు, మనం ఆతిధ్యానికి, దయాగుణానికి, స్నేహశీలతకి పెట్టింది పేరు. కానీ ఇప్పుడు, అతిథులొస్తే... ఆ ఆప్యాయత నిజంగా కనబరుస్తున్నామా ? అసలు, బంధువులింటికి మనమెళ్తున్నామా ? సమయం దొరికితే, మాల్ కో, ఉద్యానవనానికో, స్నేహితులతో బైటికో, మరీ మాట్లాడితే, అంతర్జాలంలో ఇష్టంగా చిక్కుకుపోతున్నాం... ఇంటికి మన బంధువులు రావడం, వాళ్ళతో కబుర్లు చెప్పుకుని, అందరూ కలిసి వంట చేసుకుని, భోజనం చేయడం... ఇవన్నీ నెమ్మదిగా కనుమరుగౌతున్నాయి. మన కష్టసుఖాలు, జ్ఞాపకాలు, ఆలోచనలు... అన్నీ గోడెక్కుతున్నాయి... ఎంతలా, ముసుగేసుకుంటున్నామంటే, ఎప్పుడో ఒకసారి కనబడే బంధువులైనా, ఎప్పుడు వదులుతారా?

అనేంత... అందుకే, ఎవరైనా ఇంటికొస్తే, ఒక నవ్వు నవ్వి, ఆ తర్వాత అంతరంగిక గదికి వెళ్ళి, కంప్యూటర్ ముందు కూర్చుని ఏదో పని చేస్తుండడమో, ఆడుకోవడమో చేస్తారు. త్వరగా వెళ్ళిపోతే బాగుండునని వంద సార్లు అనుకుంటారు. భోజనం సమయానికొచ్చినా, కాఫీతో సరిపెడతారు. వెళ్ళొస్తామంటే, మాట వరసకి కూడా, ఉండమనడానికి భయపడతారు. ఎక్కడ వంట చేయాల్సి వస్తుందో అని... తప్పకపోతే, కర్రీపాయింట్‌లు ఉండనే ఉన్నాయి. ఇదివరకు, భోజనం వేళకి, ఎవరైనా వస్తున్నారంటే, వారికోసం, వేచి చూసేవారు. వారితో ఆలోచనలైనా, భోజనమైనా పంచుకోవడంలో ఆనందం తెలుసు.



ఇంతలోనే ఎంత తేడా?

బంధాలు, బంధుత్వాలు... మన జీవితానికి కొత్త అర్థాన్నిస్తాయి. ఆ పరిమళం ఎప్పుడూ గుభాళిస్తుంది. మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్, కంపూటర్లు.. మన జీవితాన్ని శాసించడం మొదలు పెట్టినప్పటి నుంచి, మన జీవితంలో మనుషుల మధ్య మాటలు కరవయ్యాయి. పక్కనున్న మనిషి ఏం కావాలనుకుంటున్నాడో మనకి తెలీదు. కానీ ఫేస్‌బుక్‌లోనో, వాట్సాప్‌లోనో నాకు శీతల పానీయం తాగాలనుంది అని చిన్న సందేశం పెట్టగానే, నచ్చిందని, 'అయ్యో పాపం... నేనక్కడుంటే కొనిచ్చేవాణ్ణి' అని రకరకాల కామెంట్స్ వెల్లువలా వస్తాయి.

అసలు ఎటు పయనిస్తున్నాం మనం?

యంత్రాలు పని సులువు చేయడానికే... మనం యంత్రాల్లా మారవడానికి కాదు.



ఏ బంధువులో కాదు, సొంత అక్క చెల్లి, అన్న తమ్ముడు తో ప్రేమగా మాట్లాడే సమయం, మనసు ఉండట్లేదు. అమ్మానాన్నలతో కూడా మొక్కుబడిగా, ప్రొద్దున నాలుగు, సాయంత్రం రెండు మాటలు... వైద్యులు సిఫార్సు చేసినట్టు... మాట్లాడుతున్నారు. ఇక భార్యా భర్తల సంగతి సరే సరి. ఇద్దరూ ఉద్యోగస్థులైతే... ఆ భగవంతుడికే తెలియాలి, వారి సంసార నావ ఏ తీరం చేరుతుందో... పిల్లలు కూడా, మినీ అడలట్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఒక ఉత్సాహం, ఒక కొత్త బంధువుని చూసామన్న ఆనందం ఏ కోశానా ఉండదు. ఓహో, అలాగా... అని ఊరుకుంటారు.

ఈ రోజుల్లో, పండగలకో, పబ్బాలకో, పెళ్ళిళ్ళకో తప్ప, అందరూ కలిసే వీలూ లేదు. తీరికా లేదు. అప్పుడు కూడా, సెల్‌ఫోన్ అనే లోకంలో ఉంటారు. ఎక్కడో ఉన్న పని, వ్యక్తి పైన చూపే శ్రద్ధ, పక్కన ఉన్నవారిపై ఉండదు. ఇంటర్‌నెట్ వ్యవస్థ ప్రపంచాన్ని ఏకం చేస్తున్నాయి. కానీ మన చుట్టూ, ఒక ముళ్ళకంచెని కట్టి, మన వారితో దూరాన్ని చేస్తూ ఐనవారితో ముఖాముఖి మాట్లాడిన ఆనందాన్ని ఆవిరిచేస్తున్నాయి?

జీవితంలో ఎంతో సాధించినా, ఏదో వెలితిగా, దేన్నో కోల్పోతున్నట్టుగా ఎందుకుంటోందో తెలుసా ? మనకి జీవితంలో అన్నీ ఉన్నాయి. ఇల్లు, కారు, సకల సౌకర్యాలు... లేనిది, శాంతి, సంతృప్తి, నిజమైన ఆనందం, మన సంస్కృతి, సాంప్రదాయం, అనుబంధంలోనే ఉన్నది. అది లేకపోతే, ఎంత సంపదున్నా... ఆ వెలితి పూడదు. జీవితాంతం, మన మనసులో అదొక కొరతగా వెంటాడుతూనే ఉంటుంది. ఆధునికత వంకతో మనం, ఒక అసత్యపు, మనది కాని మేలిముసుగులో శ్వాసిస్తున్నాం... ఒక్కసారి, ఆ ముసుగు వీడి, 'మన' ని శ్వాసిస్తే, బ్రతుకు మీద ఆశ మళ్ళీ చిగురిస్తుంది. ఆప్యాయత మొగ్గ తొడుగుతుంది. బంధాలు విరబూస్తాయి...

'మనం' మనలా ఉందాం...

అమ్మ ప్రేమ, కొత్తావకాయ, తొలకరిలోని మట్టి వాసన, పులిహోరలోని తాళింపు, ప్రసాదం కోసం చెయ్యి చాపినప్పుడు, గుడిలోని పూజారి నవ్వుతూ మొట్టే మొట్టికాయ, లేస్తూనే అమ్మ పాడే వేంకటేశ్వర సుప్రభాతం... ఇవి చెబితే చాలా చాదస్తంగా ఉంటాయి. అనుభవిస్తే, మస్తుగా, జీవిత కాలపు జాపకాల పరిమళాల్ని గుభాళింపజేస్తాయి.

ఆహా!

పనీర్ కుల్చా



పనీర్ లేదా కాటేజ్ చీజ్ మన శరీరానికి చాలా మంచిదన్న విషయం తెలుసు కదా.మీరు యవ్వనంలో ఉన్న లేదా వయసు మళ్ళినా వారైనా సరే దీనిలో ఉండే కాల్షియం,ఇతర విటమిన్లు, ఖనిజాలు మీ ఆరోగ్యానికి చాలా మంచివి.పనీర్ పేరు చెప్తేనే మీ పిల్లలు పారిపోతున్నట్లయితే పనీర్ కుల్చాని వారికిష్టమైన పచ్చడి,రైతా లేదా సాస్తో అందించవచ్చు. పనీర్ కుల్చా తయరీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం చూసి మీ ఇంట్లో ప్రయత్నించండి.

కావల్సిన పదార్థములు:

1.మైదా3కప్పులు 2.పంచదార1 టేబుల్ స్పూను 3.బేకింగ్ పౌడర్1 టేబుల్ స్పూను 4.వెన్న5 తేబుల్ స్పూన్లు 5.పాలు1 కప్పు 6.ఉప్పురుచికి తగినంత స్టఫ్ఫింగ్ కోసం: 7.తురిమిన పనీర్200 గ్రాములు 8. పచ్చి మిర్చి4(సన్నగా తరిగాలి) 9.గరం మసాలా పొడి1 టీ స్పూను 10.కొత్తిమీర2 టేబుల్ స్పూన్లు(సన్నగా తరగాలి) 11.కారం2 టీ స్పూన్లు 12.చాట్ మసాలా 2 టీ స్పూన్లు 13.ఉల్లిపాయ1(సన్నగా తరగాలి)

తయారు చేసే విధానం:

1.ఒక గిన్నె తీసుకుని దానిలో మైదా,బేకింగ్ పౌడర్ కలిపి పక్కన పెట్టాలి. 2.ఇంకొక గిన్నెలో పాలు, వెన్న, పంచదార, ఉప్పు వేసి బాగా కలపాలి. 3.ఈ పాల మిశ్రమాన్ని మొదట పక్కన పెట్టుకున్న పిండిలో పోసి మెత్తని చపాతీ పిండి లాగ కలిపి ఒక మస్లిన్ క్లాత్ వేసి ఒక 40 నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. 4.ఇప్పుడు స్టఫ్ఫింగ్ తయారు చేసుకోవాలి.ఒక పెద్ద గిన్నె తీసుకుని దానిలో తురిమిన పనీర్,ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి తరుగు,కొత్తిమీర,ఉప్పు, గరం మసాలా, చాట్ మసాలా, కారం వెయ్యాలి. 5.అన్నింటినీ బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. అంతే,పనీర్ కుల్చాకి స్టఫ్ఫింగ్ తయారు. 6.ఇప్పుడు మస్లిన్క్లాత్ కప్పిన పిండి నుండి కొంచం ముద్ద తీసుకుని గుండ్రంగా వత్తుకోవాలి.మరీ పెద్దదిగా వత్తుకోకూడదు. 7.ఇప్పుడు గుండ్రంగా వత్తిన చపాతీని మీ అరచేతిలో ఉంచుకుని కొంచం స్టఫ్ఫింగ్ తీసి దీనిలో పెట్టి అంచులు మూసెయ్యాలి. 8.ఇప్పుడు పీట మీద కొంచం పిండి చల్లి స్టఫ్ చేసుకున్న ఈ ముద్దని మెల్లిగా చేతులతో తడుతూ గుండ్రంగా వత్తుకోవాలి. ఇలాగే మిగిలిన పిండితో కుల్చాలు తయారు చేసుకోవాలి. 9.ఒక ఓవెన్ ట్రే తీసుకుని దానికి కొంచెం నూనె రాయాలి. ఇలా చేస్తే కుల్చాలు ట్రేకి అతుక్కుపోవు. 10.ఓవెన్ని 200 డిగ్రీల సెల్సియస్లో వేడి చెయ్యాలి. 11.ఇప్పుడు కుల్చాలని ట్రేలో పెట్టి 1015 నిమిషాలు బేక్ చేసుకుంటే పనీర్ కుల్చా రెడీ. బేక్ అయిన కుల్చాలని నాలుగు ముక్కలుగా కోసి మీకిష్టమైన చట్నీతో వడ్డించడమే.

పనీర్ కట్లెట్

మీరు ఎక్కువ కష్టపడకుండా, తేలికగా తయారు చేసుకునే కొన్ని వంటకాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి. అనుకోకుండా అతిధులు వచ్చినపుడు, గొప్ప రక్షకుడిగా కొన్ని సులభంగా వండుకునే వంటకాలు చేయవచ్చు. మీ రేఫ్రిజిరేటర్ లోపల పనీర్ లేదా చీజ్ ఉంటే, మీకు సగం సమస్య తీరినట్టే. మీరు పనీర్ ను ఉపయోగించి కట్లెట్ లను తయారు చేయవచ్చు. ఈ నోరూరించే రుచికరమైన వంటను చాలా తేలికగా తయారుచేయవచ్చు, ఈ వంటకు చాలా తక్కువ పదార్థాలు మాత్రమే అవసరమౌతాయి.



కావలసిన పదార్థాలు:

1.కాటేజ్ చీజ్ (పనీర్) 2 కప్పులు (తరిగినది) 2.ఉడికించిన అన్నం కప్పు (చల్లారినది) 3.రుచికి సరిపడా ఉప్పు 4.పచ్చిమిర్చి 1 టేబుల్ స్పూను (సన్నగా తరిగినవి) 5.మైదా 1 కప్పు 6.కొత్తిమీర 1 టీస్పూను (తరిగినది) 7.క్యాప్సికం 1 కప్పు వివిధ రంగులవి (సన్నగా తరిగినవి) 8.పైన కోటింగ్ కి బ్రెడ్ పొడి 9.నూనె 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం:

1.సన్నగా తరిగిన చీజ్ తీసుకుని అందులో ఉడికించిన అన్నాన్ని కలపండి. 2.ఇప్పుడు, మైదా, ఉప్పు, పచ్చిమిర్చి వేసి బాగా కలపండి. 3.ఇప్పుడు, కొత్తిమీర, తరిగిన క్యాప్సికం వేయండి. మీరు వివిధ రకాల క్యాప్సికం తీసుకున్నట్లయితే, మీ కట్లెట్ లు చాలా అందంగా కనిపిస్తాయి. 4.ఈ పదార్థాలు అన్నిటినీ బాగా కలిపి, చేతితో చిన్నచిన్న ఉండలుగా చేయండి. 5.ఇప్పుడు, తవా వేడిచేసి, నూనె రాయండి. 6.దానిపై కట్లెట్ లను ఉంచి, బంగారు రంగు వచ్చే వరకు కాల్చండి. 7.రెండువైపులా బాగా ఉడికిన తరువాత, పుదీనా పచ్చడి లేదా టొమాటో సాస్ తో వేడిగా వడ్డించండి.

మూంగ్ దాల్ సలాడ్

చలికాలం,వర్షాకాలంలో స్పైసీగా ఏదైనా తినాలనిపిస్తుంది! ఈ సూపర్ కూల్ క్లైమెట్ ను ఎంజాయ్ చేయాలంటే ? రుచికరంగా , హెల్తీగా ఛాట్ రిసిపిని రెడీ చేసుకోవాలి. అలాంటి హెల్తీ ఛాట్ రిసిపి ఫ్రైడ్ మసాలా మూంగ్ దాల్ రిసిపి. ఇది చాలా టేస్ట్ గా ఉంటుంది. దీన్ని ప్రతి రోజూ సాయంత్రం స్నాక్ టైమ్ లో తీసుకోవచ్చు. ఇది స్పెషల్ ఛాట్ రిసిపి, ఎందుకంటే ఇందులో ఎక్కువ న్యూట్రీషియన్స్ మరియు ప్రోటీన్స ఉంటాయి. మన వంటింట్లో ఉండే నిత్యవసర వస్తువు . అద్భుత రుచిని కలిగి ఉంటాయి. తయారుచేయడం చాలా సులభం. తయారుచేయడాని కంటే, ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి . మూంగ్ దాల్ ను రెగ్యులర్ గా తింటుంటే, శరీరంలోని హీట్ తగ్గిపోతుంది . శరీరాన్ని చల్లబరుస్తుంది, చాలాసింపుల్ గా మరియు టేస్టీ రెసిపి..




కావల్సిన పదార్థములు:

ఫ్రైడ్ మూంగ్ దాల్ 200 గ్రామ్స్, మొలకల సెసలు 1/2 కప్పు, ఉల్లిపాయలు 1/2 కప్పు(సన్నగా కట్ చేసుకోవాలి), టమోటో 1/2కప్పు (సన్నగా కట్ చేసుకోవాలి), క్యారెట్ 1/2 కప్పు, చింతపులుసు 1/2 టీస్పూన్, పచ్చిమిర్చి పేస్ట్ 1/2 టీస్పూన్, బెల్లం సిరఫ్ 1/2 టీస్పూన్, కొత్తిమీర గార్నిష్ కోసం, నిమ్మరసం 1/2 టీస్పూన్, ఉప్పు: రుచికి సరిపడా

తయారుచేయు విధానం:

పెద్ద బౌల్ తీసుకుని అందులో కొన్ని ఉల్లిపాయాలు, టమోటో, క్యారెట్ తురుము, పచ్చిమిర్చి పేస్ట్ వేసి మొత్తం మిశ్రమం మిక్స్ చేయాలి. తర్వాత అందులోనే ఫ్రైడ్ మూంగ్ దాల్ వేయాలి. తర్వాత మొలకలు పెసలు వేయాలి. తర్వాత కొద్దిగా చింత పులుసు వేయాలి. అలాగే కొద్దిగా బెల్లం నీళ్ళు చిలకరించాలి. మొత్తం మిశ్రమాన్ని బాగా మిక్స్ చేయాలి తర్వాత అందులోనే ఉప్పు మరియు నిమ్మరసం వేసి మిక్స్ చేయాలి. దీన్ని సర్వింగ్ ప్లేట్ లోకి వేసి గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. అంతే టేస్టీ మసాలా మూంగ్ దాల్ రెడీ..



నువ్వుల నూడుల్స్

నూడుల్స్‌ను మనందరమూ తినాలనుకుంటాము. పైగావీటిని రకరకాలుగా తయారు చేయవచ్చు.హాంకాంగ్ స్టైల్ నూడుల్స్ కారంగా ఉంటే కాంటోనీస్ స్టైల్ నూడుల్స్ కారం లేకుండా లైట్గా ఉంటాయి. మామూలు నూడుల్స్కే కాస్త మార్పులు చేసి రుచికరంగా మార్చే విధనమే నూడుల్స్ తయారీ మీకు ఈరోజు పరిచయం చెయ్యబోతున్నాము.దీనిని ఈవెనింగ్ స్నాక్‌గా తీసుకోవచ్చు పైగా దీని తయారెకై కావాల్సిన పదార్థాలు కూడా సులభంగా దొరికేవే. ఇక తయారీ విధానం, కావాల్సిన పదార్థాలు చూద్దామా. సీసమే సీడ్స్ లేదా నువ్వులు బలవర్ధకమైన ఆహారం. కనుక మీరు వీటిని నూడుల్స్లో కలిపి తీసుకుంటే మీ నాలుకకి రుచికరం మరియూ మీ శరీరానికి కూడా మంచిది.

కావాల్సిన పదార్థాలు:

1.ఉడికించిన నూడుల్స్2.5 కప్పులు 2.సన్నగా తరిగిన వెల్లుల్లి1 టేబుల్ స్పూను 3.తెల్ల నువ్వులు1 టేబుల్ స్పూను 4.సన్నగా తరిగిన అల్లం1 టేబుల్ స్పూను 5.వెనిగర్1 టేబుల్ స్పూను 6.ఉల్లికాడల తరుగు1 టేబుల్ స్పూను 7.డార్క్ సోయా సాస్ 1 టీ స్పూను 8.నువ్వుల నూనె1 టేబుల్ స్పూను 9.ఉప్పురుచికి తగినంత

తయారు చేసే విధానం:

1.నువ్వులని కనీసం రెండు నిమిషాల పాటు సన్నని మంట మీద నూనె లేకుండా వేయించి ఒక గిన్నెలోకి తీసి పెట్టుకోవాలి. 2.ఇప్పుడు అదే మూకుడులో నువ్వుల నూనె వేసి దానిలో అల్లం,వెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. 3.అల్లం, వెల్లుల్లి వేగాకా దానిలో ఉడికించిన నూడుల్స్, సోయా సాస్, వెనిగర్ వెయ్యాలి. 4.ఇప్పుడు బాగా కలిపి పైన వేయించిన నువ్వులు కలపాలి.కాసిని నువ్వులు గార్నిషింగ్ కోసం పక్కన పెట్టుకోవడం మర్చిపోవద్దు సుమా. 5.ఇప్పుడు మళ్ళీ కలిపి కాసేపు స్టవ్ మీదే ఉంచాలి. 6.నూడుల్స్ ఇతర పదార్థాలతో కలిసి బాగా ఉడికాకా నూడుల్స్ని నూడుల్స్ బౌల్లోకి తీసుకోవాలి. 7.వీటిమీద ఉల్లి కాడల తరుగు, గార్నిషింగ్ కోసం పెట్టుకున్న నువ్వులూ చల్లాలి. 8.అంతే మీ సీసమే నూడుల్స్ రెడీ. మీ పిల్లలకి రుచికరమైన కారం లేని నూడుల్స్ కావాలనుకుంటే ఇది మంచి ఎంపిక. దీనికే మీరు కూరగాయల ముక్కలు, చికెన్ చేర్చి మరింత రుచికరంగా మార్చవచ్చు. మరి ఆలశ్యమెందుకు, ప్రయత్నించి చూడండి.



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	395	విజయవాడ	395
ముంబయి	450	ఢిల్లీ	417
చెన్నై	430	బెంగళూరు	425



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115

సెన్సెక్స్ –1.25
35,591



నిఫ్టీ –0.40
10,651

రూపాయి
₹71.11
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
34,190
(ముంబయిలో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో



ఊగిసలాటలతో..స్వల్ప నష్టాలు

ముంబై: లాభ నష్టాల మధ్య తీవ్ర ఊగి సలాటకు గురైన స్టాక్ మార్కెట్లు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ నామ మాత్రంగా 1 పాయింట్ నష్టంతో 35,591 వద్ద, నిఫ్టీ 10,652 వద్ద యథా తథంగా స్థిర పడింది. అయితే ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ లాభాల డబుల్ సెంచరీ చేసి 35,850 వరకూ ఎగసింది. ఒక దశలో 35,490 స్థాయికి క్షీణించింది. రానున్న కేంద్ర బడ్జెట్, గురువారం ఎఫ్అండ్‌వో ముగింపు కారణంగా ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 5.3శాతం , టాటా స్టీల్ షేర్ 5.14శాతం లాభ పడ్డాయి. బజాజ్ ఆటో, కొటక్ మహీంద్రా షేర్లు 2.5శాతానికి పైగా కుంగాయి. దేవాన్ హౌసింగ్ షేర్లు దాదాపు 10శాతం నష్టపోయాయి. గత 35 నెలల్లో ఈషేరు ధర ఈ స్థాయికి రావడం ఇదే తొలిసారి. మెటల్, మీడియా, బ్యాంక్స్ 21 శాతం లాభపడగా, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఫార్మా 10.25 శాతం మధ్య బలహీనపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐసీఐసీఐ, యాక్సిస్ 6 5 శాతం మధ్య జంప్‌చేయగా.. హిందాల్కో, హెచ్‌సీఎల్, జీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, యూపీఎల్, ఎల్అండ్‌టీ 31 శాతం మధ్య లాభ పడ్డాయి. అయితే ఐబీ హౌసింగ్ 5 శాతం పతనమైంది. ఇండియా బుల్స్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఆటో, కొటక్ బ్యాంక్, ఇన్‌ఫ్రాటెల్, ఐవోసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌పీసీఎల్, యస్ బ్యాంక్, టెక్ మహీంద్రా , సన్ ఫార్మ32 శాతం మధ్య నష్టపోయాయి.అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు, ఆసియా ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. దీంతోపాటు అమెరికా–చైనా మధ్య జరుగుతున్న చర్చలు ఫలితాలపై నెలకొన్న ఆందోళన దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మరో పక్క చమురు ధరలు బుధవారం తో పోలిస్తే స్వల్పంగా పెరిగాయి.

పెరగనున్న రిఫ్రిజిరేటర్, టీవీ, వాషింగ్ మిషన్ ధరలు

ఢిల్లీ: ఈసారి బడ్జెట్‌లో ఏసీ, రిఫ్రిజిరేటర్, టీవీ, వాషింగ్ మిషన్ వంటి ఎలక్ట్రిక్ వస్తువుల ధరలు పెరిగేలా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని ఇప్పటికే ది కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయన్సెస్ మాన్యూఫ్యాక్చరర్ అసోసియేషన్ (సియామా) ప్రభుత్వాన్ని కోరింది. దీని ప్రకారం విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే ఎలక్ట్రిక్ వస్తువులపై కనీసం కస్టమ్స్ సుంకాన్ని పెంచాలని ఈ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వినియోగించే కీలకమైన కంప్రెషర్లు, ఓపెన్ సెల్, డిస్‌ప్లే, ప్యానెల్స్‌పై ప్రస్తుతం 5శాతం కస్టమ్స్ సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని 10శాతం వరకు పెంచవచ్చు.దిగుమతి చేసుకున్న భాగాలపై ప్రభుత్వం కస్టమ్స్ సుంకాలను పెంచితే స్థానిక తయారీదారులకు ఊతం లభిస్తుంది. వీరు కూడా పోటీ ధరలకు తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశం లభిస్తుంది. " అని సియామా అధ్యక్షుడు కమల్ నంది తెలిపారు.

అప్పుడు ఆర్‌బీఐ.. ఇప్పుడు సెబీ

- సెబీ ఆధికారాలకు కత్తెర వేసే యోచనలో కేంద్రం..?



ముంబయి: సెబీ అధికారాలకు కళ్లెం వేసేందుకు కేంద్రం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధికారాలకు కత్తెర వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాలు సిద్దం చేస్తుందని నేషనల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే కేంద్రం ఆర్బీఐకి కళ్లెం వేసిన విషయం తెలిసిందే. సెబీ ఏవైనా నిర్ణయాలు తీసుకొనే ముందు ఆ ప్రతిపాదనలను ఒక స్వతంత్ర కమిటీకి నివేదించాలని సూచించినట్లు సమాచారం. ఈ కమిటీలో సభ్యులుగా బోర్డు డైరెక్టర్లు ఉంటారా.. బయట వ్యక్తులు ఉంటారా అనే విషయంపై ఇంకా స్పష్టతరాలేదు. ఒక వేళ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ఈ కమిటీ సభ్యులను నియమిస్తే ప్రభుత్వానికి సెబీపై మరింత పట్టు లభిస్తుంది. సెబీ నిబంధనలను ఆమోదించే ముందు ఆ ప్రతిపాదనలను ఒక కమిటీ ఎదుట ఉంచాలని ఆర్థిక వ్యవహారాల విభాగం సూచించినట్లు సమాచారం. దీనికి భవిష్యత్తులో సెబీ చట్టానికి సవరణ కూడా చేయాల్సి రావచ్చు. దాదాపు 25 ఏళ్ల నుంచి సెబీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటోంది. కానీ ఈ కొత్త మార్పు వల్ల సెబీ నిర్ణయాలకు జవాబుదారీ బాధ్యతలు కూడా పెరుగుతాయి. కానీ సెబీ కొన్నేళ్లుగా అమల్లోకి తెచ్చిన నియమ నిబంధనల్లో ఒక్కదానిని కూడా పార్లమెంట్ మార్చలేదు. ఈ వార్తలపై సెబీ ఇంత వరకు స్పందించలేదు. అక్టోబర్ నెలలో ఆర్బీఐ స్వతంత్రత పై వివాదం చెలరేగింది. అప్పట్లో ప్రభుత్వం ఆర్బీఐపై సెక్షన్ 7ఎను ఉపయోగించినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. దీని ప్రకారం ఆర్బీఐ ఏ నిర్ణయం తీసుకొనే ముందైన ప్రభుత్వంతో చర్చించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు అనిపించినా.. బోర్డులోని నామినేటెడ్ డైరెక్టర్ల రూపంలో ఆర్బీఐ పట్టు సాధించింది.

పసిడి ధగధగలు...వెండి మెరుపులు

- రూ. 34వేల మార్క్‌ను దాటిన బంగారం



ఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలతో గత కొన్ని రోజులుగా పసిడి ధర పరుగులు పెడుతోంది. బుధవారం ఒక్కరోజే రూ. 320 పెరగడంతో బంగారం ధర రూ. 34వేల మార్కును దాటింది. బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పుత్తడి రూ. 34,070 పలికింది. అటు వెండి కూడా బంగారం దారిలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ల డిమాండ్ ఊపందుకోవడంతో కేజీ వెండి ధర రూ. 330 పెరిగి రూ. 41,330కి చేరింది. చైనాకు చెందిన హువావే సంస్థపై క్రిమినల్ విచారణకు అమెరికా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అమెరికా, చైనా మధ్య జరిగే వాణిజ్య చర్చలపై అనిశ్చితి ఏర్పడింది. ఈ పరిణామాలపై దృష్టిపెట్టిన మదుపర్లు బంగారంలో పెట్టుబడులు పెట్టడమే శ్రేయస్కరమని భావించారని, తద్వారా పసిడి ధర పెరిగినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గత రెండు రోజుల్లో బంగారం ధర రూ. 450 పెరిగింది. అంటే ఈ వారంలో ఇప్పటివరకు 10 గ్రాముల పసిడి ధర రూ. 770 పెరగడం గమనార్హం. అంతర్జాతీయంగా కూడా ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1,314.76 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.96 డాలర్లు పలికింది.



బజాజ్ ఆటో లాభం రూ. 1102 కోట్లు

- మెరుగైన ఫలితాలను ప్రకటించిన బజాజ్

ముంబై: దేశీ ఆటో రంగ దిగ్గజం బజాజ్ ఆటో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) మూడో త్రైమాసికంలో రెండంకెల వృద్ధిని సాధించింది. ఈ ఏడాది క్యూ3 (అక్టోబర్–డిసెంబర్)లో ద్విచక్ర తయారీదారు బజాజ్ ఆటో నికర లాభం 16 శాతం పుంజుకుని రూ. 1102 కోట్లను నమోదు చేసింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం పెరిగి రూ. 7409 కోట్లను తాకింది. గత ఏడాది రెవెన్యూ 6387 కోట్ల రూపాయలుగా ఉంది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 1246 కోట్లకు చేరగా.. ఇతర ఆదాయం రూ. 209 కోట్ల నుంచి రూ. 470 కోట్లకు ఎగసింది. మార్జిన్‌లు 19.5 శాతం నుంచి 15.6 శాతానికి బలహీనపడ్డాయి. తాజా ఫలితాలు విశ్లేషకుల అంచనాలను అందుకున్నప్పటికీ దలాల స్ట్రీట్‌ను మెప్పించలేకపోయింది. ఇన్వెస్టర్ల అమ్మకాలతో బజాజ్ ఆటో షేరు దాదాపు 2 శాతం నష్టపోయింది. అయితే మార్జిన్‌లు క్షీణించడంతో ఈ కౌంటర్లో అమ్మకాలు తలెత్తినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

డాలర్ పెరుగుదల వల్లే యాపిల్ విక్రయాల తగ్గుదల

- యాపిల్ సీఈఓ టీమ్ కుక్

శాన్‌ఫ్రాన్సిస్కో: గత కొంతకాలంగా భారత్‌లో ఐఫోన్ విక్రయాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే ఇందుకు కారణం లేకపోలేదని చెబుతున్నారు యాపిల్ సీఈవో టీమ్ కుక్. భారత్ పేరును నేరుగా ప్రస్తావించక పోయినప్పటికీ.. డాలర్ విలువ, బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ తదితర అనేక కారణాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ విక్రయాలు పెరగట్లేదని కుక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కంపెనీ ఆదాయ వ్యయాలపై కుక్ మార్కెట్ విశ్లేషకులతో మాట్లాడారు. 'అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ ఆదాయం 15శాతం తగ్గింది. దీనికి అనేక కారణాలున్నాయి. అందులో ఒకటి.. అమెరికా డాలర్ విలువ బలపడుతుండటం. అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ విలువ పెరగడంతో మా ఉత్పత్తుల ధర పెరుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ధరల మోత ఎక్కువగా ఉంటోంది. దీంతో కస్టమర్లు ఐఫోన్లు కొనేందుకు ఆసక్తి చూపించట్లేదు' అని కుక్ చెప్పుకొచ్చారు. ఇక తమ కంపెనీ అందిస్తున్న బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రొగ్రామ్ కూడా విక్రయాలు తగ్గడానికి ఒక కారణమని ఆయన అంటున్నారు. 'లక్షల మంది కస్టమర్లకు మేం బ్యాటరీలను ఉచితంగా రీప్లేస్ చేస్తున్నాం. దీంతో కస్టమర్లు తమ పాత ఐఫోన్లను ఎక్కువ కాలం వాడుతున్నారు' అని కుక్ వివరించారు. అయితే విక్రయాలు పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని కుక్ తెలిపారు. చైనాలో ఐఫోన్ ధరలు తగ్గించామని, భారత్‌లోనూ ధరలను తగ్గించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

స్పోర్ట్స్

మిథాలీ మరో ఘనత

- అత్యధిక యావరేజ్ కల్గిన బ్యాటర్‌గా మిథాలీ

హామిల్టన్: మహిళా క్రికెట్‌లో మిథాలీ రాజ్ మకుటం లేని మహారాణిగా ఎదిగిన విషయం తెలిసిందే. ఇప్పటికే మహిళల క్రికెట్‌లో ఎన్నో రికార్డులను తిరగరాసిన మిథాలీ.. తాజాగా తన ఖాతాలో మరో అరుదైన రికార్డును నమోదుచేసింది. వన్డే క్రికెట్‌లో ఛేజింగ్‌లో అత్యధిక యావరేజ్‌తో మిథాలీ సరికొత్త రికార్డు నెలకొల్పింది. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఛేదనలో 63 పరుగులతో నాటౌట్‌గా నిలిచి టీమిండియా విజయంలో మిథాలీ కీలకపాత్ర పోషించింది. ఈ క్రమంలో మిథాలీ ఛేదనలో అత్యధిక సగటును నమోదు చేయడవ విశేషం. కాగా ప్రపంచంలో ఏ బ్యాట్స్‌మెన్స్/బ్యాట్స్‌ఉమెన్స్‌కు సాధ్యం కాని ఉత్తమ గణాంకాలను మిథాలీ సాధించింది. ఛేజింగ్‌లో మిథాలీ యావరేజ్ 111.29గా ఉంటే ఎంఎస్ ధోని యావరేజ్ 103.07. ఆ తర్వాతి స్థానంలో విరాట్ కోహ్లి 96.23తో ఉన్నాడు. ఇప్పటి వరకు 199 వన్డే లాడిన మిథాలీ మొత్తం 6,613 పరుగులుతో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌ఉమెన్‌గా అగ్రస్థానంలో నిలిచింది. ఆమె ఖాతాలో ఏడు శతకాలు, 52 అర్ధశతకాలు ఉన్నాయి. బ్యాటర్‌గా ఎంతో రాటుదేలిన మిథాలీ వన్డే నాయకురాలిగా గొప్ప విజయవంతమైంది. ఆమె నేతృత్వంలో టీమిండియా 122 మ్యాచ్‌లాడగా 75 మ్యాచ్‌లో విజయం సాధించింది. ఇప్పటివరకు 85 టీ20 మ్యాచ్‌లు ఆడిన మిథాలీ 2,283 పరుగులు సాధించింది. టీ20ల్లోనూ అత్యధిక పరుగులు సాధించిన భారత మహిళా క్రికెటర్ మిథాలీనే కావడం విశేషం. మరోవైపు పురుషుల క్రికెట్లోనూ టీ20ల్లో ఈమెను అధిగమించిన బ్యాట్సెమెన్స్ లేకపోవడం విశేషం. ఆమె ఆడిన 10 టెస్టుల్లో 663 పరుగులు చేసింది.



52 ఏళ్ల కల నెరవేరేనా?

- నేడే 4వ వన్డే...
- శుభ్‌మన్ గిల్ అరంగేట్రం
- 200వ మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మ
- హాట్ ఫేవరేట్‌గా భారత్
- పరువుకోసం పాకులాడుతున్న కివీస్







హామిల్టన్: ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత్ న్యూజిలాండ్‌లో కూడా అదే జోరును కొనసాగిస్తోంది. బ్యాక్ టు బ్యాక్ విజయాలతో ఇప్పటికే సీరీస్‌ను కైవసం చేసుకున్న టీం ఇండియా. ఇప్పుడు నాలుగో వన్డేను కూడా కైవసం చేసుకునేందుకు రెడీ అయ్యింది. నేడు జరిగే వన్డేకు రెగ్యులర్ కెప్టెన్ కోహ్లీకి రెస్ట్ ఇచ్చిన నేపథ్యంలో , స్టాండింగ్ కెప్టెన్‌గా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. ఈ మ్యాచ్‌లో టీం ఇండియా మేనేజ్‌మెంట్ యువకులకు అవకాశం ఇచ్చే అవకాశం ఉంది. నేడు 19 ఏళ్ల యువ సంచలనం శుభ్‌మన్ గిల్ అంతర్జాతీయ వన్డేలో ఆరంగేట్రం చేయనున్నాడు. గాయంతో మూడో వన్డేకు దూరం అయిన సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని ఆడుతాడో లేదో అనేది టాస్‌కు ముందు నిర్ణయించనున్నారు. అతనికి తగిలిన గాయంపై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ఒక వేళ ధోనీ అందుబాటులోకి వస్తే దినేష్ కార్తిక్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. ఓపెనర్ గా గాడిలో పడ్డ శిఖర్ ధావన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ లు మరోసారి మంచి ఆరంభం ఇస్తే కీవీస్‌కు కష్టాలు తప్పవు. తర్వాత శుభ్‌మన్ గిల్, రాయుడు, ధోనీ, కేదార్ జాదవ్, హార్థిక్ పాండ్యలతో కూడిన టాప్ ఆర్డర్, మిడిలార్డర్ బలీయంగా కనిపిస్తోంది. ఇక స్పిన్ విభాగంలో మూడు మ్యాచ్‌లలో కుల్‌దీప్ యాదవ్ (8), ఛాహల్‌లు(6) చెలరేగుతున్నారు. వీరికి తోడుగా సీనియర్ టీం ఇండియా పేసర్ మహ్మద్ షమీ అద్బుతంగా బౌలింగ్ చేస్తూ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లను గెలుచుకుంటున్నాడు. కానీ ఆ మ్యాచ్‌లో షమికి కాస్త రెస్ట్ ఇవ్వాలని కూడా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఒక వేల షమికి రెస్ట్ ఇస్తే అతని ప్లేస్‌లో ఖలీల్ అహ్మద్‌ను కానీమహ్మద్ సిరాజ్ కానీ తుది జట్టులో తీసుకునే అవకాశం ఉం ది. ఎందుకంటే ప్రపంచ కప్‌లో పాల్గొనే రిజర్వ్ బెంచ్‌లో మరో పేసర్‌కు అవకాశం ఉన్న నేపథ్యంలో వీరికి మరిన్ని అవకాశాలిచ్చి ప్రోత్సాహించాలని చూస్తోంది. రెండు విభాగా ల్లో చూసినా భారత్, కివీస్‌తో పోల్చుకుంటే చాలా బలంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే విదేశాల్లో 52 ఏళ్ల తర్వాత 4–0తో న్యూజిలాండ్ ను మట్టికరిపించిన జట్టుగా భారత్ రికార్డులకెక్కనుంది.

కివీస్ పుంజుకునేనా..?

స్వదేశంలో ముందెన్నడూ లేని విధంగా ఘోరంగా విఫలమై విమర్శలను ఎదుర్కొంటోంది న్యూజిలాండ్ జట్టు, కివీస్ కెప్టెన్ తొలి వన్డేలో 60 పైలుకు పరుగులు చేసి.. తర్వాత రెండు వన్డేలలో కీలక సమయంలో వికెట్‌ను పారేసుకున్నాడు కేన్ విలియమ్సన్. ఇక ఓపెనర్ మార్టిన్ గుప్తిల్ తన స్థాయికి తగ్గట్టు రాణించలేకపోతున్నాడు. ముఖ్యంగా భారత స్పిన్ ద్వయాన్ని సరిగా అంచనావేయలేక వికెట్‌ను సమర్పించకుంటున్నాడు. టామ్ లాథమ్, రాస్ టేలర్‌లు అప్పుడప్పుడూ మెరుస్తున్నారే.. గాని భారీ స్కోరును మాత్రం అందించలేక పోతున్నారు. ఇక బౌలింగ్‌లో ట్రెంట్ బౌల్ట్, లోకీ ఫెర్గ్యూసన్‌లు కూడా తేలిపోతున్నారు. సీమర్ డగ్ బ్రేస్‌వెల్, స్పిన్నర్ సోధిలు రాణిస్తున్నా..మిగతా వారు చేతులెత్తేస్తున్నారు. నేటి మ్యాచ్‌లో ఆల్ రౌండర్ జిమ్మీ నీషమ్ తుది జట్టులో చోటు దక్కించుకోనున్నాడు. ఘోర పరాజయాలలో తమ చెత్త ప్రదర్శనే కారణం అని ఇప్పటికే కేన్ విలియమ్సన్ ఒప్పుకున్నాడు కూడా, కానీ మిగిలిన రెండు మ్యాచ్‌లలో పుంజుకుంటామని కీవీస్ అంటోంది. గుప్తిల్ శుభారంభం చేస్తే కీవీస్ కలిసి వచ్చే అవకాశం ఉంది.





వారిద్దరిపైనే మా ప్రధాన దృష్టి

- కివీస్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్

హామిల్టన్: నాలుగో వన్డేలో టీంఇండియా ఓపెనర్లే తమ లక్ష్యమంటున్నాడు కివీస్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్. ఈ మ్యాచ్‌లో ఓపెనింగ్ జోడీని, మిడిలార్డర్‌ను దెబ్బ తీస్తామన్నాడు. మునుపటి కంటే బౌలింగ్ పద్ధతిలో మార్పులు చేసుకోవడం వల్లే గత మూడు వన్డేల్లో విఫలమయ్యామన్నాడు. 'ప్రపంచంలో అత్యుత్తమ జట్టైన టీమిండియాతో మేం పోరాడుతున్నాం. ఆ జట్టు మునుపటిలా లేదు. టీమిండియాలో పదునైన బౌలింగ్ చేసే వాళ్లున్నారు. బ్యాటుతో విధ్వంసం సృష్టించే ఆటగాళ్లు ఉన్నారు. అలాంటి జట్టుతో మేం గొప్పగా ఆడుతున్నాం. మా జట్టు బౌలింగ్‌లో తేలిపోతున్నదన్న అపవాదును నాలుగో వన్డేలో తుడిచేసుకుం టాం. క్రీజులోకి వచ్చిన భారత జట్టు బ్యాట్స్‌మెన్స్‌ను త్వరగా పెవిలియన్ చేరుస్తాం. అందుకు మా ప్రణాళికలు మాకున్నాయి. సిరీస్ వాళ్లకిచ్చేశాక మేం ఏం చేయలేమని చాలా మంది అనుకోవచ్చు. పర్యాటక జట్టు క్లీన్ స్వీప్ చేయకుండా వారిని అడ్డుకుంటాం. టీమిండియా ఆటగాళ్లకు పెవిలియన్ చేరడం ఇష్టం లేదనుకుంటా. అయినప్పటికీ మిడిలార్డర్‌ను త్వరగా కూల్చేస్తే మాకు విజయం అంత కష్టమేం కాదు. దీంతో పాటు ఓపెనింగ్ జోడీ దూకుడునూ కట్టడి చేయాలి' అని శాంట్నర్ తెలిపారు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.